ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 209 పేజీలు: 10+4 వెల: 6.50

## డిసెంబరులో పుతిన్ భారత్ పర్యటన
2లో

## నేతాజీ అస్థికలను భారత్‌కు రప్పించాలి: బోస్ కుమార్తె
5లో


కామారెడ్డిలో వరదబాధితులకు సాయం అందిస్తున్న సహాయక సిబ్బంది



# సాయమో రామచంద్ర!

### కుండపోతతో ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలు అతలాకుతలం

శుక్రవారం భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

### నీటమునిగిన వందలాది గ్రామాలు, కాలనీలు, సాయం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

### రంగంలోకి ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసు, ఫైర్ సిబ్బంది

### దాదాపు 17 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం

### 44వ జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు సర్వం కోల్పోయి... సాయం కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కురుస్తున్న వర్షాలు జనజీవనాన్ని అస్థవ్యస్థం చేశాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. భారీవర్షాలతో వరదల కారణంగా రోడ్లు కొట్టుకుపోవడంతో గ్రామాలు, గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. వరదల మూలంగా వాహనాలు వరదల్లో కొట్టుకుపోతున్నాయి. పశువుల పరిస్థితి దయనీయంగా మారింది.. వందలాది పశువులు మరణించినట్టు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్‌తో పాటు పలు జిల్లాలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ రోజులను వెళ్లదీస్తున్నారు. చాలా ప్రాంతాలలో ఇంకా భయానకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రాణనష్టం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వర్షాలవల్ల ఇబ్బందులు పడుతున్న >>2


ఖమ్మం జిల్లాలో కొట్టుకుపోయిన రహదారి


కామారెడ్డిజిల్లాలో ఛిద్రమైన రహదారులు

## భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

**భద్రాచలం, ప్రభాతవార్త :** భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరిగింది. గురువారం సాయంత్రం 6 గంటలకు 38.60 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం శుక్రవారం ఉదయం 8 గంటలకు 35.50 అడుగులకు చేరుకుని తగ్గుముఖం పట్టింది. దీంతో మరింత తగ్గుముఖం పడుతుందని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఉదయం 9 గంటల నుంచి గోదావరి ప్రవాహం వేగంగా పెరిగింది. పెను తుఫాన్‌ల కారణంగా గోదావరి ఉపనదులు అయిన ప్రాణహిత, ఇంద్రావతి పొంగి పొర్లడం, ఇంద్రావతి నది నుంచి మేడిగడ్డ ప్రాజెక్టు ద్వారా గోదావరికి వరద నీరు పోటెత్తడం, ఎగువన ఉన్న ప్రాజెక్టులు అన్ని నిండడంతో గోదావరి నది దిగువ ప్రాంతానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. పేరూరు వద్ద గోదావరి నది ఉదయం 11 గంటల సమయంలో 16.550 మీటర్ల ఎత్తులో ప్రవాహించగా రాత్రి 7 గంటల సమయంలో 16.660 మీటర్ల ఎత్తులో ప్రవహించింది. అదేవిధంగా కాళేశ్వరం వద్ద రాత్రి 8 గంటల సమయంలో 12.350 మీటర్ల ఎత్తులో గోదావరి నది ప్రవాహించగా >>2



## ప్రపంచం ఆశలు భారత్ పైనే..

### ఇండియా అభివృద్ధిలో జపాన్ భాగస్వామ్యం

### టోక్యోలో జరిగిన ఇండో-జపాన్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ప్రధాని మోడీ

### గాయత్రీ మంత్రం పఠిస్తూ మోడీకి స్వాగతం

### జపాన్ పెట్టుబడులు 40 బిలియన్ డాలర్లు పైనే

**టోక్యో, ఆగస్టు 29:** ప్రపంచం అంతా భారత్‌పైనే ఆశలు పెట్టుకుందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. విదేశీ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం పెరిగిందని, పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా రెట్టింపు అవుతుందని అన్నారు. భారత్ జపాన్ వార్షిక సదస్సు కోసం ఆ దేశంలో పర్యటిస్తున్న ప్రధాని టోక్యోలో ఇండియా జపాన్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొన్నారు. జపాన్ వ్యాపార దిగ్గజాలు హాజరైన ఆ సదస్సుకు మోడీని, జపనీయులు గాయత్రి మంత్రం పఠిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాన మంత్రి భారత్ జపాన్ మధ్య లోతైన భాగస్వామ్యాన్ని ప్రస్తావించారు. భారత అభివృద్ధి ప్రయాణంలో జపాన్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోడీ గుర్తుచేశారు. మెట్రోలు, సెమీకండక్టర్స్, స్టార్టప్‌లు, మాన్యుఫక్చరింగ్‌లు ఇలా అనేకరంగాల్లో తోడ్పాటు అందించిందన్నారు. ఇప్పటికే జపాన్‌సంస్థలు భారత్‌లో 40బిలియన్ డాలర్లకన్నా ఎక్కువ పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. భారత్‌లో ఆర్థిక, రాజకీయ స్థిరత్వం నెలకొందన్న మోడీ ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించబోతోందని వివరిం >>2

## రేట్ల హేతుబద్ధీకరణ వల్ల తెలంగాణకు నష్టమే

### జిఎస్‌టి సమావేశంలో డి.సిఎం భట్టి విక్రమార్క

### 15 కీలక అంశాలపై చర్చించిన డి.సిఎం
2లో

# మరింత మెరుగైన విద్య

### స్కూలు నుంచి వర్సిటీదాకా నాణ్యమైన ప్రమాణాలు

### విద్యార్థులు, టీచర్లకు ఫేసియల్ రికగ్నిషన్

### గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లులు

### విద్యాశాఖ సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి


శుక్రవారం ఐసిసిసిలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 29:** రాష్ట్రంలోని పాఠశాలల నుంచి యూనివర్సిటీ వరకు మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సుల కాలేజీల్లోని విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సిఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు. శుక్రవారం ఉదయం విద్యా శాఖపై ఐసిసిసిలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, సిఎంఒఎస్డీ వేముల శ్రీనివా >>2

## రెండు రోజుల్లో 21వేల టన్నుల యూరియా

### వచ్చేనెల 28 వేల టన్నులు రాక

### పంటనష్టంపై సమగ్ర నివేదిక: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** రానున్న రెండు రోజులలో రాష్ట్రానికి 21,325 మెట్రిక్ టన్నుల యూరియారానుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈయూరియా రాష్ట్రంలోని గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లి ప్రాంతాలకు చేరుకుటుందని, అక్కడి నుండి డిమాండ్‌పరంగా జిల్లాలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ మొదటివారంలోగా రాష్ట్రానికి మరో 27,950 టన్నుల యూరియా రానుందని వివరించారు. రాష్ట్రంలో వరి పంటకు మొదటి, రెండవ విడతల యూరియా వేయడం జరుగుతోందని, త్వరలో మూడవ విడతతో పాటు ఎంఒపి వాడకం కూడా ప్రారంభమవుతుందని ఈ పరిస్థితుల్లో కేవలం వరి పంటకే సెప్టెంబర్‌లో 2.81 >>2

## 4.10 లక్షల ఎకరాల్లో పంట నష్టం

### భారీ వర్షాలకు నీట మునిగిన చేలు

### ఇసుక మేటలు వేసిన పొలాలు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** వర్ష బీభత్సం అన్నదాతకు అపారనష్టాన్ని మిగిల్చింది. ఎక్కడికక్కడ వరదనీటిలో పంటలు కొట్టుకుపోయాయి. పలుచోట్ల పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి, పత్తి, మక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.10 లక్షల ఎకరాల్లోని పంటలకు నష్టం జరిగినట్టు తెలుస్తున్నది. దీంతో వేలాదిమంది రైతులకు తీరని నష్టం మిగిలింది. ఇందులో 1.80 లక్షల ఎకరాల్లోని పత్తి చేలు నీట మునిగాయి. అలాగే మరో 1.30 లక్షల ఎకరాల్లో వరిచేలు వరద ముంపునకు గురైంది. ప్రధానంగా రాష్ట్రంలోని మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, కొత్తగూడెం, జనగాం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట్, ములుగు, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హన్మకొండ తదితర జిల్లాల్లో అత్యధికంగా పంటలు నీట మునిగాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 5 లక్షలకు పైగా ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అంచనా వేస్తున్నారు. వాగులు, వంకలు, చెరువులు, కాల్వలు పొంగి పొర్లడంతో పొలాల్లోకి భారీగా నీరు వచ్చి చేరింది. పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, కూరగాయల తోటలకు వర్షాలు, వరదలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ఈ మేరకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దెబ్బతిన్న పంటలో ప్రధానంగా వరి, పత్తి, కూరగాయల తోటలు అత్యధికంగా ఉన్నాయి. పత్తి పూత దశలో ఉండటం, వరినాట్లు పూర్తయిన నేపథ్యంలో వర్షాలు, వరదలప్రభావం వీటిపై తీవ్రంగా చూపించాయి. పత్తి కాత దశలో ఉండగా, >>2





శుక్రవారం ములుగు ప్రాంతంలో వరదల పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

# ప్రపంచం ఆశలు భారత్ పైనే..

>> చారు. ప్రభుత్వపరంగా పారదర్శకమైన విధానాలను అవలంభిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ మార్కెట్లు భారీ రాబడిని అందిస్తున్నాయని, తమకు బలమైన బ్యాంకింగ్ రంగం, 700 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయని వివరించారు. అణుశక్తి, గ్రీన్ ఎనర్జీ, ఆటోసెక్టార్‌లో రెండు దేశాలు మరింత కలిసికట్టుగా పనిచేయాలని మోడీ సూచించారు. జపాన్ ఓ టెక్ పవర్‌హౌస్, భారత్ ప్రతిభకు కేంద్రమని ప్రధాని మోదీ అన్నారు. ఈ రెండు కలిసిపోతే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించగలవని పేర్కొన్నారు. ఏఐ, సెమీకండక్టర్, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారతదేశం సాహసోపేతమైన, ప్రతిష్టాత్మకమైన చర్యలు తీసుకుంది. జపాన్ సాంకేతికత, భారతదేశ ప్రతిభ కలిసి పనిచేస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించగలవు. 2030వరకు 500 గిగావాట్ల పునరుత్పాదక శక్తి, 2047 కల్లా 100 గిగావాట్ల అణువిద్యుత్ సాధనను లక్ష్యంగా భారత్ నిర్దేశించుకుంది. సోలార్ సెల్స్ అయినా, గ్రీన్ హైడ్రోజన్ అయినా భాగస్వామ్యం కోసం అపార అవకాశాలు ఉన్నాయి. స్వచ్ఛ ఇంధనం, పర్యావరణ అనుకూల భవిష్యత్తుపై సహకారం కోసం జాయింట్ క్రెడిట్ మెకానిజంపై భారత్ జపాన్ ఒక ఒప్పందంపై సంతకం చేశాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. జపాన్ ఆధునిక సాంకేతికత, భారత ప్రతిభ కలిస్తే రెండు దేశాలు ఆర్థిక సంబంధాలు విస్తృతంగా అభివృద్ధి చెందుతాయని జపాన్ ప్రధాని షిగెరూ ఇషిబా అన్నారు. అనేక జపాన్ కంపెనీలు మేక్ ఇన్ ఇండియాలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ సహకారం ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. నేడు సంతకం చేసిన కొత్త ఒప్పందాలు జపాన్ భారత్‌లో పెట్టుబడులు పెంచాలన్న సంకల్పానికి నిదర్శనం. ఇది రెండు దేశాలపై ఆధారపడి ఉన్న బలమైన సరఫరా గొలుసును నిర్మిస్తున్నట్టు స్పష్టం చేస్తోందని అన్నారు. జపాన్ ప్రధాని ఇషిబా ఆహ్వానం దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత ప్రధాని మోడీ ఈపర్యటనకు వచ్చారు.



శుక్రవారం టోక్యోలో ప్రధాని మోడీకి ఓ ఆలయ పూజారి 'దరూమా డాల్'ను కానుకగా అందిస్తున్న దృశ్యం

# ప్రధానిమోడీకి 'దరూమా డాల్' బహుమతి!

**టోక్యో, ఆగస్టు 29:** భారత్‌జపాన్ వార్షిక శిఖరాగ్రసదస్సులో పాల్గొనేందుకు ప్రస్తుతం జపాన్ రాజధాని టోక్యోలో ఉన్న ప్రదాని మోడీకి ఒక ఆలయ పూజారి 'దరూమా డాల్'ను కానుకగా అందించారు. జపాన్ సాంప్రదాయంలో అదృష్టం పట్టుదలకు చిహ్నంగా భావించే ఈ బొమ్మను ఇరుదేశాలమధ్య సుహృద్భావానికి ప్రతీకగా అందించినట్లు తేలింది. జపాన్ సాంస్కృతిక చిహ్నాల్లో దరూమా డాల్‌కూడా ఒకటి. అదృష్టం, పట్టుదల, స్థిరత్వానికి ప్రతీకగా ఈ బొమ్మ ఉంటుంది. గుండ్రటి ఆకారంలో కనిపించే ఈ ప్రతిమ ప్రకాశవంతమైన రంగులో ఉంటుంది. చాన్‌బద్ధమత స్థాపకుడిగా పేర్కొంటున్న బోదిధర్మ ఆధారంగా రూపొందించారని చెపుతారు. దాన్ని నెట్టినా నిటారుగా నిలబడటం దీని లక్షణం. ఇందుకు అనువైన బరువులోనే రూపొందిస్తారు. ఏడుసార్లు కిందపడినా ఎనిమిదోసారి లేచి నిలబడాలనే అర్థం వచ్చే ఓ జపనీస్ సామెతను ఈ బొమ్మ ప్రతిబింబిస్తుందని జపనీయులు భావిస్తారు. ఈప్రతిమను కొనుగోలుచేసినపుడు దాని రెండుకళ్లు తెలుపురంగులోనే వదిలేసి ఉంటాయి. కొనుగోలుచేసిన వ్యక్తిఏదైనా కోరిక లేదా లక్ష్యం నిర్దేశించుకుంటే తొలుత ఆ బొమ్మ ఎడమ కన్నును నల్లటిసిరాతో నింపాలి. ఆకోరిక లేదా లక్ష్యం నెరవేరినపుడు మాత్రమే కుడికన్నును సిరాతోపూర్తిచేయాలి. దీనివల్ల నిబద్ధత లక్ష్యఛేదనకు సజీవ సాక్ష్యంగా ఈప్రతిమ నిలుస్తుందనిభావిస్తారు. కుటుంబాలు, వ్యాపారులుతోపాటు రాజకీయ నేతలుకూడా తమ అభివృద్ధికి చిహ్నంగా దరూమా డాల్‌ను ఉపయోగిస్తారు.

# సాయమో రామచంద్ర!

>> వారిని ఆదుకునేందుకు ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్ఆర్‌డిఎఫ్, పోలీసు, ఫైర్ సర్వీస్ సిబ్బంది రంగంలో సహాయక చర్యలు చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదు. క్లౌడ్ బరస్ట్ కారణంగా ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో భారీ వర్షాలు కురవడంతో వందలాది గ్రామాలు, కాలనీలు నీట మునిగి అతలాకుతలం అయ్యాయి. భారీ వర్షాల ధాటికి సర్వం కోల్పోయిన లక్షల సంఖ్యలో ప్రజలు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలవల్ల ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకునేందుకు ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, పోలీసు, ఫైర్ సర్వీస్ సిబ్బంది రంగంలో దిగినా అరకొర సాయమే అందుతోందని ప్రజలు వాపోతున్నారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమయ్యాక రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి సహా పలు చోట్ల 43 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యింది. గతంలో ఆదిలాబాద్‌లో నమోదైన 33 సెంటీమీటర్లే అత్యధికంకాగా ఇప్పుడు ఉమ్మడి నిజామాబాద్‌లో అంతకు మించిన వర్షాలు కురిశాయి. ఇక రాష్ట్రంలో ఈ ఏడాది ఎనిమిది జిల్లాలలో అతి భారీ వర్షాలు, తొమ్మిది జిల్లాలలో భారీ వర్షాలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది సగటు వానలు 50 రోజులు కాగా కొన్ని జిల్లాలలో ఇది 65 నుంచి 94 రోజుల వరకు ఉండటం గమనార్హం. కాగా భారీ వర్షాల కారణంగా 44వ జాతీయ రహదారి అనేకచోట్ల తీవ్రంగా దెబ్బతినడంతో గంటల తరబడి ట్రాఫిక్ జాంలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. సదాశివనగర్ మండలం నుంచి బిక్కనూర్ టోల్‌గేట్ వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

**ఎనిమిది జిల్లాలలో ఇప్పటి వరకు అతిభారీ వర్షాలు, తొమ్మిది జిల్లాలో భారీ వర్షాలు నమోదు**

ఇదిలావుండగా ఈ ఏడాది ఇప్పటి వరకు మెదక్, నాగర్ కర్నూలు, మహబూబ్ నగర్, యాదాద్రి, వనపర్తి, కామారెడ్డి, నారాయణపేట్, సిద్దిపేట్ జిల్లాలలో అతి భారీ వర్షాలు, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట్, జోగుళాంబ గద్వాల, నల్లగొండ, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్, ఖమ్మం జిల్లాలలో భారీ వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ నివేదికలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఈ ఏడాది సగటు వర్షపాతం 50 రోజులు కాగా కొన్ని చోట్ల ఇది 94 రోజుల వరకు వుండడం గమనార్హం. మెదక్‌లో 94 రోజులు, నాగర్ కర్నూలులో 93 రోజులు, మహబూబ్‌నగర్‌లో 82 రోజులు, యాదాద్రిలో 81 రోజులు, వనపర్తిలో 74 రోజులు, కామారెడ్డిలో 68 రోజులు, నారాయణ్‌పేట్‌లో, సిద్దిపేట్‌లో 65 రోజులు వానలు పడ్డాయి. కాగా రంగారెడ్డి జిల్లాలో 59 రోజుల పాటు వానలు కురిశాయి. వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం సాధారణ వర్షపాతానికంటే 60 శాతం ఎక్కు వ అయితే అతి భారీ వర్షంగానూ, 20 శాతం ఎక్కువయితే భారీ వర్షంగానూ పరిగణిస్తారు. మొత్తం మీద ఈ ఏడాది ఇప్పటి వరకు వానాకాలం లో వానలు దంచికొట్టగా చాలాచోట్ల తీవ్ర నష్టాలు సంభవించి పంటలు దెబ్బతినగా ఇంకొన్నిచోట్ల రహదారులు దారుణంగా పాడైనాయి.

## ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంలో ఊరట

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో సంచలనం రేపిన ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి ఎపి క్యాడర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ కోర్టు రెండు నెలల క్రితం ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు శుక్రవారం స్టే విధించింది. దీనిపై ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. ఓఎంసి కేసులో తన పేరును తొలగించడంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను శ్రీలక్ష్మి సుప్రీం కోర్టులో సవాల్ చేయడం తెలిసిందే. శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సుందరేష్, జస్టిస్ ఎన్‌కె సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి దీనిపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. దీనిపై సిబిఐతో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి కేసు విచారణను వాయిదా వేసింది.

## 21వేల టన్నుల యూరియా

>> లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని చెప్పారు. ఇక ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు రాష్ట్రానికి 2.38 లక్షల టన్నుల లోటు ఏర్పడిందని తెలిపారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జరిగిన పంట నష్టంపై సమగ్ర నివేదిక తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని, అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంటనష్టంపై సమగ్ర నివేదిక తయారుచేయాలని పేర్కొన్నారు.

# మరింత మెరుగైన విద్య

>> సులు, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ పాల్గొన్నారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహారీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సిఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికిగానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ (ఈడబ్ల్యూఐడిసి) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సిఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహారీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సిఎం ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సిఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సిఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సిఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సిఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సిఎం ఆదేశించారు.

# ప్రధాని జన్‌ధన్ యోజనతో దేశంలో ఆర్థిక విప్లవం

## తెలంగాణలో 1.3 కోట్ల జన్‌ధన్ అకౌంట్లు.. రూ.5,055.35 కోట్లు జమ

## సామాన్యులకు అందుబాటులో బ్యాంకు సేవలు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని పెంపొందించడంతో పాటు కోట్లాది మందికి.. ముఖ్యంగా మహిళలు, యువత, అణగారిన వర్గాలకు గౌరవాన్ని అందించే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో తీసుకొచ్చిన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన విజయవంతంగా 11 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ ప్రజల గౌరవం, సాధికారత, దేశ ఆర్థిక వ్యవస్థను వృద్ధి బాటలో నడిపేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడిందని, ఈ పథకం ప్రారంభించిన సమయంలో దేశంలోని అనేకమంది బడుగు, బలహీన, పేద ప్రజలకు కనీసం బ్యాంకు ఖాతా కూడా లేదన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం 2014 ఆగస్టు 28వ తేదీన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనను అమల్లోకి తెచ్చింది. నాటి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 56 కోట్ల జన్‌ధన్ ఖాతాల్లో రూ.2.68 లక్షల కోట్ల నగదు జమ అయిందని అన్నారు. 2014కు ముందు దేశవ్యాప్తంగా మొత్తం 3.35 కోట్ల బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ బ్యాంకు అకౌంట్లు (జీరోబ్యాలెన్స్ సౌకర్యంతో బ్యాంకుఅకౌంట్లు) మాత్రమే ఉండగా.. వాటిలో ఖాతాదారులు జమ చేసుకున్న మొత్తం డబ్బు రూ.960 కోట్లు. మోడీ ప్రభుత్వం ప్రజలందరినీ బ్యాకింగ్ వ్యవస్థలోకి, సమ్మిళిత ఆర్థిక వ్యవస్థలోకి తీసుకొచ్చేందుకు సంస్కరణలు తీసుకొచ్చిందని అన్నారు. ఈ బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లను జన్ ధన్ ఖాతాలుగా మార్చిందన్నారు. ఈ సంస్కరణల ఫలితంగా 2014 నుంచి ఇప్పటివరకు ఈ 11 ఏళ్లలో ఈ జన్ ధన్ బ్యాంకు అకౌంట్లసంఖ్య 56కోట్లకు పెరగగా అందులో ఖాతాదారులు జమచేసుకున్న మొత్తం రూ.2.68 లక్షల కోట్ల నగదు ఉందని, అంటే ఇవాళ సామాన్యులు బ్యాంకు ఖాతాల్లో 1,572 (16 రెట్లు) వృద్ధి, అందులో ఆ ఖాతాదారులు జమచేసుకున్న మొత్తంలో 27,816 (278 రెట్లు) పెరుగుదల నమోదైందని అన్నారు ఇది ప్రజల భాగస్వామ్యంతో దేశం సాధించిన నిశ్శబ్ధ విప్లవం అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణలోనూ జన్‌ధన్ యోజన పథకంలో భాగంగా 1.3 కోట్ల అకౌంట్లు తెరవగా అందులో ఖాతాదారులు రూ.5,055.35 కోట్లు జమ చేసుకున్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి కూడా దళారుల ద్వారానే లబ్ధిదారులకు అందేదని, కేంద్రం రూపాయిపంపిస్తే.. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుడికి 15 పైసలే చేరేదని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సైతం చాలా సందర్భాల్లో ఆవేదన వ్యక్తంచేశారు. సామాన్యులు ఎదుర్కొంటున్న ఈసమస్యను పరిష్కరించేందుకు 2014 వరకు కూడా సీరియస్ ప్రయత్నం జరగలేదు. ఈ జన్‌ధన్ యోజన పథకం అందుబాటులోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ పథకాలతోపాటుగా, రాష్ట్ర ప్రభుత్వాల లబ్ధి కూడా ప్రత్యక్ష నగదు బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా దళారీ వ్యవస్థ లేకుండా 100 నేరుగా లబ్ధిదారులకు అందుతుందని అన్నారు. ఇది కాకుండా.. గతంలో బ్యాంకు సర్వీసులు ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో పేదలు వడ్డీ వ్యాపారుల చేతుల్లో మోసపోయే వారు. అధిక వడ్డీలకు అప్పు తీసుకుని, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయేవారు. పలు సంక్షేమ పథకాలు కూడా వారికి అందకపోయేవని అన్నారు. కానీ ఈపథకం అమల్లోకి వచ్చిన తర్వాత.. సామాన్యులు కూడా బ్యాంకు రుణాలు పొందేందుకు మార్గం సుగమమైందని పూర్తి నమ్మకం వచ్చిందన్నారు.

# మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

>> భద్రాచలం వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయానికి 37.50 అడుగులకు చేరుకున్న గోదావరి మధ్యాహ్నం 03 గంటల సమయానికి 39.90 అడుగులకు చేరింది. సాయంత్రం 6 గంటల సమయానికి 42.20 అడుగులకు చేరగా, 7.22 గంటల సమయానికి 43 అడుగులకు చేరుకుంది. దీంతో జిల్లా కలెక్టర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. 9 గంటల సమయానికి 43.90 అడుగులకు చేరుకుని 9,71,134 క్యూసెక్కుల వరద నీరు భద్రాచలం మీదుగా దిగువకు పయనమవుతుంది. కాగా మరో రెండు అడుగులు గోదావరి నీటిమట్టం పెరిగి నిలకడగా ఉండనుందని సంబంధిత అధికారులు అంచనా వచ్చారు. మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసిన వెంటనే జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితులను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నదని, ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే అవసరమైన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ నెంబర్లు సంప్రదించాలని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాల జాబితాను సిద్ధం చేయగా ఆ గ్రామాలను తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు విస్తృతంగా పర్యటించి ఆ గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి ఎప్పుడు వరదలు ముంచుకొచ్చినా అప్రమత్తంగా ఉండాలని, వెంటనే పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచిస్తున్నారు. గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుండడంతో కరకట్టకు ఉన్న స్లూయిస్‌లకు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇసుక బస్తాలు వేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సైతం గజ ఈతగాళ్లకు, రిస్క్యూ టీంలకు ప్రజలను ఎలా కాపాడాలనే అంశంపై మాక్ డ్రిల్ ద్వారా ఇప్పటికే అవగాహన సదస్సు నిర్వహించారు. గోదావరి నది వద్ద భక్తులు లోతుకు వెళ్ళకుండా మైక్ల ద్వారా హెచ్చరిస్తూ పోలీసులు, గజ ఈతగాళ్లు ఎప్పటికప్పుడు గస్తీ కాస్తున్నారు.

## వారం - వర్జ్యం

30-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
సప్తమి రా.10.46
విశాఖ మ.2.36
వర్జ్యం : రా.7.07-8.51
దు.తె.5.57-7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** శ్రమకు తగిన ఫలితాలు ఎక్కువగా చేతికి అందుతాయి. వాహనయోగం.

**వృషభం :** స్త్రీ సంతాన విషయమై విశేషంగా శ్రమించి సత్ఫలితాలు సాధిస్తారు.

**మిథునం:** చెప్పుకోదగిన మార్పు ఆలోచనాధోరణిలో ఏర్పడుతారు. వృత్తి, ఉద్యోగపరంగా రాణిస్తారు.

**కర్కాటకం :** ప్రెదుటివారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు.

**సింహం:** జీవితభాగస్వామితో రాజీ ధోరణి అవలంభించడం మేలు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**కన్య :** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. శుభవార్తలు అందుకుంటారు.

**తుల :** సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**వృశ్చికం:** ఆస్తి వ్యవహారాలు మీకు అనుకూలంగా మారే అవకాశాలు సూచిస్తున్నాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలలో స్తబ్ధత ఏర్పడినా చెప్పుకోదగ్గ నష్టం వాటిల్లదు.

**మకరం:** కోర్టుకేసులనుండి బయట పడతారు. దీర్ఘకాలిక సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటారు.

**కుంభం:** సంఘసేవా కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. వివాదాలకు, కోప తాపాలకు దూరంగా ఉండండి.

**మీనం :** భవిష్యత్తులో వాటి తాలూకా లాభాలు అందుతాయి. వాహనాలు కొనుగోలుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 4.10 లక్షల ఎకరాల్లో పంట నష్టం

>> పెసర చేన్లు చాలా వరకూ చివరి దశలో ఉన్నాయి. వరి పొలాలు ఇంకా నాట్ల దశలోనే ఉన్నాయి. నాట్లు దశలో వరి ఉండటంతో పలు చోట్ల ఇసుక, బురద మేటలు వేయగా, మరికొన్ని చోట్ల నీటిలో మునిగిపోవడంతో అవి కుళ్లిపోతున్నాయి. ఇంకొన్ని ప్రాంతాల్లో ఏకంగా ముందు తాకిడికి వేసిన వరి నాట్లు కొట్టుకుపోయాయి. గత మూడు రోజుల్లో కురిసన భారీ వర్షాలకు కామారెడ్డి, నిర్మల్, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. మిగతా జిల్లాల్లోనూ పంటలకు నష్టం తప్పలేదు. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. కొన్ని చోట్ల కట్టలు తెగిపోవడంతో ఆ నీళ్లన్నీ పంట పొలాల గుండా భారీ వరదలు ప్రవహించడంతో పొలాల్లో ఇసుక మేటలు వేసింది. పొలాల్లోనే నీళ్లు నిలవడంతో పంటలు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో పంటలు నామారూపాల్లేకుండా పోయాయి. ఎక్కడ చూసినా పంటపొలాల్లో నీళ్లు, ఇసుక దిబ్బలే కనిపిస్తున్నాయి.

# రేట్ల హేతుబద్ధీకరణ వల్ల తెలంగాణకు నష్టమే

**•జిఎస్‌టి సమావేశంలో డి.సిఎం భట్టి విక్రమార్క •15 కీలక అంశాలపై చర్చించిన డి.సిఎం**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 29:** న్యూఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక ప్రభుత్వ ఆధ్వర్యంలో 'జిఎస్‌టి రేట్ల హేతుబద్దీకరణ'పై వివిధ రాష్ట్రాల సంప్రదింపుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15 కీలక అంశాలను ఆయన సమావేశంలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రేట్ల హేతుబద్ధీకరణకు మద్దతు ఇవ్వడానికి మనమందరం సిద్ధంగా ఉన్నప్పటికీ.. సంక్షేమ పథకాలపై ప్రతికూల ప్రభావం చూపే నష్టం గురించి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయన్నారు. బహుళ పార్టీ వ్యవస్థ కలిగిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో.. ప్రతి రాష్ట్రం ముఖ్యమైనదని.. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, కేంద్రం నేరుగా లేదా కౌన్సిల్ ద్వారా రాష్ట్రాలను సంప్రదించి ఉండేదని.. కానీ దురదృష్టవశాత్తు రేటు హేతుబద్ధీకరణ ప్రకటన ఏకపక్షంగా జరిగిందన్నారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని.. తెలంగాణకు చాలా నిధులు అవసరమన్నారు. రాష్ట్రాలకు ఆదాయం తగ్గుతుందని, దానికి పరిహారం చెల్లిస్తామని జిఎస్‌టి విధానాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. గడిచిన 5 సంవత్సరాల కాలంలో జిఎస్‌టి ద్వారా ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేశారని.. తద్వారా పరిహార సెస్సును నిలిపివేయవచ్చన్నారని భట్టి చెప్పారు. తెలంగాణ జిఎస్‌టి ఆదాయం 2024-25 వరకు మాత్రమే 10 శాతం సిఎజిఆర్ సాధించిందని గుర్తించాం. ఇది వ్యాట్‌లో 18 శాతం సిఎజిఆర్ ఉందన్నారు. తెలంగాణ ఆర్థిక చర్యల స్వేచ్ఛతో వ్యాట్‌ను కొనసాగించి ఉంటే.. 2024-25 సంవత్సరానికి ఆదాయం రూ.69,373 కోట్లు ఉండేదని.. కానీ జీఎస్టీ ద్వారా ఆదాయం రూ.42,443 కోట్లు మాత్రమే వచ్చిందన్నారు. రాష్ట్ర సొంత పన్ను ఆదాయంలో జిఎస్‌టి వసూళ్లు 39 శాతమే.. అందువల్ల, జీఎస్టీ రేట్లలో ఏవైనా తగ్గింపులు ఉంటే.. కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ఆదాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. ప్రతిపాదిత రేటు హేతుబద్ధీకరణ కారణంగా తెలంగాణ రాష్ట్రం కనీసం రూ.5,100 కోట్లు నష్టపోతుందన్నారు. విభజనతో పాటు, నష్టం దాదాపు రూ.7,000 కోట్లు ఉంటుందని.. ఇది జిఎస్‌టి ఆదాయంలో దాదాపు 15 శాతమన్నారు. తెలంగాణ ఆదాయంలో 80 శాతం కంటే ఎక్కువ సంక్షేమ వ్యయం కోసం ఉద్దేశించబడిందన్నారు. తెలంగాణ జిఎస్‌టి, జీఎస్డీపీ నిష్పత్తి 2022-23లో 3.07 శాతం నుండి 2024-25లో 2.58 శాతానికి క్రమంగా తగ్గుతోందన్నారు. రాష్ట్రాలకు పన్ను విధించడంలో స్వేఛ్ఛ లేనప్పుడు, అంతరాన్ని తగ్గించడానికి అదనపు ఆదాయానికి తగిన విధానాన్ని ప్రవేశపెట్టకపోతే ఆర్థిక భారం భారీగా ఉంటుందన్నారు. రాష్ట్రాల ఆదాయాలను రక్షించడం, రాష్ట్రాలు సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్యక్రమాలను కొనసాగించేలా తగిన పరిహార విధానాన్ని రూపొందించాలని.. పన్ను తగ్గింపు, మినహాయింపు నిజంగా సమాజంలోని పేద, మధ్యతరగతి వర్గాల సమూహాలకు చేరేలా ఉండాలని ఉప ముఖ్యమంనరతి భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 3న తమిళనాడు భవన్‌లో ఇదే అంశంపై బ్రేక్‌ఫాస్ట్ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అక్కడ కూడా కీలక అంశాలపై చర్చించి.. కేంద్రానికి నివేదిస్తామని, త్వరలోనే జరగబోయే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాలను లేవనెత్తుతామని భట్టి స్పష్టం చేశారు.



శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన జిఎస్‌టి సమావేశంలో పాల్గొన్న డి.సిఎం భట్టి

## డిసెంబరులో రష్యా అధినేత

# పుతిన్ భారత్ పర్యటన!

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** అమెరికా సుంకాల భారం మోపుతున్న నేపథ్యంలో భారత్ మిత్రదేశాలైన రష్యా, చైనాతో ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ప్రధాని నరేంద్ర మోడీ త్వరలోనే వ్లాదిమిర్ పుతిన్‌ను కలువనున్నారు. ఇదివరకే మోడీ అహ్వానం అందుకున్న పుతిన్ ఈ ఏడాది చివరిలో భారత్‌కు రానున్నారు. ఈ విషయమై ఇప్పటికే క్రెమ్లిన్ స్పష్టత ఇచ్చింది. డిసెంబర్‌లో రష్యా అధినేత ఇండియా వస్తారని సమాచారం. అధికారికంగా షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత మోగిస్తున్నారు. 50శాతం టారీఫ్‌లు విధించడంతో ట్రంప్ దూకుడుకు చెక్ పెట్టాలని భావించిన ప్రధాని మోడీ రష్యాతో బంధాన్ని పటిష్టం చేసుకోవాలని భావించారు. అందులో భాగంగానే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌లు రష్యా వెళ్లి అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిశారు. ప్రస్తుతం షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో పాల్గొంటున్న భారత ప్రధాని సెప్టెంబర్ 1న పుతిన్‌తో భేటీ కానున్నారు. ఆ సందర్భంగా ఇరువురి మధ్య ద్వైపాక్షిక సంబంధాల గురించి డిసెంబర్ పర్యటన గురించి ప్రస్తావన వచ్చే అవకాశముంది. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత పుతిన్ మొదటిసారి భారత్‌పర్యటనకు వస్తుండటం గమనార్హం.



శ్రీశైలం డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

# ప్రాజెక్టులకు స్థిరంగా వరద

## జూరాల 24గేట్లు.. శ్రీశైలం 9 గేట్ల ద్వారా నీటి విడుదల

### కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ప్రాజెక్టులకు భారీ వరద నమోదవుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఉమ్మడి పాలమూరు వరప్రదాయిని జూరాలకు భారీ ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. దీంతో నిరంతరంగా నీటి విడుదల కొనసాగుతున్నది. జలాశయానికి 1,95,000 ఇన్‌ఫ్లో నమోదు కాగా, 24గేట్లు ఎత్తి దిగువకు 1,23,768 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.554టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. జూరాల ఎడమ కాలువకు 390, కుడి కాలువకు 490 క్యూ సెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 1,58,823క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

**881 అడుగులకు చేరిన శ్రీశైలం**

శ్రీశైలం డ్యాం నిండుకుండను తలపిస్తున్నది. గత నాలుగు రోజులుగా 9గేట్ల ద్వారా నిరంతరంగా దిగువకు నీటిని విడుదల చేస్తుండగా శుక్రవారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు 9గేట్లను 10అడుగులు మేర ఎత్తి నీటి విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం 885అడుగులకు గాను 881.60అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 197.0114 టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల పవర్ హౌజ్ నుంచి 33403, గేట్ల ద్వారా 1,23,768 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 20,196క్యూసెక్కులు వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 65,541 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 2,38,626 క్యూసెక్కులు విడుదల చేశారు. మొత్తంగా డ్యాంకు 2,43,377 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, 3,04,167క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది.

# స్వతంత్ర ఎమ్మెల్యేగా అసెంబ్లీ సమావేశాలకు రాజాసింగ్!

**హైదరాబాద్ (గోషామహల్), ఆగస్టు 29, ప్రభాతవార్త:** బిజెపి ఎమ్మెల్యేగా 11 సంవత్సరాలపాటు శాసనసభ సమావేశాలకు హాజరైన గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యుడు టి.రాజాసింగ్ శనివారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు స్వతంత్ర ఎమ్మెల్యేగా వెళతానని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియా మాట్లాడుతూ రాజాసింగ్ బిజెపి నుంచి గెలిచినప్పటికీ, తాను స్వేచ్ఛగా మాట్లాడేందుకు స్వేచ్ఛ దొరి కిందన్నారు. బిజెపిలో చాలావరకు ఎంపిలు, ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నట్లు తెలిపారు. ఒకప్పుడు అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలన్నా పార్టీ అగ్రనాయకత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉండేదని గుర్తు చేసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేవరకు సభలో మాట్లాడే అవకాశాన్ని పార్టీ ఇచ్చేది కాదన్నారు. కాని సభలో తనకు మాట్లాడే అవకాశమిస్తే వివిధ అంశాలు లేవనెత్తుతానన్నారు. తనలాగే బిజెపిలో చాలామంది ఎంపిలు, ఎమ్మెల్యేలు తీవ్రఅసంతృప్తితో ఉన్నట్లు పేర్కొన్నారు. దీనికి ఉదాహరణ చేవేళ్ల ఎంపి వ్యవహారమేనన్నారు. వారిలాగే పదవులు పోతాయని పార్టీలో జరుగుతున్న ఇబ్బందులపై నోరువిప్పడం లేదన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్న వాటిని కొంతమంది సర్వనాశనం చేశారంటూ బిజెపిలోని పలువురు నేతలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే ఇప్పటివరకు ఢిల్లీలోని బిజెపి నేతల నుంచి తనకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ఒకవేళవస్తే రాష్ట్రంలో నెల కొన్న ఇబ్బందులను వారికి వివరించిన తర్వాతేనే మళ్లీ ఆ పార్టీలోకి వెళ్తానని స్పష్టం చేశారు. లేకుంటే చచ్చినా మళ్లీ ఆ పార్టీలోకి వెళ్లనని ఆయన కరాఖండిగా చెప్పారు. ఇక పార్టీలోని పలువురు ఎంపిలు తమ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఒక ఎమ్మెల్యేను సైతం గెలిపించలేకపోయారని గుర్తుచేశారు. ఇప్పుడు తాను బిజెపి ఎమ్మెల్యేగా కాకుండా స్వతంత్ర ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతానన్నారు.

# భారీ వర్షాలకు మెదక్ రైల్వేలైన్ ధ్వంసం

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరదలు పోటెత్తడంతో కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో వరదలలో రైల్వేలైన్ కొట్టుకుపోయింది. శమ్నాపూర్ రైల్వేబ్రిడ్జి కింది భాగంలో భారీగా వరదనీరు చేరుకోవడంతో గురువారం అర్ధరాత్రి రైల్వేలైన్ కింద భాగం కొట్టుకుపోయింది. అయితే శేఖర్ అనే రైతు రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో రైల్వేఅధికారులు హుటాహూటిన సికిందరాబాద్-నిజామాబాద్, అక్కన్నపేట-మెదక్ మార్గంలో రాకపోకలను ఆగమేఘాలపై నిలిపివేశారు. ఏడుపాయల దేవాలయం వరదలలో పూర్తిగా మునిగిపోగా.. వరదనీరు దేవాలయం ఎత్తుకుచేరుకుంది. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో దేవాలయంవైపు భక్తులు వెళ్లొద్దని అధికారులు సైతం హెచ్చరికలు జారీ చేశారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహనాలను దారిమళ్లిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు నిర్మల్‌లో కొండాపూర్‌మీదుగా మళ్లించారు. కామారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి 44పై భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడడంతో 20 కిలోమీటర్లమేర రాకపోకలు నిలిచిపోయాయి. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డును బ్లాక్ చేశారు. సదాశివనగర్ నుంచి పొందుర్తి వరకు వాహనాలు నిలిచిపోయాయి. క్యాసంపల్లి వద్ద జాతీయ రహదారి కుంగిపోవడంతో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.

# రుద్రప్రయాగ్‌లో ఆగని మేఘవిస్ఫోటం!

## కూలిపడుతున్న వంతెనలు

## మునిగిపోతున్న పలు గ్రామాలు

## శిథిలాల కింద విలవిల్లాడుతున్న జనం



**డెహ్రాడూన్, ఆగస్టు 29:** ఉత్తరాది రాష్ట్రాల్లో వరద బీభత్సం ఇప్పటికీ తగ్గలేదు. భారీ వర్షాలకు వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. వంతెనలు సైతం కూలి పడుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ చమోలి జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షం పలు గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి మేఘవిస్ఫోటం సంభవించింది. ఈ విపత్తులో పలువురు ప్రాణాలు కోల్పోగా పలుచోట్ల ఇళ్ల కూలడంతోపదుల సంఖ్యలోప్రజలు శిథిలాల కిందచిక్కుకున్నారు. మోపాటా ప్రాంతంలో భారీ వరదల్లో ఇద్దరు కొట్టుకునిపోయారు. పశువుల కొట్టం కూలడంతో సుమారు 20 పశువులు జలసమాధి అయ్యాయి. మేఘ విస్ఫోటం కారణంగా రుద్రప్రయాగ్‌లోని అలకనంద, మందాకిని నదుల నీటిమట్టాలు భారీగాపెరుగుతున్నాయి. రుద్రప్రయాగ్‌లోని హనుమాన్ ఆలయం పూర్తిగా వరదనీటిలో మునిగిపోయింది. వర్షాల కారణంగా కొండచరియలు విరిగి పడటంతో 180కిపైగా రోడ్లు దెబ్బతిని పూర్తిగా రాకపోకలు స్తంభించి పోయాయి. కేదార్‌నాథ్ లోయలోని లారా గ్రామానిక పట్టణంతో కలిపే వంతెన కొట్టుకు పోవడంతో ఆ గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచి పోయాయి. భారీ వర్షాల దృష్ట్యా, రుద్రప్రయాగ్, బాగేశ్వర్, చమోలి హరిద్వార్ తదితర జిల్లాల్లోని విద్యాల యాలను మూసివేసారు. ఉత్తరాఖండ్‌లో భారీ వరదల కల్లోలంపై రాష్ట్రసీఎం పుష్కరసింగ్ ధామి స్పందించారు. రుద్రప్రయాగ్‌లోని బాసుకేదర్ తహసీల్, చమోలి జిల్లాల్లోని దేవల్ ప్రాంతంలో మేఘ విస్ఫోటం కారణంగా అనేక కుటుంబాలు వరదల్లో చిక్కుకు పోయా యి. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండ టంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నదన్నారు. వరద ప్రవాహం ప్రమాదస్థాయికి చేరింది. ఎప్పటికప్పుడు వరద ప్రవాహం అంచనావేస్తూ లోతట్టు ప్రాంతాలప్రజలను అప్రమత్తం చేస్తున్నా రని తెలిపారు. వరద ప్రవాహ ధాటికిప్రజలు అడవుల్లోని మూగజీవాలు సైతం భారీ స్థాయిలో మృతి చెందుతున్నట్లు అటవీ అధికారులు పేర్కొన్నారు. వరదల్లో గల్లంతయిన వారి గురించి కచ్చితమైన సమాచారం లేకున్నా చాలామంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు తెలిపారు. ఆకస్మిక వరదలతో తప్పించుకునే మార్గం లేకపోయిం దని వివరించారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రాంనగర్ పెద్దకాలువలో వరదనీటి ధాటికి చిరుతపులి కొట్టుకుపోతున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. అనేక గ్రామాల్లో జంతువులు, పశువులు కూడా భారీ సంఖ్యలోనే మృతి చెందాయి.

# మహేంద్ర వర్సిటీ డ్రగ్స్ వ్యవహారంలో కొత్త కోణం

## మెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులే డ్రగ్స్ మాఫియా లక్ష్యం

## కొరియర్ ద్వారా పక్కాగా సరఫరా.. డిజిటల్‌లో చెల్లింపులు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** మహేంద్ర వర్సిటీలో వెలుగు చూసిన డ్రగ్స్ రాకెట్‌లో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో సూత్రధారులుగా వున్న నిందితులు, వీరి వెనుక వుండి నడిపిస్తున్న నైజీరియన్ డ్రగ్స్ స్మగ్లర్లు రాష్ట్రంలోని మెడికల్, ఇంజనీ రింగ్ విద్యార్థులను టార్గెట్ చేస్తున్నట్లు ఈగల్ (పూర్వపు టి.నాబ్) పోలీసులు గుర్తించారు. కొత్తగా చేరిన మెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులను ఒక పథకం ప్రకారం డ్రగ్స్ ఉచ్చులోలాగి వారికి మొదట ఉచితంగా అందిస్తూ ఆ తరువాత వారు బానిసలుగా మారాక డబ్బులకు అమ్ముతున్నట్లు ఈగల్ పోలీసులు తేల్చారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు డ్రగ్స్ పెడ్లర్లుగానూ మరికొందరు స్మగ్లర్లుగానూ మారినట్లు తేలింది. మెడికల్, ఇంజనీరిం గ్ విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న డ్రగ్స్ స్మగ్లర్లు ఇందుకోసం ప్రముఖ కొరియర్ కంపెనీలను ఎంచుకున్నట్లు ఈగల్ పోలీసుల విచారణలో తేలి ంది. కొరియర్ కంపెనీలలో ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, మట్టి గాజులు, వైద్య శాస్త్ర పుస్తరాలు, ఇంజనీరింగ్ విద్యకు సంబంధించిన పుస్తకాలు, ఆయుర్వేద ఉ త్పత్తులు, కాస్మోటిక్స్ వస్తువులు, ఆలంకరణ వస్తువుల మధ్య డ్రగ్స్ వుంచి పంపుతున్నట్లు ఈగల్ పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ స్మగ్లర్లు విద్యార్థుల ఆర్థిక వెసులుబాటును బట్టి గంజాయి, హెరాయిన్, ఎపిడ్రిన్, ఎండిఎంఎ, ఓజి గంజాయి వంటి డ్రగ్స్ పంపుతున్నట్లు ఈగల్ పోలీసులు తేల్చారు. రెండేళ్లుగా మహేంద్ర వర్సిటీతో పాటు రాష్ట్రంలోని పలు వర్సిటీలు, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలలో డ్రగ్స్ దందాలు సాగుతున్నట్లు ఈగల్ పోలీ సులు గుర్తించారు. ఇప్పటి వరకు పదికిపైగా కొరియర్ కంపెనీల ద్వారా వంద కోట్ల రూపాయల డ్రగ్స్ సరఫరా అయినట్లు ఈగల్ పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ మాఫియా ఉచ్చులో వందలాది మంది మెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులు చిక్కుకున్నట్లు ఈగల్ పోలీసుల విచారణలో తేలింది. ఇందు లో కొందరు డ్రగ్స్‌కు పూర్తిగా బానిసలుగా మాని చదువులో పూర్తిగా వెనకబడినట్లు నిర్ధారణ అయ్యింది. వీరికి వెంటనే కౌన్సి లింగ్ ఇచ్చి పునరావాస కేంద్రాలకు తరలించి వైద్య సేవలు అందించకుంటే వారి ఆరోగ్యం మరింత దెబ్బతినే ప్రమాదం వుందని ఈ విభాగం అధికారులు భావిస్తున్నారు. మెడికల్, ఇంజనీరింగ్ కాలేజిలకు చెందిన వందలాది మంది విద్యార్థులు మాఫియా ఉచ్చులో చిక్కుకుని బయటకు రాలేక పోతున్నట్లు ఈగల్ పోలీసుల విచారణ లో తేలింది. వీరికి వెంటనే సహాయం అందించాల్సి న అవసరం వుందని ఈగల్ భావిస్తోంది.

**కమీషన్‌కు కక్కుర్తిపడి విద్యార్థుల జీవితాలతో కొరియర్ కంపెనీల చెలగాటం**

ఇదిలావుండగా మెడికల్, ఇంజనీరింగ్ కాలేజిలకు చెందిన విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేయడంలో కీలకంగా వున్న కొన్ని కొరియర్ కంపెనీలను ఈగల్ పోలీసులు గుర్తించారు. ఈ కంపెనీలు కమీషన్ కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఈగల్ పోలీసులు తేల్చారు. ఇందులో కొన్ని కంపెనీలపై ఇప్పటికే కేసులు నమోదు కాగా మిగతా వాటి భరతం పట్టేందుకు ఈగల్ సిద్ధమవు తోంది. కాగా డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన కేసుల్లో డ్రగ్స్ స్మగ్లర్లు చెల్లింపులంతా డిజిటల్ ద్వారానే తీసుకుంటున్నట్లు తేలింది. దీనిపైనా ఈగల్ పోలీసులు దృష్టి సారించారు.

# విపక్ష కూటమి నేతగా రాహుల్‌గాంధీయే సమర్థుడు!

## 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో అధిక శాతం ప్రజలు రాహుల్‌వైపే మొగ్గు



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీయే అత్యంత సమర్థుడని తాజా సర్వేలో వెల్లడైంది. ఇండియా టుడేసీఓటర్ నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో అత్యధిక మంది ప్రజలు రాహుల్ వైపే మొగ్గు చూపారు. ప్రతిపక్షాలను సమర్థంగా నడిపించగల నేత ఎవరనే ప్రశ్నకు, సర్వేలో పాల్గొన్న వారిలో 28.2 శాతం మంది రాహుల్ గాంధీకి మద్దతు తెలిపారు. ఈ సర్వేలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ 7.7 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ (6.7 శాతం), ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ (6.4శాతం), కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ (4.4 శాతం) వరుస స్థానాల్లో ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వేతో పోలిస్తే రాహుల్ గాంధీ ఆదరణ పెరగడం గమనార్హం. అప్పుడు ఆయనకు 23.9 శాతం మద్దతు లభించగా, ఇప్పుడు అది 28.2 శాతానికి చేరింది. అయితే, గత ఏడాది ఆగస్టులో వచ్చిన 32.3 శాతంతో పోలిస్తే ఇది కొంత తక్కువే. ప్రతిపక్ష నేతగా పనితీరు మెరుగుపడిందని సర్వేలో తేలింది. లోక్‌సభ ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ పని తీరుపై కూడా ప్రజల అభిప్రా యం సానుకూలంగా ఉన్నట్లు సర్వేలో తేలింది. ఆయన పనితీరు అద్భు తంగా ఉందని చెప్పిన వారి సంఖ్య ఫిబ్రవరిలో 25 శాతం ఉండగా, ఇప్పుడు 28 శాతానికి పెరిగింది. అదే సమ యంలో, ఆయన పని తీరు బాగాలేదు (పూర్) అని చెప్పిన వారి సంఖ్య 27 శాతం నుంచి 15 శాతానికి గణనీయంగా తగ్గింది. మరో 22 శాతం మంది బాగుందని, 16 శాతం మంది సాధారణం అని అభిప్రాయపడ్డారు. ఇండియా టుడేసీఓటర్ ఈ సర్వేను 2025, జూలై 1 నుంచి ఆగస్టు 14 మధ్య దేశవ్యాప్తంగా అన్ని లోక్‌సభ నియోజక వర్గాల్లో నిర్వహించింది. మొత్తం 2,06,826 మంది అభిప్రాయాలను సేకరించి ఈ నివేదికను రూపొందించింది.

# తహసీల్దార్ ఇంట్లో ఎసిబి సోదాలు

## రూ. 5 కోట్లకుపైగా ఆస్తులు ఉన్నట్లు అంచనా

**హన్మకొండ బ్యూరో, ఆగస్టు 29, ప్రభాతవార్త:** వరంగల్ జిల్లా ఖిల్లా వరంగల్ మండల తహసీల్దార్ బండి నాగేశ్వరరావుపై అవినీతి నిరోధక శాఖ దాడులు జరిపింది. ఆయన చట్టబద్ధ ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్టు బయటపడటంతో కేసు నమోదు అయింది. శుక్రవారం జరిగిన ఈ దాడుల్లో అధికారులు ఏడు చోట్ల దాడులు చేపట్టారు. ఇందులో ఆయన ఇల్లు, కుటుంబ సభ్యుల ఇళ్లు, ఆఫీస్ సహా పలు ప్రదేశాలు ఉన్నాయి. మొత్తం 5కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు అంచనా వేశారు. దర్యాప్తులో భాగంగా తహసీల్దార్ వద్ద భారీ ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. రూ. 1.15 కోట్ల విలువైన ఇళ్ల ఆస్తులు, 17 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూములు రూ. 1.42 కోట్ల విలువతో, 70 తులాల బంగారు నగలు రూ. 23.84 లక్షలు, 1,791 గ్రాముల వెండి వస్తువులు రూ. 92 వేల రూపాయలు, వాహనాలు (కార్లు రెండు, బైక్ ఒకటి) రూ. 34.78 లక్షలు, 23 గడియారాలు రూ. 3.28 లక్షలు, గృహోపకరణాలు రూ. 16.43 లక్షల విలువ కలిగినట్లు గుర్తించారు. మొత్తం బయటపడిన ఆస్తుల విలువ రూ. 5.02 కోట్లకు చేరుకుంది. అదనపు ఆస్తులపై కూడా అధికారులు పరిశీలన కొనసాగిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రభుత్వ అంచనాల కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం బండి నాగేశ్వరరావును అరెస్టుచేసి ఎస్‌పిఈ, ఎసిబి ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరు పరచనున్నారు. అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం కోరితే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని సూచించారు. ఫిర్యాదు దారుల పేరు, వివరాలు రహస్యంగా ఉంచబడతాయని ఏసీబీ అధికారులు తెలిపారు.

# నేషనల్ ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన బిసి గురుకుల విద్యార్థులు

## అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నేషనల్ ఫెన్సింగ్ పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులు పతకాలు సాధించారు. క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న గురుకుల విద్యార్థులను బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. నేషనల్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులు పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు 11 మంది హాజరయ్యారు. బిసి గురుకుల విద్యార్థిని సురేఖ వెండి పతకం, మరొక విద్యార్థిని రాణి కాంస్య పతకం సాధించారు. క్రీడా ప్రపంచానికి తెలంగాణ వేదిక కావాలన్న ప్రభుత్వ ఆలోచనను బిసి గురుకుల విద్యార్థులు అనుసరిస్తూ క్రీడా పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## అనారోగ్యకారణాలతో 'చైల్డ్ కేర్ లీవ్' తీసుకున్న

# సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ తీవ్ర అనారోగ్య కారణాలతో చైల్డ్ కేర్ లీవ్ తీసుకున్నారు. ఆమెకు ఆరు నెలల దీర్ఘ కాలిక సెలవు మంజూరు చేస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. కాగా తన అనారోగ్య కారణాలపై స్మిత సబర్వాల్ శుక్రవా రం నాడు ఎక్స్‌లో ఒక పోస్టు వుంచారు. తాను కొన్ని నెలలుగా వెర్టెబ్రల్ ఆర్టరీ డిసెక్షన్ (వివిడి) అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నానని అందులో వివరించారు. ఇది చాలానొప్పితో కూడిన అనారోగ్యం, దీని నుంచి నెమ్మదిగా కోలు కుంటున్నానని ఆమె తెలిపారు. కాగా మెదడుకు రక్తాన్ని స రఫరా చేసే ప్రధాన దమనులలో ఒకటైన వెర్టెబ్రల్ ఆర్టరీ డిసెక్షన్ లోపలి పొరలో చిన్న పాటి చీలిక ఏర్పడటాన్ని వివిడి అంటారని వైద్యులు తెలిపా రు. దీనివల్ల మెదడుకు రక్తప్రసరణ తగ్గి తీవ్రమైన తలనొప్పి, మెడనొప్పి, మాట్లాడడంతో ఇబ్బందులు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇది బ్రెయిన్‌స్ట్రోక్‌కు దారితీసే ప్రమాదం కూడా వుందని, అధిక రక్తపోటు, మైగ్రేన్ వంటి సమస్యలు ఈ వ్యాధికి కారణమయ్యే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

# దేశ భవిష్యత్తు కోసం ఇండియా కూటమికి మద్దతు ఇవ్వండి

## ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** దేశ భవిష్యత్తు కోసం ఇండియా కూటమికి మద్దతు ఇచ్చిన నా గెలుపుకు సహకారం అందించాలని ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కోరారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థితో కలిసి మహారాష్ట్రలో భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మహారాష్ట్రలో పలు కీలక నాయకులను మర్యాదపూర్వకంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కలిశారు. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే, ఎన్సీపీ అధినేత శరత్ పవార్‌లతో ఉపరాష్ట్రపతి అభ్యర్థి భేటీ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సి న అవసరంపై ఆయా నాయకులతో చర్చించారు.

# లా సెట్‌లో 6,218 మందికి సీట్ల కేటాయింపు

## 4 వరకు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్-2025లో భాగంగా మొదటి విడత సీట్ల కేటాయింపు చేశారు. మొదటి విడతలో 6218 సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 4లోపుగా కాలేజీల్లో చేరాలని అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాసెట్-2025లో భాగంగా మొదటి విడతలో భాగంగా కన్వీనర్ కోటాలో 7540 సీట్లు అందుబాటులో ఉండగా .. అందుకోసం 14,201 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వారిలో 6218 మందికి సీట్లను కేటాయించారు. సీటు పొందిన వారు నేటి(శనివారం) నుంచి సెప్టెంబర్ 4 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. 3 సంవత్సరాల కోర్సులో 5218 కన్వీనర్ కోటా సీట్లు ఉండగా.. 11,870 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. అందులో 4685 మందికి సీట్ల కేటాయింపు చేశారు. 5 సంవత్సరాల కోర్సులో 2259 సీట్లు కన్వీనర్ కోటాలో ఉండగా.. వాటి కోసం 2331 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు.. వారిలో 1533 మందికి సీట్ల కేటాయింపు చేశారు. మొత్తం 7540 సీట్లకి 14,201 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. మొదటి విడతలో 6218 మందికి సీట్ల కేటాయింపు చేశారు.

# ఆకాశంలో 'బ్లడ్ మూన్'

## వచ్చే ఏడున ఖగోళంలో మరో అద్భుతం

## సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా అరుదైన దృశ్యం



సెప్టెంబరు 7న సంభవించనున్న బ్లడ్‌మూన్ తాలూకు నాసా శాస్త్రవేత్తలు విడుదల చేసిన చిత్రం.

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ఖగోళ అద్భుతంగా పేర్కొనదగిన సంపూర్ణ చంద్ర గ్రహణం బాద్రపద పౌర్ణమినాడు వచ్చే సెప్టెంబరు నెల ఏడవ తేదీన భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను కనువిందు చేయనుంది. ఈ యేడాది మార్చి 14న ఏర్పడిన మొదటి సంపూర్ణ చంద్రగ్రహణం భారత్‌లో కనిపించని సంగతి తెలిసిందే. అయితే సెప్టెంబరు 7న సంభ వించనున్న సంపూర్ణ చంద్రగ్రహణం భారత్‌లో పూర్తిగా కనిపించనుంది. సాధారణ చంద్రగ్రహణానికి భిన్నంగా ఎరుపురంగులో చంద్రుడు కనిపించ నుండడంతో దీనికి బ్లడ్‌మూన్‌గా ఖగోళ శాస్త్రవేత్తలు నామకరణం చేశారు. భారత్‌లో ఈ సంపూర్ణ చంద్రగ్రహణం సెప్టెంబరు ఏడవ తేదీ రాత్రి 9.58 గంటలకు మొదలై ఎనిమిదవ తేదీ ఉదయం అంటే అర్ధరాత్రి 1.26 గంటలకు ముగుస్తుంది. అయితే సూత కాలం ప్రకారం ఈ గ్రహణ సమయం రాత్రి తొమ్మిదిన్నర గంటల నుంచి తెల్లవారు జామున మూడు గంటల వరకు వుంటుందని ఆగమన పండితులు చెబుతున్నారు. సంపూర్ణ చంద్ర గ్రహణంకారణంగా భారత్‌లో సూత కాలంవుంటుంది. భారత్‌లోని ఢిల్లీ, ముంబాయి, కోల్‌కతా, హైదరాబాద్, లక్నో, చండీగఢ్ సహా అన్ని ప్రధాన నగర వాసులు దీనిని వీక్షించవచ్చు. భారత్‌సహా న్యూజీలాండ్, అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ సహా ఆసియా దేశాలలోనూ ఈ గ్రహణం స్పష్టంగా కనిపిస్తుంది. చంద్రుడికి సూర్యుడికి భూమి అడ్డుగా వచ్చే సమయంలో సంభవించేదే సంపూర్ణ చంద్ర గ్రహణం. అయితే కొన్నిసార్లు భూమిపై నుంచి వడపోసిన కిరణాలు ఎరుపు రంగు లో కనిపిస్తుంటాయి. ఈ సమయలో సూర్యుని కాంతి భూమి వాతావరణం గుండా ప్రయాణించి, వంగి చంద్రుడిపై పడుతుంది. ఈ ప్రక్రియలో నీలిరంగు కాంతి వాతావరణంలో ఎక్కువగా చెదిరి పోతుంది. కేవలం, ఎరుపు, నారింజ రంగుల కాంతి కిరణాలు మాత్రమే చంద్రుడిని చేరతాయి. దీనివల్ల చంద్రుదు ప్రకాశవంతమైన ఎరుపు రంగులో దర్శనమిస్తాడు. ఇలాంటి గ్రహణాలను బ్లడ్‌మూన్‌గా పిలుస్తారు. ఈ ఏడాది మార్చి 14వ తే దీన సంభవించిన సంపూర్ణ చంద్రగ్రహణం కూడా బ్లడ్‌మూన్‌గానే వున్నా ఇది భారత్‌లో కనిపించలేదు. దీంతో దీనిని వీక్షించే అవకాశం ఇక్కడి ప్రజలకు లభించలేదు. భారత్‌లో చాలా యేళ్ల తరువాత బ్లడ్‌మూన్ కనిపిస్తుండ డంతో బిర్లా ప్లానిటోరియం సహా పలుచోట్ల సైంటిస్టులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఈ గ్రహణాన్ని ప్రత్యేకమైన కళ్లద్దాలతో లేదా నలుపురంగు కళ్లద్దాలతో చూడవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాగా సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా చిత్తూరులోని శ్రీకాళహస్తి ఆలయం మినహా తిరుపతి వెంకటేశ్వర ఆలయం సహా తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆ లయాలను మూసివేస్తారు. సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా భారత్‌లో సూత కాలం ఉంటున్నందున గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని ఆగమన పండితులు చెబుతున్నారు. ఈసారి సంభవించనున్న సంపూర్ణ చంద్రగ్రహణం రాహుగ్రస్త గ్రహణం అని శషభిష, పూర్వాభాద్ర నక్షత్రంపై ప్రభావం ఉంటుందని, కుంభరాశిలో జన్మించినవారు పూజలు చేయాలని వారు చెబుతున్నారు.


తెలంగాణ ప్రభుత్వం

**కొంపల్లి మునిసిపాలిటీ కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి-జిల్లా**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

కొంపల్లి మునిసిపాలిటీ మునిసిపల్ కమిషనర్ వారు టెండర్ ప్రకటన నం. 258/E1/KMC/2025 తేది: 28.08.2025 ప్రకారం, 2025-26 గ్రీన్ ఫండ్ క్రింద అభివృద్ధి పనులకు ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ఫేస్ క్రింద టెండర్ ఆహ్వానిస్తున్నారు. పనుల వివరాలు ఈ క్రింది విధంగా: 1. పనుల మొత్తం సంఖ్య : (1) నం. యొక్క పనులు. 2. పనుల మొత్తం విలువ : 50.00 లక్షలు. 3. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 29.08.2025 మ.3.00గం. వద్ద. 4. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 01.09.2025 మ.3.00గం. వద్ద. 5. బిడ్ తెరచు తేదీ: 01.09.2025 మ.3.30గం. వద్ద. 6. కార్యాలయానికి ఎడ్రస్ పేరు: మునిసిపల్ కమిషనర్, కార్యాలయం సంప్రదించటానికి: కొంపల్లి మునిసిపాలిటీ, సెల్ నం: 9491388409/ 9963641985/ 7997994234.

సం/-. కమిషనర్, కొంపల్లి మునిసిపాలిటీ.

DIPR.NO.7329-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 29.08.2025



दिल्ली विश्वविद्यालय

**ఢిల్లీ విశ్వవిద్యాలయం**

ప్రకటన నం.R&P/312/2025 తేది: 31.07.2025

వివిధ నాన్-టీచింగ్ ఉద్యోగాల నియామకం నిమిత్తం అర్హులైన అభ్యర్థుల నుండి నిర్దేశిత దరఖాస్తు ఫారంలో ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుతున్నవి. దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ 04.09.2025 లేదా ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి రెండు వారాలు. ఏది తర్వాత అయితే అది. వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్ www.du.ac.in దయచేసి వీక్షించండి. మరియు "Advertisement-Departments" హెడ్ క్రింద "Work with DU" క్లిక్ చేయండి.

ఏ చేర్పు / సవరింపు వెబ్‌సైట్‌పై మాత్రమే ఉంచబడును.

CBC 21231/12/0001/2526 రిజిస్ట్రార్

వార్త


కోపంగా ఉన్నప్పుడు నీవు ఏ పని చేయొద్దు. అప్పుడు అన్నీ పొరపాట్లే చేస్తావు.

-బల్తజాన్

# సుంకాల 'సమరం' !

భారత దేశ వాణిజ్య రంగంలో సుంకాల ప్రహసనం మొదలైంది. రష్యా చమురుతో ముడిపెట్టి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ ను చిన్నబుచ్చాలని చేస్తున్న ప్రయత్నమే ఈ సంకల మోత. అసలు కారణం ఏదైనా అమెరికా వాదన లోప భూయిష్టంగా ఉంది. ఈ విషయమై భారత్ కార్పొరేట్ వర్గాల్లో అసహనం వ్యక్తమోతోంది. ఇదేదీ తేలికగా తీసుకునే విషయం కానే కాదని ఇంటా బయట నుంచి భారత్ కి సూచనలందుతున్నాయి. అమెరికా భారత్ మీద రుద్దనున్న అనేకానేక సుంకాలు భారతీయ వాణిజ్యానికి పక్కలో బల్లెంలా గుచ్చుకుంటున్న విషయం సర్వులకూ విదితమే. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితికి ట్రంప్ సుంకాల పోటీయే కారణం. ఈ భారీ సుంకాలు స్టాక్ మార్కెట్ ను విపరీతంగా కుదిపేస్తు న్నాయి. నిన్న మొన్నటి వరకు భారత్ ఎగుమతులపై 25 సరిపెట్టుకున్న ట్రంప్ బుధవారం నుంచి మరో 25 శాతం వడ్డించారు. దాంతో గత రెండు రోజులుగా సెన్సెక్స్ 1555 పాయింట్లు పతనమయ్యాయి. రూ69 లక్షల కోట్లు మార్కెట్ సంపద ఆవిరైంది. ట్రంప్ టారిఫ్ ల ప్రభావంతో ప్రస్తుతం మార్కెట్లో అన్నీ ప్రతికూలతలే ఎదురవుతున్న తరుణంలో కార్పొరేట్ వర్గాలను నేషనల్ స్టాక్ ఎక్చేంజ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశిష్ కుమార్ చౌహాన్ ఊరడించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా అమెరికా సుంకాల పోటుతో రొయ్యలు, తోలు , జెమ్స్, జ్యువెలరీ కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. త్వరలో భారత్ ప్రపంచం లోనే మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న తరుణంలో అమెరికా సుంకాలు ఆశనిపాతంలా పరిణమించాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కార్పొరేట్ కంపెనీలు అమెరికా సుంకాలను తట్టుకుని నిలబడగలమన్న భరోసాతో ఉన్నాయి. అమెరికా భారత్ ఎగుమతులపై సుంకాలు వేసి ఇబ్బంది పెట్టడం ఒక విధంగా భారత మేలుకొలుపు అని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వ్యక్తం చేశారు . ఏ ఒక్క దేశం మీద అతిగా ఆధారపడ కూడదని ఈ ఉదంతం సూచిస్తోందని ఆయన అభిప్రాయం. అందుకే కేవలం భారత్‌నే సుంకాలతో వేధించడం అమెరికా అవివేకాన్ని తెలియ చేస్తోందని పలువురు ఆర్థిక శాస్త్రవేత్తలు సైతం వ్యాఖ్యా నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చైనా, జపాన్, యూరప్ , వంటి అన్ని దేశాల్లోనూ సమాన స్థాయిలో వాణిజ్య సంబంధాలు ఏర్పరచుకోవడం ద్వారా భారత్ ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుంతుంతుందన్నది వారి విశ్వా సం. మాస్కో యుద్ధానికి భారత్ పరీక్ష సహకారం అందిస్తోందని ట్రంప్ ప్రధాన సలహాదారు, ప్రముఖ ఆర్థిక వేత నవారో వ్యాఖ్యానించడాన్ని చూస్తే భారత విస్మయం చెందుతోంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం భారత అండదండలతోనే జరుగుతోందన్న అపవాదు కూడా ఆశ్చర్యపరుస్తోంది. రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేస్తూ రష్యాకు భారత్ ఆర్థిక అవసరాలు తీరుస్తోందని అమెరికా ఆరోపణ. అందుచేతనే రష్యా అధ్యక్షుడు పుతిన్ దిగి రావడం లేదని ,ట్రంప్ వంది మాగదులు అమెరికన్లలో విస్తృత వ్యాప్తి చేస్తున్నారు. రష్యా నుంచి భారత చమురు కొనడం ఆపివేస్తే భారత పై ట్రంప్ వడ్డించిన సుంకాలు ఉపసంహరణకుఅవకాశం ఉందని వారు భారత్ కు సూచిస్తున్నారు. ఈ టారిఫ్ ల సమస్య పరిష్కారానికి ఇరు దేశాల మధ్య సంప్రదింపులకు ఇప్పటికీ మార్గాలు తెరిచే ఉన్నాయని అమెరికన్ చట్టసభ విదేశీ వ్యవహారాల కమిటీ పేర్కొంది. రష్యా నుంచి చౌకగా చమురు లభిస్తున్నందునే కొనుగోలు చేస్తున్నామని భారత్ వివరించిన అమెరికా వితండ వాదం తగ్గనే లేదు. అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం పేరిట వాణిజ్య ఒప్పందం ఖరారైనా అందులో వినాశకర అంశాలుండవన్న గ్యారంటీ ఏమీ లేదు. ఆ ఒప్పందం లో భారతీయ రైతాంగానికి నష్టం చేసే అంశాలను అనుమతించేదిలేదని ప్రధాని నరేంద్ర మోదీ ఏనాడో స్పష్టం చేశారు. అమెరికాకు రైతన్న ప్రయోజనాలు తాకట్టు పెట్టబోమని చెప్పారు. ఇదిలా ఉండగా అందుకే దేశ గౌరవం మర్యాదలే ముఖ్యమని, దౌత్య విధానాలను పాటించకుండా ట్రంపు సుంకాల వడ్డింపు ఆయుధాన్ని ఎన్నుకోవడం తప్పని మారుతి సుజుకి ఇండియా చైర్మన్ ఆర్ సి భార్గవ్ విమర్శించారు . ట్రంపు సుంకాలతో దెబ్బతిన్న నఎగుమతి కంపెనీలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం ఆహ్వానించదగిన పరిణామం. దీనికోసం ఆరేళ్ల పాటు అమలులో ఉండే విధంగా రూ. 25 వేల కోట్ల నిధులతో ఎగుమతుల ప్రోత్సాహక కమిషన్ ను ఏర్పాటు చేయబోతున్నారు. ఒకపక్క పాకిస్థాన్‌కు సర్వవేళలా అభయహస్త మందిస్తూ భారతను చీకాకు పెట్టడంలో అమెరికా పాత్ర తక్కువేమీ కాదు. రష్యా చమురుకూ ,ఉక్రెయిన్ యుద్ధానికి మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లు బ్లాక్ మెయిలింగ్, బెదిరింపు ధోరణిని అవలంబిస్తున్న ట్రంప్ మార్గాన్ని ఎవరూ హర్షించడం లేదు. రష్యా నుంచి చమురు కొనుగోలు భారత్ ఆపనూ లేదు. అమెరికాకు తలొగ్గి భారత మార్కెట్ కు అత్యంత వినాశకర వాణిజ్య ఒప్పందాన్ని అంగీకరించను లేదు. దౌత్యపర సంబంధాల ద్వారానే అమెరికాను ఒప్పించగల చాణక్యాన్ని ప్రదర్శించి సానుకూల ఫలితాలను దేశానికి అందివ్వగలుగుతుంది. ట్రంప్ ధోరణి ఆత్మహత్య సదృశ మని అమెరికన్ ఆర్థిక వేత్త రిచర్డ్ వోల్ఫ్ కూడా హెచ్చరిం చారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికా మైత్రి కొనసాగించే దౌత్యవేత్తలను రంగంలోకి దింపాల్సి న అవసరం ఉంది.

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.



వి.జాన్సన్

ధైర్యం ఒక ఆయుధం. దాన్ని పట్టుకుంటే అసాధ్యాలన్నీ సుసాధ్యాలౌతాయి.



జార్జి. ఎలియట్

# ప్రజావాక్కు



## మార్వాడీ గోబ్యాక్ నినాదం సరికాదు

దేశంలో ప్రజలు, వ్యాపారులు ఏ రాష్ట్రంలోనైనా ఉపాధి పొందే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది. భారత పౌర సత్వం కలిగిన వారు తిరిగి ఏ రాష్ట్రంలో కూడా స్థానిక పౌరసత్వం పొందవలసిన అవసరం లేదు. నిరుద్యోగులు, వ్యాపారులు, సాంకేతిక నిపుణులు తమకు ఎక్కడైతే మెరుగైన ఉపాధి లబి. స్తుందో అక్కడికి వెళ్లి చట్టాలకు లోబడి తమ కార్య కలాపాలను కొనసాగించుకోవచ్చు. ఈ విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదు. అయితే ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో మార్వాడీ గోబ్యాక్ అనే నినాదం పుట్టుకువచ్చింది. ఈ నినాదానికి రాజకీయాలు తోడు కావడంతో ప్రస్తుతం ఈ అంశం ఎక్కువగా అం దరి ప్రచారంలో ఉంది. గతంలో ఒక మాజీ న్యాయ మూర్తి వైశ్యులు స్మగ్లర్లుగా పేర్కొన్నారు. అప్పట్లో ఈ అంశం తెగ వైరల్ అయ్యింది. కొందరు వైశ్యులు తమ వ్యాపారాల విషయంలో కొంత భయాం దోళనలకు గురైయ్యారు. కొంతకాలానికి ఇది సద్దుమణిగింది. ప్రస్తుతం అదే వైశ్యులను రెచ్చగొడుతూ మార్వాడీలపై గోబ్యాక్ నినాదాన్ని లేవనెత్తారు. ఇటు వైశ్యులు కాని, అటు మార్వాడీలు కాని నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారాలు నిర్వహించినా, వ్యవహరించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అనేక దర్యాప్తు సంస్థలు ఉన్నాయి. న్యాయస్థానాలు ఉన్నాయి. ఇటు మార్వాడీల్లో, అటు వైశ్యులు ఒకరిద్దరు అక్రమాలకు పాల్పడి ఉండవచ్చు. అయితే దీనిని మొత్తం ఆయా కులాలకు వర్తింపచేయడం సరికాదు. వ్యాపారులు ప్రజలకు మోసం చేసే విధంగా వ్యాపారం చేస్తే కనుక్కోలేని అమాయకత్వం ప్రస్తుతం ప్రజల్లో లేదు. ఎక్కడైతే తక్కువ ధరలకు, నాణ్యత కలిగిన వస్తువులు దొరుకుతాయో ప్రజలు అక్కడికి వెళతారు. డీమార్ట్, రిలయన్స్, అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఎన్ని కార్పొరేట్ సంస్థలు వచ్చిన స్థానిక వ్యాపారులను దెబ్బతీసిన సందర్భాలు లేవు. ఎవరి వ్యాపారం వారిది. వ్యాపారాల్లో ముఖ్యంగా కావాల్సింది నాణ్యత, ప్రజల నమ్మకం. దీనిని ప్రామాణికంగా తీసుకుని చేసే ఏ వ్యాపారమైనా, కార్యకలాపాలైనా ఏ ఒక్కరూ అడ్డుకోలేరు. ఇది చరిత్ర చెప్పిన సత్యం.

- మోహన్‌రాయ్, హైదరాబాద్

## టివిలు కట్టెయవలసి వస్తోంది

టి.వి. లలో ప్రసారమయ్యే డిబేట్లలో అన్ని పార్టీల ప్రతినిధులు, రాజకీయ విశ్లేషకులు పాల్గొంటారు. యాంకర్లు అడిగే ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాలి. కానీ వారిలో క్రమశిక్షణ లోపిస్తోంది. ఒకరు మాట్లాడుతుంటే మరోకరు అనవసరంగా కలగజేసుకుని గట్టిగా మాట్లాడుతుంటారు. అప్పుడప్పుడు మూడో వ్యక్తి కూడా తన అభిప్రాయాన్ని వెలుబుచ్చు తుంటారు. ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని తాను వారికి మరల అవకాశమిస్తానని యాంకర్లు మర్యాదగా మందలిస్తున్నా వినిపించుకోరు. టి.వి.ల ముందు కూర్చుని వినేవారికి ఈ గోల భరించ లేనంతగా ఉన్నది. టి.వి.లు కట్టెయవలసి వస్తోంది. వినేవారి మనోభావాలు యిలా ఉన్నాయని యాంకర్లు ముందుగా యీ లేఖను వారికి చదివి చెప్పి దారిలోకి తేవటానికి ప్రయత్నించవలెను.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## రైళ్ల సంఖ్యను పెంచాలి

ప్రపంచంలో ఎక్కువ జనాభా కలిగిన దేశం మన భారతదేశం 1853 వ సంవత్సరంలో భారతదేశంలో రైలు ప్రయా ణం ప్రారంభం అయినది . 140 కోట్లకు పైగా జనాభా కలిగిన దేశంలోని ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రయాణ సాధనాలలో ప్రధానమైన రైలు మార్గం ముఖ్యమైనది . జనాభా పెరిగిన నిష్పత్తిలో వారి ప్రయాణాల అవసరాల నిమిత్తం ప్రస్తుతం ఉన్న రైళ్ల సంఖ్యతో పాటుగా మరికొన్ని రైళ్లను ప్రారంభించాలి . ప్రతి రైల్వే స్టేషన్ లో ప్రస్తుతం ఆగుతున్న రైళ్లతోపాటుగా ప్రజల యొక్క ప్రయాణ అవస రాల నిమిత్తం నూతన రైళ్లకు ప్రతి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఉండాలి. ప్రతి రైళ్లకు రైలు భోల సంఖ్య కూడా పెంచాలి. గ్రామాల విస్తీర్ణాన్ని బట్టి రైల్వే ట్రాక్ కు సమీపంలో ఉన్న గ్రామాలలో కొన్ని చోట్ల కూడా నూతనంగా రైల్వే స్టేషన్ లను ఏర్పాటు చేసి మరికొన్ని గ్రామాలకు రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలి .

-డా. ఈ. వెంకటేశ్వర్లు . నెక్కొండ

## సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోప్రతీసోమవారం కలెక్టర్‌లు, ఎస్పీలు నిర్వ హించే స్పందనకు వచ్చే సమస్యలను తక్షణం తక్కువ సమ యంలో పరిష్కరించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకో వాలి. ప్రజలు వారివారి ఎన్నో సమస్యలను పరిష్కరించుకునేందుకు స్పందనకు వస్తూ ఉంటారు.

-డి. చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# ప్రకృతితో పరాచికాలు వద్దు

మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పవచ్చు. సాంకేతికంగా, ఆర్థికంగా, ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవచక తప్పలేదు. ఒక్క చైనాయే కాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నా చితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుంది. ముంబాయి నగరానికి అయితే ప్రతి వర్షాకాలంలోనూ వరద ముంపు తప్పడం లేదు. రోజుల తరబడి జీవనం స్తంభించిపోతున్నది. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్‌ల భారి నుంచి తీరప్రాంత ప్రజలు తప్పించుకోలేకపోతున్నారు. గత రెండు నెలలుగా బంగాళాఖాతలంలో అల్పపీడనమో, వాయుగుండమో, తుఫాన్‌లతో కురుస్తున్న వర్షాలతో తదితర రాష్ట్రాల ప్రజలు వణికిపోతున్నారు.

దామెర్ల సాయిబాబ

తమలపాకుతో నువ్విట్లంటే తలుపు చెక్కతో నేనట్లంటా అన్నట్టుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తుల నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యామైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు తప్పుపట్టాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సా నికి విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. గత నెల రోజులుగా భారత్‌లో కురుస్తున్న కుండపోత వర్షాలు దేశంలోని కొన్ని ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరభారత్‌లోని జమ్ము కశ్మీర్, హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలతోపాటు తెలుగురాష్ట్రాల్లో కూడా బీభత్సా న్ని సృష్టిస్తున్నాయి. కొండచరియలు విరిగిపడుతుండంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్థంబించిపోతున్నది. పురాతన భవనాలు కూలిపోతున్నాయి. ఎందరి ప్రాణాలో నీటిలో కలిసిపోతున్నాయి. మరెందరో గల్లంతైపోతున్నారు. వ్యవసాయ రంగానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతాకాదు. ఇక తెలుగు రాష్ట్రాల్లో గత వారం పది రోజులుగా కురిసిన, కురుస్తున్న కుంభవృష్టి తెలంగాణాలో కామారెడ్డి, నిర్మల్, అదిలాబాద్, మెదక్ తదితర జిల్లాలలో జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నది. ముఖ్యంగా కామారెడి, నిర్మల్, అదిలాబాద్ ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో ఇటీవల కాలంలో ఎన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో నలభైఅయిదు సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదు అయింది. ఆయా ప్రాంతాల్లో ప్రజాజీవనం స్థంభించి పోయింది. కొన్ని గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ప్రకృతి పగబట్టితే ఎంతటి విధ్వంసం సృష్టించగలదో చూపిస్తున్నది. ఇంకా వర్షాకాలం మరో మూడు నెలలు వరకు ఉంది. మరెన్ని వాయు గుండాలు, తుఫాన్లు రానున్నాయో చెప్పలేం. ఇప్పటికే భారీ ప్రాజెక్టులతో సహా చిన్ననీటి వనరులన్నీ పొంగిపొర్లుతున్నాయి. మరికొన్ని ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. పర్యావరణానికి మానవుడు చేస్తున్న చేటుతోనే ఈ పరిస్థితి దాపురిస్తున్నదనీ, ఇదే కానసాగితే అసలు మానవుడి జీవనమే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, దశాబ్దాల తరబడి పదేపదే హెచ్చరిస్తున్నా, వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. ఒక్క భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యావరణ పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారుతున్నది. ముఖ్యంగా అడవులు తరిగిపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. వాస్తవంగా భూమ్మీద ముప్పై శాతానికి పైగా అడవులు విస్తరించి ఉన్నాయి. ప్రపంచ జనాభాలో మూడోవంతు ప్రజలు వంటచెరుకు కోసం ఇప్పటికీ అడవుల మీదనే ఆధారపడుతున్నారు. అంతేకాదు అటవీరంగంపై ప్రత్యక్షంగానో, పరక్షంగానో ఉపాధి పొందుతున్నవారు భారీ ఎత్తునే ఉన్నారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో నాలుగోవంతు ప్రజలు వాటి నుంచే ఆదాయాన్ని పొందుతూ జీవనం సాగిస్తున్నారు. కోట్లాది వన్యప్రాణులకు అడవులు ఆవాసం కల్పిస్తున్నాయి. మానవాళికే కాదు సమస్త జీవకోటికి వివిధ రకాలుగా ఉపయుక్తమవుతున్న అటవీ సంపద అంతకంతకు తరిగిపోతున్నది. రెండేళ్ల క్రితం నాటి ప్రపంచ అడవుల స్థితిగతుల నివేదిక ప్రకారం గత రెండున్నర శతాబ్దాల కాలంలో నూటనాలుగు కోట్ల

## ఒక్క మాట

ఎకరాలకుపైగా అడవులు కనుమరుగైనట్లు వెల్లడయింది. ఇక భారతదేశానికి సంబంధించి 2021 నివేదిక ప్రకారం దేశంలో దట్టమైన ఈ అరణ్యాలు కొంతమేరకు పెరిగినప్పటికీ మధ్యస్థసాంద్రమైన అడవులు క్షీణిస్తున్నాయి. భారత్‌లో ముప్పైశాతం మేర కార్చిచ్చులకు గురవుతున్నాయి. ఈశాన్య ప్రాంతాలు పశ్చిమ, మహారాష్ట్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో వివిధ జిల్లాల పరిధిలో ఉన్న అడవుల్లో కారుచిచ్చుల ముప్పు అధికంగా ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇకపోతే అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలు పెట్టి కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాలు పంట పొలాలు జనావాసాలుగా మార్చడం ఇలా ఒక్కటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతున్నారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో పదేళ్లలో ఇండియా జనాభా నూట నలభైఐదు కోట్లకు చేరుకుంటుందని, అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద అత్యంత వేగంగా హరించుకు పోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్‌లో రోజుకూ దాదాపు మూడువందల ముప్పై ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి నివేదికలో స్పష్టం చేసింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు నదీలోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. రోడ్ల అభివృద్ధికి సోపానాలు అయినా ఆ రహదారులే అడవులను అక్రమంగా నరికివేసి రవాణా చేసేందుకు స్మగ్లర్లకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేక పోతున్నాం. ఇందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఒక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసి పోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. పెరుగుతున్న వాహానాల సంఖ్యకు రెట్టింపు స్థాయిలో వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ అన్నీ కలిపి వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూ ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇలా ప్రకృతితో ఎన్నో రకాలుగా మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీకగా ప్రకృతి తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకేసారి ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. అంతేకాదు వరదలు, తుఫాన్లతో పాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు తరచుగా మాన వాళిపైదాడి చేస్తున్నాయి. యేటా దాదాపు ప్రపంచ వ్యాప్తంగా మూడువందల ఎనభైకిపైగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా యేటా లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు వదులుకుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో అనారోగ్యం పాలవుతున్నారు. ఆస్తుల నష్టాల గురించి చెప్పాల్సి న పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటే ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణ, ఆస్తుల నష్టం కొంతమేరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్నకారణంగా విజృంభిస్తున్న ప్రకృతికి అడ్డుకట్టవేయలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుంచి మానవుడు బయటపడలేక పోతున్నారు. మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పవచ్చు. సాంకేతికంగా, ఆర్థికంగా, ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవచక తప్పలేదు. ఒక్క చైనాయే కాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నాచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుంది. ముంబాయి నగరానికి అయితే ప్రతి వర్షాకాలంలోనూ వరద ముంపు తప్పడం లేదు. రోజుల తరబడి జీవనం స్తంభించిపోతున్నది. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్‌ల భారి నుంచి తీరప్రాంత ప్రజలు తప్పించుకోలేకపోతున్నారు. గత రెండు నెలలుగా బంగాళాఖాతలంలో అల్పపీడనమో, వాయుగుండమో, తుఫాన్‌లతో కురుస్తున్న వర్షాలతో తదితర రాష్ట్రాల ప్రజలు వణికిపోతున్నారు. 1993లో మహారాష్ట్ర లాతూర్‌లో సంభవించిన భూకంపం ఎన్నో కుటుంబాలను చిదిమేసింది. 2004లో సునామీ, ఇటీవల తరచుగా వస్తున్న భూకంపాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఉత్తరాఖండ్ పరిస్థితి అయితే అంచనాలకు అందదు. ఎప్పుడు ఏ రూపంలో వరదలు, భూకంపాలు ముంచుకు వస్తాయో చెప్పలేని పరిస్థితి. ఏదిఏమైనా ఈ ఉపద్రవాలను నియంత్రించి పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాల్సి న అవసరం ఉంది. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా భారీమూల్యం చెల్లించక తప్పదు. •

# ఉపాధ్యాయుల 'దండన ధోరణులు' మారాలి


శ్రీ శ్రీకుమార్

ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులౌతారు. వారి జీవితాలను తీర్చిదిద్ది, వారికి బంగారు భవిష్యత్తు కల్పించడానికి తమ వంతు కృషి చేసే ఆదర్శవంతులూ వారే! అన్ని సందర్భాలలో తల్లిదండ్రులతో సంప్రదించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది. మరపు రానిది. అం దుకే తల్లి, తండ్రీ , గురువు ,దైవం అంటూ తల్లి తండ్రుల తర్వాత గురువుకు ప్రధాన స్థానం కల్పించ బడింది. ప్రతి జీవితానికి బలమైన పునాది వేయగల సౌజన్యశీలురుగా ఉపాధ్యాయుల సేవలు ప్రశస్త్యమైనవి. తద్వారా సమాజానికి, దేశానికి ఉపయోగకరమైన పౌరులను తయారు చేస్తారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను విద్యార్థుల ఆశయాలను సాకారం చేయడంలో వారికి వారే సాటి. పరిస్థితులు ఎన్ని మారినా ఉపాధ్యాయులకు అందే గౌరవం , గుర్తింపు తరతరాలుగా చెక్కుచెదరడం లేదు. అంతటి గౌరవప్రదమైన వృత్తి జీవితంలోనూ నేడు అక్క డక్కడ వింత ధోరణులు, విచిత్ర పోకడలు పొడసూపుతు న్నాయి. తమ విద్యార్థులు తప్పు చేస్తే మందలించడం సహజం. తప్పు చెప్పడం ఉపాధ్యాయుని బాధ్యత. తప్పుని సరి అయితేనే వారిని మందలిస్తుంటారు. అవసరాన్ని బట్టి ఒక దెబ్బ వేస్తారు. ఇలాంటి చర్యలు కేవలం విద్యార్థిని సక్రమ మార్గంలో నడపడానికి మాత్రమే. అంటే దిద్దుబాటు చర్యగానే భావించాలి. తల్లి తండ్రుల తర్వాత ఆ బాధ్యత తనదేనన్న మమకారంతో విద్యార్థులను సత్ప్రవర్తన దారిలోకి మళ్ళిస్తారు. ఇవన్నీ సమంజసమే! కానీ అవి కొన్ని సార్లు దారి తప్పుతున్నాయి. హైదరాబాద్లోని ఒక ప్రైవేట్ స్కూల్లో విద్యార్థిని మనసు మార్చాలి లేదా సరైన దిశగా నడిపించే ఆలోచన చేయడం మంచిది. కానీ ఏ బెత్తంతోనో చూసే చూడకుండా కొట్టబోవడం కరెక్ట్ కాదని ఇటీవల జరిగిన ఒక సంఘటనను పరిశీలిస్తే అర్థమోతుంది. ఒక చర్యలో విద్యార్థికి పొరపాటున కంటికి గాయమైంది. దీనిని చేయడం ఏ రకంగానూ సమర్థించలేం. ఏ విధమైన శిక్షగా మనం పరిగణించాలి? విద్యార్థిని కన్ను కోల్పోతే అది జీవితాంతము నరకమే కదా! తగిలేది, తప్పేది తెలియకుండా, ప్రవర్తించడం దేనికి?. అసలు విద్యార్థులను కొట్టద్దు. తిట్టద్దు. మానసికంగా హింసించవద్దు అంటూ చట్టాలు ఘోషిస్తుంటే ఉపాధ్యాయులు అలాంటి శిక్షలు వేయడం ఆమోదయోగ్యం కాదు. విద్యార్థులను విచక్షణా రహితంగా కొట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. చట్టబద్ధం అసలే కాదు. ఆవేశంతో దండించడం కాదు. ఆలోచన ప్రధానం. దేనికైనా ఉపాధ్యాయునికి సహనం అవసరం. ఉపాధ్యాయులు సహనశీలురుగా వర్తించాలి. క్లాసుకు ఆలస్యంగా వచ్చాడనో , హోం వర్క్ చేయలేదనో, తరగతి గదిలో క్రమశిక్షణారాహిత్యంతో అల్లరి చేశాడనో మందలించడం సహజంగా జరిగేది. ఏదైనా కావచ్చు. వీటికి అంత పెద్ద శిక్షలు అవసరం లేదు. ఆ మధ్య ఒక ఉపాధ్యాయురాలు వేడి కత్తితో విద్యార్థినికి వాత పెట్టడం మనం చదివాం. ఎంత అమానుషమైన చర్య? ఇవన్నీ విద్యార్థుల మేలుకోరి ఇచ్చే దండనలైనా, అవి వికటిస్తే పరిస్థితులు దుష్పరిణామాలకు కారకు లౌతాయి. తరగతి గదిలో కులతత్వాన్ని, మతతత్వాన్ని ప్రబోధించే వారు, ఆచరించేవారు, పక్షపాత ధోరణులు ప్రదర్శించే ఉపాధ్యాయులు కూడా ఉంటారని కొన్ని సందర్భాలు చెబుతుంటారు. ఇవన్నీ లౌకిక రాజ్యంలో సహించలేని అంశాలు. తమ పదోన్నతుల కోసం రికార్డులు తారుమారు చేయడం ఉపాధ్యాయులు నీచానికి ఒడిగట్టడం కాదా? వీరేనా రేపటి బాధ్యతగల పౌరులను తయారు చేసేది? వీరేనా దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మిం చేది? ఆలోచించదగిన విషయం. నిన్న మొన్న భూపాల పల్లి జిల్లాలో మరొక దుర్మార్గాన్ని చదివాం. ప్రధానోపాధ్యాయుడిపై కక్షతో విద్యార్థులు తినే మధ్యాహ్న భోజనంలో విషం కలపడం, ఇందుకు మరి కొంతమంది ఉపాధ్యాయులు, సిబ్బంది సహకరించడం. కథ ఎవరి పైన, శిక్ష ఎవరికి? విద్యార్థుల్లో ఎవరికైనా ప్రాణహాని వాటిల్లితే మొత్తం ఉపాధ్యాయ లోకం తలదించుకోవాల్సి న పరిస్థితి ఏర్పడింది. వీరు మరింత పతనం అయితే అది సామాజిక స్థితిగతులు పాతాళానికి దిగజారడానికి దోహదం చేస్తాయి. జాతీయ ఉపాధ్యాయ దినోత్స వం ఇలాంటి విషయాలపై ఉపాధ్యాయుల్లో సద్భావనను కలుగచేయగలదు. •

# ఉద్యోగాల కల్పనలో ఎఐదే కీలక పాత్ర

ఎస్.సీతారామయ్య

దేశంలో రానున్న కాలంలో ఉద్యోగాల స్వరూపమే అనూహ్యంగా మారిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇదివరకు డిగ్రీలుంటేకానీ సరైన ఉద్యోగాలు రాని పరిస్థితి ఉండగా, ఇప్పుడు సాంకేతిక నైపుణ్యం ముందు డిగ్రీలు చిన్నబోతున్నాయి. దేశంలో ఎఐ(కృత్రిమ మేధ) నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో 88 వరకు ఎఐ ప్రోగ్రాములు అమలవుతున్నాయి, ఉత్పాదక ఆధారిత ఎఐ శిక్షణ నమోదులో అమెరికా, భారత దేశాలు ముందుండడంతో ప్రపంచ వ్యాప్తంగా ఎఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. జనరల్ ఏఐ శిక్షణను పెంచడంలో కార్పొరేట్ సంస్థలు ముందుంటున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలకు ప్రపంచ వ్యాప్తంగా 14 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. జనరల్ ఏఐ వినియోగం ప్రస్తుతం అన్ని రంగాల్లో పెరుగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వినియోగించుకుని సరికొత్త చిత్రాలు, పాఠ్యాంశాలు, సంగీతం తదితర అంశాలను సృజించే వ్యవస్థలను జనరేటివ్ ఎఐగా వ్యవహరిస్తున్నారు. ఎఐ నైపుణ్యానికి సంబందించి దేశంలో 67 కంపెనీలు కొత్త విభిన్న నైపుణ్య ప్రతిభపై దృష్టి సారిస్తున్నాయి. 2030 నాటికి దేశంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, మరోవైపు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, అలాగే ప్రపంచంలో 170 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, 92 మిలియన్ ఉద్యోగాలు కోల్పోవడమవుతుందని ఎరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) నివేదిక వెల్లడించింది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు: ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి, ఎఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పడుతున్నాయి. దేశంలో బిగడేటా, ఎఐ, మెషిన్ లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు దేశంలో వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత దేశంలోని ఐటి రంగం ప్రస్తుతం 5.4 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్యను 10 మిలియన్ వరకు రెట్టింపు. చేయాలన్న టార్గెట్ ఉండగా, కేవలం 7.5 మిలియన్ వరకి సాదించగలమని ఆయా రంగ నిపుణులు



చెబుతున్నారు. దీనికి కారణం ఎఐ విస్తరించడం వల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు పోతాయన్న భయం వెంటాడుతుండడమే. ప్రస్తుతం ఈ వృద్ధి అంతా డిజిటల్ సాంకేతికత వైపు దూసుకెళ్తొంది, ఎఐ, క్లౌడ్, కంప్యూటింగ్, ఆటోమేషన్ తదితర సాంకేతిక ప్రక్రియలు పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ప్రోత్సాహంతో విస్తరిస్తున్నాయి. ఇది వరకటి 10 మిలియన్ ఉద్యోగాల టార్గెట్ను 7.5 మిలియన్ ఉద్యోగాలకు సవరించినప్పటికీ, ఉద్యోగాల రాశి కన్నా నైపుణ్యం, నాణ్యతలకు పట్టం కడుతున్నారు. ఈ ఆధునిక సాంకేతిక నైపుణ్య ప్రక్రియలను అందిపుచ్చుకోగలిగితేనే ఇప్పుడు ఉద్యోగాలు లభిస్తాయి. ఈ మేరకు ఉద్యోగ అవకాశాలు 80 వరకు సాంకేతిక నిపుణులతో 2025 26 వాటికి 20 వరకు పెరుగుతాయని ఐటి రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత అధునిక సాంకేతికతల వల్ల 2030 నాటికి దేశంలో 150 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక ప్రయోజనం సిద్ధిస్తుందని అంచనా వేస్తున్నారు. జనరేటివ్ ఎఐ వంటి సాంకేతికతలో ఐటి రంగంలో 2030 నాటికి రెండు మిలియన్ల వరకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయని నివేదికల వల్ల తెలుస్తోంది. దేశంలో ప్రస్తుతం 1700 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఉన్నాయి. వీటి వల్ల 1.9 మిలియన్ మంది ఉద్యోగాలు పొందుతున్నారు. 2030 నాటికి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య 2200 వరకు చేరుకుంటుందని, వాటి ద్వారా 2.5 మిలియన్ నుంచి 2.8 మిలియన్ వరకు ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఐటి నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అనేవి ఎదురవుతున్న సవాళ్లకు అనుగుణంగా అనేక రకాల వ్యూహాత్మక విధులను నిర్వహించడానికి బహుళజాతి సంస్థలు స్థాపించే కేంద్రాలు, ఆవిష్కరణ కార్యక్రమాలు, పరిశోధనలు, సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను వేగవంతం చేయడం, వనరుల వినియోగాన్ని పెంచడం తదితర విధులను ఈ కేంద్రాలు నిర్వహిస్తుంటాయి. ఐటి రంగంలో ఒప్పందం ప్రకారం ఉద్యోగులను నియమించుకునే విధానంలో 43.5 డిమాండ్తో బెంగళూరు కేంద్ర స్థానంగా ఉన్నప్పటికీ, 13.4 డిమాండ్తో రెండో అత్యధిక స్థానంలో హైదరాబాద్ ఉంది. ఈ ఉద్యోగాల కల్పనలో విద్యార్హతల కన్నా సాంకేతిక నైపుణ్యమే కీలక పాత్ర వహిస్తోందన్నది ఉద్యోగార్థులు గమనించవలసిన కీలకాంశం. •

# భారత్ బాటలోనే జపాన్

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం మరింత ఆలస్యం!



శుక్రవారం టోక్యోలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న జపాన్ అధికారులు

**టోక్యో, ఆగస్టు 29:** అధిక టారిఫ్‌లతో అమెరికా భయపెడుతున్నా.. అగ్రరాజ్యం ఒత్తిడికి భారత్ తలొగ్గట్లేదు. ఇప్పుడు జపాన్ కూడా అదే బాట పట్టినట్లు తెలుస్తోంది. వాణిజ్య చర్చల్లో భాగంగా టోక్యోతో పెట్టుబడుల ఒప్పందం చేసుకునేందుకు అమెరికా సిద్ధమైంది. అయితే, ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే అది కుదిరే సంకేతాలు కన్పించట్లేదు. ఈ ఒప్పందం నిమిత్తం చేపట్టాల్సిన యుఎస్ పర్యటనను చివరి నిమిషంలో జపాన్ మంత్రి రద్దు చేసుకోవడమే ఇందుక్కారణం. పైగా భారత ప్రధాని మోడీ టోక్యో పర్యటన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం మరింత చర్చనీయాంశంగా మారింది.

రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్రమోడీ జపాన్ చేరుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన టోక్యోలో దిగారు. ఈ పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం జపాన్ ప్రధాని ఇషిబాతో మోడీ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నారు. మరోవైపు, ఈ పర్యటన వేళ జపాన్ వాణిజ్య మంత్రి ర్యోసీ అకజవా అమెరికా టూర్‌ను రద్దు చేసుకున్నారు. దీంతో ఈ రెండు దేశాల మధ్య జరగాల్సిన 550 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్యాకేజీ ఒప్పందం ఆలస్యం కానుంది. అమెరికా టారిఫ్‌ల వేళ.. అగ్రరాజ్యంలో పెట్టుబడులు పెట్టేందుకు టోక్యో సిద్ధమైంది. దీంతో జపాన్‌పై టారిఫ్‌లను 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించాలని అగ్రరాజ్యం నిర్ణయించింది. ఇందుకోసం వాణిజ్య మంత్రి గురువారం అమెరికా వెళ్లాల్సి ఉంది. ఈ పర్యటనలో అధికారికంగా ఒప్పందం కుదరాల్సి ఉండగా ప్రస్తుతం అది రద్దయ్యింది. ఈ పెట్టుబడులకు సంబంధించి అడ్మినిస్ట్రేషన్ స్థాయిలో ఇంకా కొన్ని అంశాలను చర్చించాల్సి ఉన్నందున.. ర్యోసీ తన పర్యటనను రద్దు చేసుకున్నారని జపాన్ వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఈ ఒప్పందంలో భాగంగా లాభాల్లో అత్యధిక వాటా అమెరికాతీసుకోవాలని భావిస్తోంది. దీనిపై టోక్యో అంగీకారానికి రాలేకపోతోందని తెలుస్తోంది. జపాన్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో పర్యటిస్తారు. ఇరుదేశాల 15వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. అనంతరం జపాన్ ప్రధాని ఇషిబాతో భేటీ కానున్నారు. ఎఐ, సెమీకండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబడులే అజెండాగా వీరి మధ్య ద్వైపాక్షిక చర్చ జరగనుంది. అక్కడి నుంచి ప్రధాని మోడీ నేరుగా చైనా వెళ్లనున్నారు. ఈ నెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో తియాంజిన్ వేదికగా జరిగే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్–చైనా సైనికుల మధ్య ఘర్షణల తర్వాత ప్రధాని మోడీ చైనాను సందర్శిస్తుండటం ఇదే మొదటిసారి. ఆ దేశంలో చివరిసారి 2018లో పర్యటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# బ్రిక్స్‌కూటమిని బలోపేతం చేస్తున్న ట్రంప్ టారిఫ్‌లు

## అమెరికన్ ఆర్థికవేత్త రిచర్డ్ వోల్ఫ్



**వాషింగ్టన్, ఆగస్టు 29:** భారత్ విషయంలో అమెరికా ప్రపంచానికే పెద్దన్నలా వ్యవహరిస్తోందని, కానీ ఈ చర్యలతో తన కాలిపై తానే గొడ్డలివేటు వేసుకుంటోందని ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త రిచర్డ్ వోల్ఫ్ వ్యాఖ్యానించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా విధించిన భారీ సుంకాలను ఆయన తప్పుబట్టారు. అమెరికా తీరు ఒక ఎలుక వెళ్లి ఏనుగును గుద్దినట్టుగా ఉందని ఆయన అభివర్ణించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని నిరసిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్‌కు చెందిన పలు ఉత్పత్తులపై టారిఫ్‌లను 50 శాతానికి పెంచారు. ఈ నిర్ణయం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు ఆర్థికంగా నష్టం కలిగించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా చెబుతోంది. రష్యా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిచర్డ్ వోల్ఫ్ మాట్లాడుతూ అమెరికా చర్యల వల్ల భారత్‌కు ఎలాంటి నష్టం జరగదని స్పష్టం చేశారు. అమెరికా మార్కెట్ మూసుకుపోతే, భారత్ తన ఉత్పత్తులను బ్రిక్స్ దేశాలకు అమ్ముకుంటుంది. గతంలో రష్యా తన ఇంధనాన్ని ఇతర దేశాలకు అమ్ముకున్నట్లే, భారత్ కూడా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకుంటుందని ఆయన విశ్లేషించారు. అమెరికా చర్యలు పాశ్చాత్య దేశాలకు ఆర్థిక ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న బ్రిక్స్ కూటమిని మరింత బలోపేతం చేస్తాయని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం ప్రపంచ ఉత్పత్తిలో బ్రిక్స్ దేశాల (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, యూఏఈ) వాటా 35 శాతానికి చేరిందని, అదే సమయంలో జీ7 దేశాల (కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, అమెరికా) వాటా 28 శాతానికి పడిపోయిందని వోల్ఫ్ గుర్తుచేశారు. ఇది ఒక చారిత్రక ఘట్టం. పశ్చిమ దేశాలకు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ కూటమిని అమెరికాయే దగ్గరుండి పెంచి పోషిస్తోంది" అని ఆయన అన్నారు. గతంలో ట్రంప్ పలు సందర్భాల్లో బ్రిక్స్‌ను ఒక చిన్న బృందం అని, త్వరలో కనుమరుగైపోతుందని కొట్టిపారేశారు. ఉమ్మడి కరెన్సీని తీసుకొస్తే 100 శాతం టారిఫ్‌లు విధిస్తామని కూడా హెచ్చరించారు. అయితే, వోల్ఫ్ మాత్రం సోవియట్ కాలం నుంచి భారత్, రష్యాల మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని, అమెరికా ఇప్పుడు చాలా భిన్నమైన ప్రత్యర్థితో ఆడుతోందని హెచ్చరించారు.

# ఊహించని పరిస్థితే వస్తే నేనే అమెరికా అధ్యక్షుడిని

## ఉపాధ్యక్షుడు జెడివాన్స్ సంచలన ప్రకటన



**వాషింగ్టన్, ఆగస్టు 29:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఏదైనా ఊహించని పరిస్థితి తలెత్తితే తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ సంచలన కామెంట్స్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై ఊహాగానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. యూఎస్ఏ టుడేతో మాట్లాడిన జేడీ వాన్స్ ట్రంప్ ఆరోగ్యంపై మాట్లాడారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంపై ఇటీవలే వచ్చిన కథనాలు అమెరికా ప్రజల్లో ఆందోళన రేకెత్తించాయి. అందులో వాస్తవం లేదు. ట్రంప్ ప్రస్తుతం ఆరోగ్యంగా, చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆయన ఆరోగ్యం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు భయంకరమైన విషాదాలు చోటు చేసుకుంటున్నాయి. కానీ, వాట న్నింటినీ దాటుకొని తన పదవీ కాలాన్ని ట్రంప్ పూర్తి చేస్తారని ఆశిస్తున్నా. అమెరికా ప్రజలకు ఇంకా గొప్ప పనులు చేస్తారన్న నమ్మకం నాకు ఉంది. ఒకవేళ ఏదైనా ఊహించని పరిస్థితి తలెత్తితే అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జేడీ వాన్స్ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై ఇటీవలే పలు ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆయన చేతులపై కమిలిన గాయాలు కనిపించడం ఇటీవలే కలకలం రేపుతోంది. ట్రంప్ కుడిచేతి వెనుక భాగంలో ఓ తెల్లటి మార్క్ కనిపించింది. సోమవారం ఓవెల్ ఆఫీస్‌లో జరిగిన సమావేశం సందర్భంగా అది కెమెరాకు చిక్కింది. దీంతో ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన రేకెత్తించింది. ఇది చూసిన ట్రంప్ మద్దతుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ వింత వ్యాధితో బాధపడుతున్నారంటూ వదంతులు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇటీవలే ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయెల్ మాక్రాన్‌తో భేటీ సందర్భంగా ట్రంప్ చేతిపై కమిలిన గాయాలు కనిపించాయి. ఆ తర్వాత న్యూజెర్సీలో జరిగిన ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ తిలకించేందుకు వచ్చిన ట్రంప్ కాస్త అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కనిపించారు. కాళ్ల వద్ద నరాలు ఉబ్బిపోయినట్లుగా, కుడి చేతిపై పలు చోట్ల వాపు ఉన్నట్లు కెమెరా కంట పడింది. ఇప్పుడు మరోసారి ట్రంప్ కుడి అరచేతి వెనుక భాగంలో ఇలాంటి గాయాలే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఆ కమిలిన గాయాన్ని దాచేందుకు అధ్యక్షుడు మేకప్‌తో కవర్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# పాట్నాలో బిజెపి, కాంగ్రెస్ బాహా బాహీ



**పాట్నా, ఆగస్టు 29:** బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. పార్టీ జెండాలతో బీహార్‌లోని పాట్నాలో ఒకర్ని ఒకరు కొట్టు కున్నారు. నిరసన ర్యాలీ భారీ విధ్వంసానికి దారి తీసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ఓట్ అధికార్ యాత్ర నిర్వహించారు. ఆ ర్యాలీలో ఓ వ్యక్తి ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీనికి నిరసన ఇవాళ బీజేపీ ర్యాలీ చేపట్టింది. అయితే ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు కూడా ర్యాలీ నిర్వహించారు. ఆ రెండు పార్టీలకు చెందిన నేతలు ఎదురుపడిన సమయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసు కున్నట్లు తెలుస్తోంది. భారీ సంఖ్యలో కార్యకర్తలు పార్టీ జెండాలు ఉన్న కర్రలతో దాడి చేసుకున్నారు. ఓ దశలో కాంగ్రెస్ కార్యాలయం వద్ద కూడా దాడి జరిగింది. కాంగ్రెస్‌కు గట్టి బదులిస్తామని బీజేపీ నేత నితిన్ నాబిన్ అన్నారు. తల్లిని దూషించిన కాంగ్రెస్ పార్టీకి బీహారీలు గుణపాఠం చెబుతారని అన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన అన్నారు. నితీశ్ కుమార్ పాలన సరిగా లేదని, ఇదంతా ప్రభుత్వ జోక్యంతోనే జరుగుతోందని కాంగ్రెస్ నేత డాక్టర్ ఆశుతోష్ ఆరోపించారు. దర్భంగా జిల్లాలో జరిగిన ర్యాలీలో రఫీక్ అలియాస్ రాజా అనే వ్యక్తి అకస్మాత్తుగా మైక్‌ను అందుకుని ప్రధాని మోదీతో పాటు ఆయన తల్లిపై దుర్భాషలాడాడు. రఫీక్ అలియాస్‌ను భోపురా గ్రామస్థుడిగా గుర్తించారు. సిమ్రి పోలీసు స్టేషన్‌లో అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బితౌలీ వద్ద ర్యాలీ జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. చాలా తీవ్రమైన పదజాలంతో మోదీ, ఆయన తల్లిని తిట్టాడు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి అనుకూలంగా ఆ వ్యక్తి నినాదాలు చేశాడు. ప్రధాని మోదీపై దుర్భాషలాడిన వ్యక్తి రఫీక్ ను పోలీసులు అరెస్టు చేశారు.

# థాయ్‌మాజీ ప్రధాని షినవత్రాను తొలగించిన సుప్రీం కోర్టు



**బ్యాంకాక్, ఆగస్టు 29:** థాయ్‌ల్యాండ్ ప్రధాని పెటంగటార్న్ షినవత్రాకు గట్టి షాక్ తగిలింది. పొరుగుదేశమైన కాంబోడియా ప్రధానితో జరిపిన ఫోన్ సంభాషణపై షినవత్రాపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన ఆ దేశరాజ్యాంగ కోర్టు ఆమెను సస్పెండ్ చేస్తూ ఇటీవలే తీర్పు వెలువరించి తాజాచర్యల్లో భాగంగా ఆమెను పదవి నుంచి తొలగిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. ఆమె నియమాలను ఉల్లంఘించారని, రాజ్యాంగం ప్రకారం ప్రధాన మంత్రి పదవికి అనర్హురాలని పేర్కొంది. ఓ ఫోన్ సంభాషణలో కంబోడియా మాజీ అధినేత హున్‌సేన్‌ను 'అంకుల్' అని సంబోధించిన పెటంగటార్న్ షినవత్రా తమ దేశ సైనిక కమాండర్‌ను తన విరోధి అని పేర్కొనడం వివాదానికి దారితీసింది. దేశ సరిహద్దుల్లో కంబోడియాతో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో స్వయంగా ప్రధాని తమ దేశ సైనిక కమాండర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. దీనిపై గత నెల విచారణ చేపట్టిన కోర్టు కంబోడియాతో జరిగిన దౌత్య వ్యవహారంలో ప్రధానమంత్రిగా నైతికతను ఉల్లంఘించారనిచెప్పడానికి తగిన ఆధారాలున్నా యని పేర్కొన్నది. ప్రధాన మంత్రి పదవి నుంచి సస్పెండ్ చేస్తూ రాజ్యాంగ కోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆమెపై చర్యలు తీసుకుంది. పదవినుంచితొలగిస్తూ తీర్పు చెప్పింది. నైతిక ఉల్లంఘనలకు పాల్పడిన 62 ఏండ్ల ప్రధాని స్రెట్టాథావిసిన్ పదవి నుంచి దిగిపోయిన తర్వాత ప్రధాని బాధ్యతల నుంచి సస్పెండ్ అయిన రెండోవ్యక్తిగా షినవత్రా నిలిచారు.

# ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా డ్రోన్ దెబ్బ: సముద్రంలో మునిగిన భారీ నౌక

**మాస్కో, ఆగస్టు 29:** ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ఆపేందుకు ఓ వైపు చర్చలు జరుగుతున్నా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం రోజురోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా కీవ్‌పై మాస్కో మరోసారి విరుచుకుపడింది. రష్యా జరిపిన సముద్ర డ్రోన్ దాడి కారణంగా ఉక్రెయిన్‌కు చెందిన అతిపెద్ద నౌక ధ్వంసమై మునిగిపోయింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలుసామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఉక్రెయిన్‌లోని ఒడెస్సా ప్రాంతంలో గత దనుబె నదిలో నిఘా నౌక సింఫెరోపోల్ మోహరించి ఉండగా రష్యా దానిపై దాడి చేసింది. సముద్ర డ్రోన్‌ను ప్రయో గించింది. ఈ దాడితో నౌక భారీగా ధ్వంసమై నీట మునిగినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## నేతాజీ అస్థికలను భారత్‌కు రప్పించాలి..

### టోక్యో పర్యటనలో ఉన్న ప్రధాని మోడీకి బోస్ కుమార్తె వినతి

**బెర్లిన్, ఆగస్టు 29:** స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అస్థికలను భారత దేశానికి తీసుకురావాలని ఆయన కుమార్తె అనితా బోస్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న నేపథ్యంలో ఆమె ఈ అభ్యర్థన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన వయసు మీద పడుతున్నందున, ఈ సమస్యకు త్వరగా ఒక ముగింపు పలకాలని ఆమె విన్నవించారు. ప్రస్తుతం జర్మనీలో నివసిస్తున్న 82 ఏళ్ల అనితా బోస్ ఈరోజు ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తే, తన తండ్రి అస్థికలను స్వదేశానికి తీసుకురావాలని కచ్చితంగా కోరతానని ఆమె స్పష్టం చేశారు. గతంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం నా తండ్రి అస్థికలను తీసుకురావడానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వం కొనసాగించాలి. నా వయసు రీత్యా ఈ విషయం నాకు మరింత అత్యవసరంగా మారిందని ఆమె భావోద్వేగంగా అన్నారు. ఈ సమస్యకు ఒక ముగింపు కావాలని నేను కోరుకుంటున్నాను. ఈ బాధ్యతను నా కొడుక్కి వారసత్వంగా ఇవ్వాలని నేను అనుకోవడం లేదని అనితా బోస్ చెప్పారు. ఇది కేవలం తన వ్యక్తిగత విషయం కాదని, తన తండ్రి యావత్ దేశానికి చెందిన వ్యక్తి అని ఆమె గుర్తుచేశారు. 1945 ఆగస్టు 18న తైవాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ మరణించినట్లు పలు జాతీయ, అంతర్జాతీయ విచారణలు నిర్ధారించాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన, అక్కడి సైనిక ఆసుపత్రిలో కన్నుమూశారని నివేదికలు తెలిపాయి. ఆయన అస్థికలను జపాన్‌లోని టోక్యోలో ఉన్న రెంకోజీ బౌద్ధ ఆలయంలోని ఒక కలశంలో భద్రపరిచినట్లు బలంగా విశ్వసిస్తున్నారు.

## రష్యాకు మద్దతివ్వడంవల్లే భారత్‌కు ఈ గతి..

### అమెరికా సెనెటర్ గ్రాహమ్ లిండ్సే వెటకారం

**వాషింగ్టన్, ఆగస్టు 29:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై అమెరికా రిపబ్లికన్ పార్టీకి చెందిన సీనియర్ సెనెటర్ లిండ్సే గ్రాహం మరోసారి తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ దేశాల చర్యల వల్లే ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధ యంత్రాంగం కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు మద్దతు ఇస్తున్నందుకు భారత్ ఇప్పటికే మూల్యం చెల్లించుకుంటోందని, ఇతర దేశాలకు కూడా త్వరలోనే ఇదే గతి పడుతుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఉక్రెయిన్‌లోని కీవ్ నగరంపై రష్యా జరిపిన భీకర దాడిలో 23 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జరిగిన వెంటనే లిండ్సే గ్రాహం సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. "రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేస్తూ పుతిన్ యుద్ధానికి ఊతమిస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలకు ఇప్పుడెలా అనిపిస్తోంది? మీ కొనుగోళ్ల వల్లే పిల్లలతో సహా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. పుతిన్‌కు మద్దతిచ్చినందుకు భారత్ ఇప్పటికే మూల్యం చెల్లిస్తోంది. మిగతా దేశాలకు కూడా త్వరలోనే ఇదే గతి పడుతుందని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించిన విషయాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. పుతిన్‌కు మద్దతివ్వడం వల్లే భారత్ ఇలాంటి పరిణామాలను ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న ఇతర దేశాలు కూడా ఇలాంటి పర్యవసానాలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. లిండ్సే గ్రాహం చాలాకాలంగా రష్యా చమురు ఆదాయంపై విమర్శలు చేస్తున్నారు. "చమురు, గ్యాస్ ఆదాయం లేకపోతే రష్యా కుప్పకూలిపోతుంది. భారత్, చైనా, బ్రెజిల్ వంటి దాని వినియోగదారులను దెబ్బతీయడమే మా ప్రధాన లక్ష్యమని ఆయన గతంలో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇతర దేశాల నుంచి వస్తున్న ఆదాయంతోనే రష్యా యుద్ధాన్ని కొనసాగిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.



ఆపరేషన్ సిందూర్

# ఉగ్రపోరులో సువర్ణాధ్యాయం

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో ఆపరేషన్ సిందూర్ ఓ సువర్ణాధ్యాయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. స్వదేశీ ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ రిపోర్టింగ్ వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వ రంగ సంస్థల సహకారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. భారత్‌పాకిస్తాన్ మధ్య సైనిక వివాదంలో ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థ కీలకపాత్ర పోషించింది. స్కోప్ ఎమినెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర గురించి మాట్లాడారు. ఆదాయం, లాభం వంటి కీలకమైన ఆర్థిక పారామితులలో ప్రభుత్వ రంగ సంస్థలు బాగా పనిచేశాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో మూడింట ఒక వంతు లాభాలను ఆర్జిస్తున్నాయని, గత దశాబ్దంలో ప్రభుత్వ రంగ సంస్థల నికర లాభం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు సుపరిపాలన, పారదర్శకత రంగంలో ప్రమాణాలను నిర్దేశించాయని ముర్ము తెలిపారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ప్రాముఖ్యతపై స్పందిస్తూ స్వయం సమృద్ధ భారతదేశాన్ని నిర్మించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశ రక్షణ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాద శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని భారతదేశంపై దాడి చేసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. స్వదేశీ ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థ తన సామర్థ్యాన్ని ప్రదర్శించిందన్నారు. ఈ వ్యవస్థ సృష్టికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదం చేశాయని ఇది వారికి చాలా గర్వకారణంగా నిలుస్తుందన్నారు. ఆవిష్కరణలు, పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యం ద్వారా జాతీయ భద్రతలో స్వావలంబన సాధించడంలో పీఎస్‌యూలు ప్రధాన పాత్ర పోషించాయని రాష్ట్రపతి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మైనింగ్, అన్వేషణ, తయారీ, ప్రాసెసింగ్, సేవలు వంటి అనేక రంగాల్లో పీఎస్‌యూలు కీలకపాత్ర పోషించాయని మహిళల నేతృత్వంలోని అభివృద్ధి ప్రభుత్వ జాతీయ ప్రాధాన్యతల్లో ఒకటని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# ప్రధాని మోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్టు

**పాట్నా, ఆగస్టు 29:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లిపై అసభ్య పదజాలంతో దూషణలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు బీహార్ పోలీసులు తెలిపారు. అరెస్టైన నిందితుడు సింగ్వారాలోని బాపుర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దీనిపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. దర్భంగాలో ఇండియా కూటమి నిర్వహించిన రాజకీయ సభలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. మోదీ, ఆయన తల్లిపై చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఖండించారు. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. ఇది 140 కోట్ల మంది భారతీయులను అవమానించడమేనని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడు ప్రధాని మోదీ. ఇండియా కూటమి వేదికపై నుంచి ఇలాంటి అగౌరవకరమైన భాష వాడటం సిగ్గుచేటు. దీనికి బీహార్ ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. ఇందుకు కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ ఉన్న వేదికపై నుంచి ప్రధాని తల్లిని అవమానించడం దేశంలోని మహిళలందరినీ కించపరచడమేనని అన్నారు. ఇండియా కూటమి భావజాలం ఎలాంటిదో ఈ ఘటన తెలియజేస్తోంది. భారత ప్రజాస్వామ్యంలో ఇలాంటి వాటికి చోటు లేదు. దేశం దీన్ని సహించదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయంగా ఎదుర్కోలేకనే కాంగ్రెస్, ఆర్జేడీ ఇలాంటి నీచస్థాయి వ్యక్తులను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఈ ఘటన జరిగింది. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో రంగంలోకి దిగిన పోలీసులు, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు దర్భంగా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శుక్రవారం వెల్లడించారు.

## సంక్షిప్తంగా..

### కేరళ మంత్రి బంధువుల దారుణ హత్య



**కన్నూరు, ఆగస్టు 29:** కేరళలోని కన్నూర్ జిల్లా అలవిల్ లో దారుణం చోటుచేసుకుంది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధ దంపతులను దుండగులు దారుణంగా హతమార్చారు. పదునైన వస్తువుతో కొట్టి చంపి ఆపై మృతదేహాలను కాల్చేశారు. మృతులను కేరళ అటవీశాఖ మంత్రి ఏకే శశీంద్రన్ బంధువులుగా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే మంత్రి ఏకే శశీంద్రన్ మేనకోడలు ఏకే శ్రీలేఖ (68), ఆమె భర్త ప్రేమరాజన్ (75) లు కన్నూర్ జిల్లాలోని అలవిల్ ప్రాంతంలో నివ సిస్తున్నారు. ఇద్దరు పిల్లలు విదేశాల్లో స్థిరప డడంతో ఒంటరిగానే కాలం గడుపుతున్నారు. ఈ క్రమంలో తల్లి దండ్రులను చూసేందుకు వస్తున్నట్లు ప్రేమరాజన్ కుమారుడు కబురు చేశాడు. ఆయనను ఎయిర్ పోర్ట్ నుంచి తీసుకువచ్చేందుకు కారు కోసం గురువారం సాయంత్రం డ్రైవర్ ఇంటికి వచ్చాడు. డోర్ కొట్టినా, ఎంత పిలిచినా స్పందించకపోవడంతో డ్రైవర్ పక్కింటి వారిని ఆశ్రయించాడు. బుధవారం తర్వాత ఆ దంపతులను తాము చూడలేదని వారు వెల్లడించారు. దీంతో ఇరుగుపొరుగు సాయంతో డోర్ బద్దలు కొట్టి లోపలకు వెళ్లిన డ్రైవర్‌కు కాలిన స్థితిలో శ్రీలేఖ, ప్రేమరాజన్‌ల మృతదేహాలు కనిపించాయి.

### మలేసియా వీసా ఫ్రీ ఎంట్రీతో భారతీయుల ఇక్కట్లు

**కౌలాలంపూర్, ఆగస్టు 29:** మలేషియా ప్రభుత్వం భారతీయులకు 30 రోజుల వీసా ఫ్రీ ఎంట్రీ సౌకర్యాన్ని కల్పించింది. అయితే, ఈ సదుపాయం అందుబాటులో ఉన్నప్పటికీ, చాలా మంది భారతీయ పౌరులు మలేషియా విమానాశ్రయాల్లో అడుగుపెట్టకుండానే వెనక్కి తిరిగి రావలసి వస్తోంది. అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు వారిని 'నాట్ టు ల్యాండ్' కేటగిరీ కింద చేర్చి, దేశంలోకి ప్రవేశాన్ని నిరాకరిస్తున్న ఘటనలు ఇటీవల పెరిగాయని భారత్‌లోని మలేషియా హైకమిషన్ వెల్లడించింది. భారతీయ ప్రయాణికులను వెనక్కి పంపడానికి గల ప్రధాన కారణాలను కూడా హైకమిషన్ స్పష్టంగా వివరించింది. ప్రయాణానికి సరిపడా డబ్బు లేకపోవడం, బస చేసేందుకు సరైన ఆధారాలు (హోటల్ బుకింగ్ వంటివి) చూపించకపోవడం, తిరుగు ప్రయాణానికి కచ్చితమైన విమాన టికెట్ లేకపోవడం వంటి కారణాలతో ఎంట్రీని నిరాకరిస్తున్నట్లు పేర్కొంది.

అంతేకాకుండా ఈ వీసా ఫ్రీ పద్ధకాన్ని అడ్డం పెట్టుకుని ఉద్యోగాల కోసం వస్తున్నారని అనుమానం వచ్చినా కూడా వారిని అనుమతించడం లేదని తెలిపింది.

### ఇరాన్ ప్రయాణికులు విధిగా అనుమతులు పొందాలి

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ఇరాన్‌కు ప్రయాణించే భారత పౌరులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశానికి వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎమిగ్రేషన్ క్లియరెన్స్ (వలస అనుమతి) తీసుకోవాలని స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఇరాన్ ప్రయాణానికి ఈ క్లియరెన్స్ నుంచి మినహాయింపు ఉండేది. అయితే, ఆ మినహాయింపును రద్దు చేస్తూ భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. భారత పౌరుల భద్రత, వారి ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

ఎమిగ్రేషన్ చట్టం, 1983లోని సెక్షన్ 41(1) ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలను ఉపయోగించి ఈ కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చినట్లు వివరించింది. ఈ తాజా ఉత్తర్వులతో, 2006 డిసెంబర్ 28న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఇరాన్ ప్రయాణానికి కల్పించిన మినహాయింపు పూర్తిగా రద్దయింది.

### పరువు హత్యల కట్టడికి సుప్రీంలో విజయ్ పిటిషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** తమిళస్టార్ హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ఓకీలక సామాజిక అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో పెరిగిపోతున్న పరువు హత్యలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఇటీవల తమిళనాడులో ఓ దళిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్యకు గురైన నేపథ్యంలో టీవీకే ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. జులై 27న తిరునల్వేలిలో ఐటీ ఉద్యోగి కవిన్ సెల్వగణేషన్ పరువు హత్యకు గురయ్యారు. వేరొక సామాజిక వర్గానికి చెందిన యువతిని ప్రేమించడమే ఆయన హత్యకు దారితీసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, యువతి సోదరుడు సుర్జిత్, తండ్రి శరవణన్‌ను అరెస్టు చేశారు. ఈ హత్య రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో బాధితుడికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాలని టీవీకే తన పిటిషన్‌లో పేర్కొంది.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

# ధర్నాలు, ఆందోళనలు జరగనివ్వకండి

## అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఉభయ సభలు సజావుగా సాగేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి

### అధికారులతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా నియంత్రించాలని ఉభయ సభలు సజావుగా జరిగేలా పోలీసు డిపార్ట్ మెంట్ చర్యలు తీసుకోవాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యం లో సభ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం తన చాంబర్‌లో పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీ ఎదుట ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలని సూచించారు. తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయని చెప్పారు. ఈ మీటింగ్ లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మా ట్లాడిన గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ గత సమావేశాలు సజావుగా జరిగేందుకు సహకరించినట్లుగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలన్నారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని శాఖలను సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు భారీ వర్షాల వల్ల రోడ్లు దెబ్బ తిన్న మార్గాల్లో ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని సభ్యులు సరైన సమయానికి సభకు చేరుకునే విధంగా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని సిఎస్ కె. రామ కృష్ణారావు చెప్పారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అవసరమైన అధికారులను అందుబాటులో ఉంచుతామని సభా నిర్వాహణకు ఇబ్బందులు లేకుండా, సజావుగా జరిగేలా ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. ఈసందర్భంగా ఎక్స్‌టెన్షన్ పొందిన చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావుకు స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు.

**పెండింగ్ ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలి: గుత్తా**

కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలన్నారు. అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని సూచించారు. తెలంగాణ పోలీసు దేశంలోనే సమర్థవంతమైనదని మంచి పేరు ఉన్నదని చెప్పారు. మీ ఆధ్వర్యంలో శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. ఈ మీటింగ్‌కు డిజి సెక్రటరీ రఘునందనరావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్) రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్) శివలింగయ్య, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, రాష్ట్ర డీజీపీ డా.జితేందర్, ఏడీజీ, లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, అడిషనల్ సిపి లా అండ్ ఆర్డర్ విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్ కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# బండారం బయటపడుతోందని బిఆర్‌ఎస్ నేతల్లో వణుకు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** కాళేశ్వరం నివేదికపై పిసి ఘోష్ కమిషన్ పైన అసెంబ్లీలో చర్చ జరిగితే తమ బండారం బయటపడుతుందనే భయంతో బిఆర్‌ఎస్ నేతలకు వణుకు పుట్టిందని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పిలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో కాళేశ్వరం పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కు అవకాశం ఇవ్వాలని బిఆర్‌ఎస్ అడుగుతోందని అన్నారు. కాళేశ్వరానికి కర్త,కర్మ, క్రియ నేనే అని అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి కెసిఆర్ గొప్పలు చెప్పుకున్నాడని ఆది గుర్తుచేశారు. ఆ నాడు అసెంబ్లీలో తమకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ శాసనసభా పక్షం అడిగితే పట్టించుకోలేదని ఆవేదన చెందారు. కాళేశ్వరంలో కెసిఆర్ హయంలోనే కట్టారు,వారి సమయంలోనే కూలిపోయింది పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రజల ముందు ఉంచడానికి అసెంబ్లీలో చర్చకు పెడుతున్నామని ఆయన చెప్పారు. పిసి ఘోష్ కమిషన్ నివేదిక ను ఆపాలని హైకోర్టుకు వెళ్లి బిఆర్‌ఎస్ భంగపడిందని మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడంతో తెలంగాణ ప్రతిష్ట గంగలో కలిసిపోయిందని అన్నారు. మామ, అల్లుడు నీటిపారుదల శాఖ మంత్రి గాఉండి ఏం సాధించారని ఆయన నిలదీశారు మీ తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే జనం పట్టించు కోలేదని అన్నారు. గతంలో అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టుల పైన కెసిఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి గొప్పలు పోయినా జనం ఓడించారని చెప్పారు.కాళేశ్వరం విషయంలో కెసిఆర్ బండారం ఇప్పటికే బయటపడిందని అన్నారు. అందుకే వాళ్లకు వణుకుకాళేశ్వరం ప్రాజెక్టు నిర్మా ణంలో పాలుపంచుకున్న ఇంజనీర్ల దగ్గర ఎసిబి వందల కోట్లు పట్టుకుం టోందని తెలిపారు. ప్రజలు అన్ని విషయాలను గమినిస్తున్నారని చెప్పారు. ప్రజా స్వామ్య యుతంగా మా ప్రభుత్వం అసెంబ్లీలో సమావేశాలు నిర్వహిస్తోందని బిఆర్‌ఎస్ అసెంబ్లీలో అన్ని విషయాలు చెప్పుకోవచ్చుని సూచించారు.

# హరీశ్‌రావువి రెచ్చగొట్టుడు రాజకీయాలు

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** హరీశ్‌రావు రాజకీయాలే పరమావధిగా విన్యాసాలు చేస్తూ ప్రతి విషయాన్ని రాజకీయం చేసి బాధితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆరోపించారు. సిఎల్‌పిలో శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి ఏకంగా 40 సెంటిమీటర్ల వర్షం కురిసింది ఇలాంటి పరిస్థితిలో ప్రకృతి కన్నెర్రచేస్తేదానిని కూడా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ముందు జాగ్రత్తగా రెడ్ అలర్ట్ ప్రకటించిదరి అంచనా వేసినదానికంటే భారీ వర్షం నమోదైంది అయినా ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయ కార్యక్రమాలు చేపట్టిందని ఆయన చెప్పారు. మంత్రులు, కలెక్టర్లు, అధికారులు, పోలీసులు క్షేత్రస్థాయిలో ఉండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షి స్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో అందరూ బాధితులకు అండగా నిలబడాలి, కాని హరీశ్‌రావు మాత్రం వక్రబుద్ధితో విమర్శలు మొదలు పెట్టారని విమర్శించారు. హెలికాప్టర్ వాడటం లేదని హరీశ్‌రావు అనవసర ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వాతావరణం సహకరించకపోవడం వల్లనే హెలికాప్టర్ వాడలేదు ఆర్మీ హెలికాప్టర్ ఇప్పటికే రంగంలోకి దిగింది అని చెప్పారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుకు హెలికాప్టర్‌ను ఎప్పుడు ఎలా వాడతారో తెలియదా? అని నిలదీశారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారని హరీశ్‌రావుకు చేతనైతే బాధితులకు అండగా నిలబడాలి, లేకుండా నోరుమూసుకుని కూర్చోవాలి అని సూచించారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం ఐదుగురు సభ్యులతో కమిటీ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా పార్టీ అభ్యర్థి ఎంపికపై బిజెపి అధిష్టానం దృష్టిసారించింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు ఐదుగురు సభ్యులతో కూడిన మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసారు. బిజెపి శాసనసభ పక్ష ఉప నాయకులు పాయల్ శంకర్, పార్లమెంట్ సభ్యులు ఎం రఘునందన్ రావు, జాతీయ కార్యవర్గ సభ్యులు పార్లమెంట్ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ కార్యదర్శి అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు తదితరులతో కమిటీని ఏర్పాటు చేశారు.

# రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

### బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇబ్రాంశేఖర్ బాధ్యతల స్వీకారం



బిఎస్‌పి రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఇబ్రాం శేఖర్‌ను సన్మానిస్తున్న నేతలు

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఆగస్టు 29, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే బిఎస్పీ అంతిమ లక్ష్యమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ అథర్‌సింగ్‌రావుతో కలిసి ఆయన అధికారికంగా రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు.

చిన్నరాష్ట్రాల ఏర్పాటుతోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని బలంగా నమ్మి, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు 36 మంది బిఎస్పీ ఎంపిలతో మద్దతు తెలిపిందని గుర్తుచేశారు. కాన్షీరామ్ బహుజనులకు జరుగుతున్న అన్యాయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ఉత్తరప్రదేశ్‌లో బిఎస్పీని బలమైన రాజకీయ శక్తిగా మార్చి, మాయావతిని నాలుగుసార్లు ముఖ్యమంత్రిని చేశారన్నారు. తెలంగాణ ఉద్యమం అగ్ర వర్ణాలు చేసిన పోరాటంగా అభివర్ణించారు. ఇప్పుడు తెలంగాణ సంపద ఎక్కువ మొత్తం అగ్రకుల చేతుల్లోనే కేంద్రీకృతమైందని విమర్శించారు. ఆధిపత్య పాలకులు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు బహుజనుల బతుకులు మార్చవన్న ఆయన రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పోరాడి, రాష్ట్రంలో బహుజన రాజ్యాన్ని సాధించాలన్నారు.

# సిఎస్ పదవీకాలం పొడిగింపుపై జెఎసి నేతల హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) రామకృష్ణారావు సర్వీసును 7 నెలలు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సిఎస్‌ని ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జెఏసి చైర్మన్ మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాస్, సచివాలయం అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రేమ్ తదితరులు ముఖ్య కార్యదర్శిని కలిసి అభినందనలు తెలియజేశారు.అధికార వ్యవస్థకు మార్గనిర్దేశకులుగా వ్యవహరిస్తూ, పాలనాపరమైన నైపుణ్యంతో రాష్ట్ర అభివృద్ధికి సిఎస్ రామకృష్ణారావు చేస్తున్న సేవలను వారు కొనియాడారు. పదవీకాలం పొడిగింపు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# గత కెసిఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అబద్ధాలు

## ప్రతి నెలా రూ.7,000 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నారనడం అసత్యం

### 'ఎక్స్' వేదికగా మాజీమంత్రి కెటిఆర్ ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బిఆర్ ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బయటపెడుతూ పలు విషయాలను ఆయన ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక దుష్ప్రచారానికి పాల్పడుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు రాష్ట్రం ప్రతి నెలా రూ.7,000 కోట్ల రుణ వడ్డీ చెల్లిస్తోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కెటీఆర్ ఆరోపించారు. అయితే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ఈ వాదన తప్పని తేల్చిందని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమేనని (4 నెలల్లో రూ.9,355 కోట్లు) పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణ భారాన్ని ఎక్కువ చేసి చూపిస్తుందని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని కెటీఆర్ అన్నారు. ఈ వర్షాల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని, ప్రజలు సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. రూ. 3,50,000 కోట్ల 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ. 1,50,000 కోట్ల మూసీ సుందరీకరణ, రూ. 225 కోట్ల హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల గోడును గాలికొదిలేసి, డబ్బు సంపాదించే పనులపైనే రేవంత్ అండ్ కో దృష్టి పెట్టిందని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు లేకుండా వ్యవహరిస్తుందని, ఇది ప్రజా పాలన కాదని ఆయన ట్వీట్ చేశారు.కేటీఆర్ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ జయంతిని గుర్తు చేసుకుంటూ ట్వీట్ చేశారు. ఆటలు మనకు సహకారం, పోరాట స్ఫూర్తిని నేర్పిస్తాయని అన్నారు. 'మనం కిందపడితే అది ముఖ్యం కాదు, మళ్లీ ఎలా పైకి లేచామన్నదే ముఖ్యం' అని పేర్కొన్నారు. కష్టాలను అధిగమించి మనకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన క్రీడాకారులను మనం గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు.

# హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

## సహాయక చర్యల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలం

## మంత్రులను క్షేత్రస్థాయికి పంపించి నష్టాన్ని అంచనా వేయాలి

### బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ లను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తున్న అంశాలను ప్రస్తావించినట్లు బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి శాసనసభ, శాసనమండలి సభ్యుల సమావేశం జరిగింది. రాష్ట్రంలో జరుగుతున్న అనేక అంశాలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించే విషయాలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 420 తప్పుడు హామీలతో పాటు దాదాపు 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షి గా చేసిన ప్రకటనను పూర్తిగా విస్మరించారని అన్నారు. యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లకు 42 శాతం రిజర్వే షన్ల అంశం, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్షకోట్ల అవినీతి జరిగిందని పదేపదే చెప్పిన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు, ఇవన్నీ ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమే అన్నారు. లక్ష కోట్ల అవినీతి కక్కిస్తా, ఆ డబ్బులతో సంక్షేమ కార్యక్రమాలు చేపడతా నని రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ, 2 సంవత్సరాల పాలన గడిచినా ఇప్పటివరకు అవినీతి పరులపై కేసులు నమోదు చేయలేదు. ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదన్నారు. 100 రోజుల్లో హామీలను నెరవేర్చుతాం, 100 రోజుల్లో అవినీతి సొమ్మును రికవరీ చేస్తాం, 100 రోజుల్లో సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి దాదాపు 20 నెలలు గడిచినా ఇప్పటివరకు అవినీతి సొమ్ము బయట పెట్టలేదన్నారు.

ప్రజాసమస్యలను, అభివృద్ధి అంశాలను విస్మరిస్తూ ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ ప్రభుత్వాన్ని బిజెపి పక్షాన ఖచ్చితంగా నిలదీస్తామన్నారు. మరోవైపు భారీ వర్షాల వల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదలు సంభవించి పంట నష్టం జరిగిందని, ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదు కావడంతో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం వెంటనే స్పందించి హెలికాప్టర్లతోపాటు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సహాయక చర్యల్లో పూర్తిగా విఫలమైందన్నారు. మంత్రులను క్షేత్రస్థాయికి పంపించి నష్టాన్ని అంచనా వేయాలని, తక్షణమే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బిజెపి ఎమ్మెల్యేలతో, ఎమ్మెల్సీలతో కూడిన బృందం ఈ విషయాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షి ంచి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు.

# కామారెడ్డి వరద బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సాయమందించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలోని వరద బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సాయమందించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కామారెడ్డి పట్టణంలో ముంపుకు గురైన ప్రాంతాలను సిపిఎం రాష్ట్ర బృందం శుక్రవారం సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు డిజి నరసింహారావు, ఆర్ వెంకట్రాములు, శోభన్ నాయక్‌లు ముంపు ప్రాంతాలను పర్యటించారు. సిపిఎం నాయకులు ఇంటింటికి తిరిగి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అదే సందర్భంలో అక్క డికి వచ్చిన కలెక్టర్‌ను నిలదీశారు. కనీసం ప్రజలకు త్రాగడానికి మంచి నీళ్లు, ఆహారం, కరెంటు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ను కోరారు. వరదలో కొట్టుకొచ్చిన రాళు, చెత్తాచెదారం ఇంట్లో చేరి బురదమయం అయ్యిందన్నారు. ఇంట్లోకి పాములు కూడా వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. కామారెడ్డి పట్టణంలో వరదను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారని జాన్‌వెస్లీ విమర్శించారు. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణంగా భోజన సౌకర్యాలు, నీటి సౌకర్యాలు కల్పించి.. వారికి నష్టపరిహారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి, జిల్లావ్యాప్తంగా కూడా వరదల వల్ల అనేకగ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలు లేక త్రాగునీరు లేక ఎటు వెళ్లలేని పరిస్థితిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జాన్ వెస్లీ అన్నారు.

# బిసిలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కావాలి

### పార్టీపరమైనవి వద్దు

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కావాలని.. పార్టీపరమైన రిజర్వేషన్ వద్దని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపరంగా బిసిలకు 42 శాతం కేటాయిస్తామంటే ఊరుకునేది లేదని.. పార్టీపరంగా టికెట్లు ఇచ్చే దానికి అయితే 20 నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎందుకు ఆపినట్టని ప్రశ్నించారు. శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో చట్ట బద్ధంగా బిసిలకు రిజర్వేషన్ కల్పించడానికి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్యాబినెట్ సమావేశం అనంతరం మంత్రి మండలి మొత్తం రాష్ట్ర గవర్నర్‌ని కలిసి బిసి రిజర్వేషన్లపై వత్తిడి పెంచాలని.. మంత్రివర్గ ఉప సంఘం కాంగ్రెస్ పార్టీ పీఏసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం బిసిలకు న్యాయం జరిగే విధంగా ఉండాలని.. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించడానికి అసెంబ్లీ సమావేశాల్లో బిసి రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేయాలన్నారు. బిసి రిజర్వేషన్లపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు న్యాయపోరాటం.. మరొకవైపు రాజకీయ పోరాటం చేయాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. బిసి రిజర్వేషన్లు పెంపుపై చట్టబద్ధంగా సాధ్యం కాకపోతే.. చివరి అవకాశంగా మాత్రమే పార్టీ పరంగా బిసిలకు టికెట్లు కేటాయింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించాలన్నారు. బిసి రిజర్వేషన్లు పెంచకపోతే బిసి కులగణనకు అర్థం లేదన్నారు. దేశంలో రోల్ మోడల్ అని చెప్పి .. ఇప్పుడు తీరా పార్టీ పరంగా టికెట్లు ఇస్తామంటే, ఇది ఓల్డ్ మోడల్ అవుతుందన్నారు. బీహార్ లో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావాలంటే ..తెలంగాణలో బిసి రిజర్వేషన్లను పెంచి కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తేనే బీహార్‌లో బిసిలు కాంగ్రెస్‌ను విశ్వసిస్తారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిజెపి బిసిలకు చేస్తున్న మోసంపై దేశవ్యాప్తంగా పోరాడడానికి కాంగ్రెస్ పార్టీ బిసిలతో కలిసి రావాలన్నారు. నేటి జరిగనున్న అసెంబ్లీ సమావేశాల్లో మరోసారి ప్రధాని నరేంద్ర మోడీ సమయాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# వరదలకు హారతి పట్టడం సిఎం రేవంత్‌రెడ్డి వింతధోరణి

### మీడియా పాయింట్ వద్ద బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధోరణి వింతగా ఉందని వరదలకు హారతి పడుతున్నారనని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద విమర్శించారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వివేకానంద విలేఖరులతో శుక్రవారం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం బట్టలు విప్పేందుకు సిద్ధంగా ఉన్నామనిస్పష్టం చేశారు. అసెంబ్లీలో ఎలాంటి చర్చకైనా బిఆర్‌ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని ఆయన తేల్చిచెప్పారు..ఉత్తర తెలంగాణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బురద రాజకీయం చేస్తున్నారని దుయ్యబ్టారు. బిఆర్‌ఎస్ పార్టీ పైన బురదచల్లడానికి రేవంత్ రెడ్డి అసెంబ్లీని రాజకీయ వేదికగా వాడుకుంటున్నారు. అకాల వర్షాలు, వరదలతో పెద్ద ఎత్తున నష్టం జరిగింది. ప్రజలను, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. బిఆర్‌ఎస్‌ను ఇబ్బంది పెట్టేందుకు పిసి ఘోష్ కమిషన్‌ను రేవంత్ రెడ్డి అడ్డం పెట్టుకున్నారు. రాష్ట్రంలో వరదలు వస్తే సీఎం బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. తెలంగాణ హెలికాప్టర్‌ను రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారానికి రేవంత్ రెడ్డి పంపించారు. రేవంత్ రెడ్డికి అధిష్టానం మాత్రమే ముఖ్యం, ప్రజలు ముఖ్యం కాదు. అసెంబ్లీ సమావేశాలతో ప్రభుత్వం సాధించేది ఏంటి..? అని వివేకానంద నిలదీశారు.ఏరియల్ వ్యూను సిఎం రేవంత్ రెడ్డి రాజకీయాలకు వాడుకుంటున్నారు. సిఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి వింతగా ఉంది. వరదలకు రేవంత్‌రెడ్డి హారతి పడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడానికి వెళ్లిన రేవంత్‌రెడ్డి.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుపై బురదజల్లే ప్రయత్నం చేశారు. ఉస్మానియా పర్యటనలోను కెసిఆర్ రేవంత్ రెడ్డి బురదచల్లారు. అసెంబ్లీలో ఎలాంటి చర్చకు అయినా బిఆర్‌ఎస్ సిద్ధంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ అంశంలో కమిషన్ వేసి తోక ముడుచుకుంది. ఫార్ములా ఈ కార్ రేస్‌పై అసెంబ్లీలో చర్చ చేయాలని బిఆర్ ఎస్ డిమాండ్ చేస్తే ప్రభుత్వం పారిపోయింది. అసెంబ్లీలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల మైక్ కట్ చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల మైక్ కట్ చేయకుండా అవకాశం ఇవ్వాలి. అసెంబ్లీలో ప్రభుత్వం బట్టలు విప్పేందుకు బిఆర్‌ఎస్ సిద్ధంగా ఉంది. యూరియాతో రైతులు, వరదలతో ప్రజలు రోడ్డు మీద ఉన్నారు. ప్రభుత్వం బిఆర్‌ఎస్ పార్టీపై ఎన్ని కుట్రలు చేసినా ఎదుర్కొంటాం. ప్రభుత్వానికి కోర్టుల్లో చివాట్లు ఎదురవుతున్నాయి అని వివేకానంద తెలిపారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ అసత్యప్రచారం

### స్పీకర్‌ను కలిసిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు శుక్రవారం కలిశారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ద్వారా వివరించే అవకాశాన్ని బిఆర్‌ఎస్ ఎల్పి కల్పించాలని స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో అసెంబ్లీలో బిఆర్‌ఎస్ విప్ కెపి వివేకానంద, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బిఆర్‌ఎస్‌ఎల్పి కార్యాలయ కార్యదర్శి ఎం రమేష్ కుమార్ రెడ్డి ఉన్నారు అనంతరంఅసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి సుధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల దోపిడీ అంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రభుత్వం సోషల్ మీడియాలో లీక్ చేసింది.



శుక్రవారం సచివాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

# బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో మళ్లీ చట్టం చేయండి: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై శనివారం నుండి జరిగే అసెంబ్లీలో మరోసారి చట్టం చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సచివాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈసారి చట్టం చేస్తే తప్పనిసరిగా గవర్నర్ పాస్ చేస్తారు. జిఒ తీసి ఎన్నికలు జరపవచ్చు. మంత్రివర్గ కమిటీ చేసిన మూడు ప్రతిపాదనలో ఒకటి జిఒ తీసి ఎన్నికలు జరపాలని చేసిన సిఫార్సు పూర్తిగా సమర్థిస్తాం' అని ఆయన పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో 42 శాతం పెట్టడానికి ఇష్టంలేక ప్రభుత్వం అనేక డైవర్షన్ పాలిటిక్స్ ఆడుతుందన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వానికి రిజర్వేషన్లు పెంచడానికి ఇష్టంలేక కేంద్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. గవర్నర్ చేత ఆర్డినెన్స్ ఆమోదింపచేసి జిఒ జారీ చేయాలి. లేదా అసెంబ్లీలో మరోసారి బీసీ బిల్లు పాస్ చేసి గవర్నర్‌కు పంపితే ఆటోమేటిక్‌గా పాస్ చేస్తారని ఆర్.కృష్ణయ్య అన్నారు. చివరి అస్త్రంగా 30వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశంలో చట్టం చేయాలనీ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆర్థిక అస్థిరత తొలగింపులో భారత్-చైనా కలిసి పనిచేయాల్సిందే

### టోక్యో మీడియాతో ప్రధాని మోడీ



**టోక్యో, ఆగస్టు 29:** భారత్‌చైనా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ప్రస్తుత ప్రపంచం ఆర్థికవ్యవస్థలో అస్థిరత దృష్ట్యా ప్రపంచ ఆర్థిక క్రమానికి ఓ స్థిరత్వాన్ని తీసుకు రావాలంటే ఇరుదేశాలు ముందడుగు వేయక తప్పదన్నారు. డ్రాగన్‌తో పరస్పర గౌరవం, ఆసక్తి సున్నితత్వంతో వ్యవహరిస్తూ వ్యూహాత్మక ద్వైపాక్షిక బంధాలు ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. జపాన్‌లో మీడియాతో మాట్లాడిన మోడీ భారత్‌చైనాలమధ్య బలపడుతున్న స్థిరమైన స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధాలుప్రాంతీయ, ప్రపంచ శాంతి, శ్రేయస్సుపై సానుకూల ప్రభావం చూపిస్తాయన్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానంపై జపాన్ పర్యటన అనంతరంచైనాకు వెళుతున్నట్లుమోడీ తెలిపారు. గత ఏడాది పర్యటనలో అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోపలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించా నన్నారు. పలుసవాళ్లపరిష్కారానికి కమ్యూనికేషన్‌ను మెరుగుపరుచుకోడానికి భారత్‌చైనాలు కృషిచేస్తున్నాయన్నారు. జపాన్‌పర్యటనలో ఉన్న మోడీ ఆదేశ ప్రధాని షిగేరు ఇషిబాతో భేటీ అయ్యారు. ఎఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్‌రైలు పెట్టుబడులే అజెండాగా వీరిమధ్య ద్వైపాక్షిక చర్చలుజరిగాయి. అక్కడినుంచి చైనాకు వెళ్లే ప్రధానిమోడీ ఈనెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో తియాంజిన్ వేదికగా జరిగే షాంఘై సహకారసంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు.

## ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

### వర్సిటీల నుంచి డిగ్రీ కాలేజీల వరకు నిర్వహణ


**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తెలుగు భాషా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీ లతోపాటు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనూ నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష కాపాడుకుంటే మన సంస్కృతిని కాపాడ వచ్చని, ఆ భాద్యత ఇకపై విద్యార్థులదేనని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి రాజేంద్రకుమార్ అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ, వైభవం గూర్చి గణిత విభాగ సహాయాచార్యులు నవీన్ చందర్ రాజు మాట్లాడారు.

## వర్షాలకు దెబ్బతిన్న 589 అంగన్‌వాడీ భవనాలు

### అంచనా వ్యయం రూ.17 కోట్లు అవసరం

### మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా అంగన్వాడీ కేంద్రాలకు నష్టం జరిగింది. రాష్ట్రంలో సొంత భవనాల్లో నడుస్తున్న 440 అంగన్వాడీ కేంద్రాలు, రెంట్ ఫ్రీ భవనాల్లో నడుస్తున్న మరో 140 కేంద్రాలు కలిపి మొత్తం 580 భవనాలు వర్షాల ప్రభావంతో దెబ్బతిన్నాయని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో పైకప్పుల లీకేజీలు, గోడలు మరియు బేస్‌మెంట్‌లో పగుళ్లు, ఫ్లోర్ దెబ్బతినడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపించాయన్నారు. కొత్తగూడెం జిల్లాలో 75, నిర్మల్‌లో 100కుపైగా, కామారెడ్డిలో 49, గద్వాల్‌లో 40, హనుమకొండలో 25, మెదక్‌లో 25, వనపర్తిలో 22, ఆసిఫాబాద్‌లో 20, ములుగులో 20 అంగన్వాడీ భవనాలు దెబ్బతిన్నట్లు వివరించారు. ఈ భవనాల మరమ్మత్తులకు భారీగా నిధులు అవసరమవుతాయని అంచనా వేసినట్లు తెలిపారు. సొంత భవనాల మరమ్మత్తులకు రూ. 14 కోట్ల రూపాయలు, రెంట్ ఫ్రీ భవనాల మరమ్మతులకు రూ. 3 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అధికారులు లెక్కగట్టినట్లు చెప్పారు. పిల్లల పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, విద్య ఒక్కరోజు కూడా అంతరాయం లేకుండా కొనసాగాలని స్పష్టం చేశారు. సురక్షి త భవనాల్లో అంగన్‌వాడీ సేవలు నిరంతరం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ చెక్కును అందజేసిన ఎల్ఐసి

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** భారత ప్రభుత్వానికి డివిడెండ్ చెక్కును ఎల్ఐసి ఆఫ్ ఇండియా అందజేసింది. ఈ నెల 26న జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారులు ఆమోదించిన డివిడెండ్‌లో భారత ప్రభుత్వ వాటాగా, ఎల్ఐసి ఆఫ్ ఇండియా సిఇఒ, ఎండీ ఆర్. దొరైస్వామి శుక్రవారం రూ.7324.34 కోట్ల డివిడెండ్ చెక్కును కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్‌కు అందజేశారు. ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నాగరాజు ఎం, భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల విభాగం జాయింట్ సెక్రటరీ డాక్టర్ పర్శాంత్ కుమార్ గోయల్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు సత్‌పాల్‌భానూ, ఎండీ దినేష్ పంత్, ఎండీ రత్నాకర్ పట్నాయక్, జెడ్ఎం (ఐ/సి), నార్తర్న్ జోన్ అధికారులు పాల్గొన్నారు. ఎల్ఐసి స్థాపించబడినప్పటి నుండి 69 అద్భుతమైన సంవత్సరాలు పూర్తి చేసుకుంటోంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి దాని ఆస్తి విలువ రూ. 56.23 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది భారతీయ జీవిత బీమా మార్కెట్లో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోంది.

## 2070 నాటికి నెట్‌జీరో లక్ష్యాలను చేరుకునేందుకు కృషి

### జపాన్‌తో ద్వైపాక్షిక సహకారం మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** భారత్‌జపాన్ మధ్య మైత్రి మరింత బలోపేతం చేసే దిశగా జపాన్‌లో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారి పర్యటన కొనసాగుతోంది. భారత్-జపాన్ 15వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు టోక్యో చేరుకున్న ప్రధాని మోడీ, జపాన్ ప్రధాన మంత్రి షిగేరు ఇషిబాతో కలిసి ద్వైపాక్షి క సంబంధాలపై చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి జపాన్ పర్యటన నేపథ్యంలో ఇరుదేశాల ప్రధానుల మధ్య క్రిటికల్ మినరల్స్ విషయంలో జరిగిన ఒప్పందానికి సంబంధించి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక, ఆరోగ్య, మొబిలిటీలో భాగస్వామ్యం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ తోపాటుగా క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరుదేశాల ప్రతినిధులు కీలకమైన చర్చలు జరిపారు. అంతర్జాతీయంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న ద్వైపాక్షి క సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారని తెలిపారు. ఈ సప్లయ్ చైన్ ద్వారా భారత ఇంధన భద్రత (ఎనర్జీ సెక్యూరిటీ), జాతీయ భద్రత (నేషనల్ సెక్యూరిటీ), ఆహార భద్రత (ఫుడ్ సెక్యూరిటీ) లక్ష్యాలను చేరుకోవడంతోపాటుగా 2070 నాటికి నెట్ జీరో లక్ష్యాలను చేరుకునేందుకు చేస్తున్న కృషికి సహకారం అందుతుందని తెలిపారు.

# జోరు వానలతో ప్రాజెక్టులకు భారీగా కొనసాగుతున్న వరద

### ఎస్సారెస్పీ 39 గేట్లు ఎత్తి ఐదు లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

### లక్ష్మీబ్యారేజి వద్ద 9,36,890 క్యూసెక్కుల వరద ఉప్పొంగుతోంది

### భద్రాచలం వద్ద ఆరు లక్షల క్యూసెక్కుల గోదావరి వరద నీరు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. గోదావరి కృష్ణా నదుల ప్రాజెక్టుల నుంచి లక్షల క్యూసెక్కుల నీరు కిందికి వదిలిపెడుతున్నారు. జూరాల కు 204000క్యూసెక్కుల నీరు వరదగా వస్తుంటే 196791 క్యూసెక్కుల నీరు కిందికి వదులు తున్నారు. శ్రీశైలం నుంచి 3,34,994 క్యూసెక్కుల నాగార్జునసాగర్ నుంచి 2,60,673 క్యూసెక్కులనీరు నీరు కిందికి వదులు తున్నారు. మేడిగడ్డ లక్ష్మీబ్యారేజి వద్ద 9,36,890 క్యూసెక్కుల వరదతో గోదావరి ఉప్పొంగుతోంది. జోరువానలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 4,30,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా 39 ప్రధాన గేట్ల ద్వారా 5,04,455 నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సింగూర్‌కు 58,308 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా 51827క్యూసెక్కులు బయటకు పంపుతున్నారు. నిజామ్‌సాగర్‌కు 161944 క్యూసెక్కులు పైనుంచి వరదవస్తే అంతే మొత్తం కిందికి వదులుతున్నారు. ఎగువ మానేరుకు ఔట్‌ఫ్లో ఇన్‌ఫ్లో 40195 క్యూసెక్కులుంది. మధ్యమానేరుకు 55వేల ఇన్‌ఫ్లో ఉంటే 25వేల క్యూసెక్కులు కిందికి వదులు తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 38 గేట్లు తెరిచి 6,79,019 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మూడు రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్ట్ కు భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 1,63,043 క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల దిగువన ఉన్న ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ భారీ వర్షాలకు మరోసారి గోదావరిలోకి వరద పోటెత్తింది. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడ వరద మొదటి ప్రమాదకర హెచ్చరిక స్థాయిని దాటింది. కాళేశ్వరంలో జ్ఞాన సరస్వతి, పుష్కర ఘాట్ల మెట్ల పైనుంచి వరద ప్రవహిస్తోంది. గోదావరి పరివాహక సమీప గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మహదేవపూర్ మండలంలో పంట భూముల్లోకి నీరు చేరింది. అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, బలిజాపూర్ గోదావరి పరివాహక ప్రాంతాల్లోని వాగులు ఉప్పొంగడంతో వందల ఎకరాల పత్తి పంట నీట మునిగింది. రెండోసారి పత్తి పంటనష్టంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి 9,71,880 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో 85 గేట్లు ఎత్తి 9,71,880 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. మెదక్ జిల్లా హావేలీ ఘనపూర్‌లోని పోచారం ప్రాజెక్టు వరద ఉధృతితో చిక్కుకున్న 8 మంది యువకులను రక్షి ంచేందుకు ఆర్మీ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నా రు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మడలం లింగంపల్లికి చెందిన యువకులు వినాయకచవితి రోజు విగ్రహాన్ని తీసుకెళ్లేందుకు హావేలీ ఘన్పూర్ వచ్చారు. తిరిగివెళ్లే క్రమంలో పోచారం ప్రాజెక్టు వరదతో అక్కడి వంతెన తెగిపోయింది. అవతలి ఒడ్డున చిక్కుకున్న వారిన్ రక్షించేందుకు ఆర్మీ సిబ్బంది సహకారంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఆర్మీ సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని రక్షించేందుకు యత్నిస్తున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి 10,616 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంలో జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో జలాశయం ఐదు గేట్లను పైకి ఎత్తి దిగువనున్న మంజీరాలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు. కాగా నీటి నిల్వ సామర్థం 1.237 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుత నీటిమట్టం 457.35 మీటర్లు. నీటి నిల్వ సామర్థం 1.083 టీఎంసీలుగా నమోదు అయినట్లు ఏఈ సుకుమార్ రెడ్డి తెలిపారు మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సింగూర్ నుంచి ఉధృతంగా వరద రావడంతో వరదుర్గఆనకట్ట నుంచి 59 వేల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గర్భగుడి ఎదుట ఉన్న మంజీరా నది పాయ ఆలయ మండపానికి ఉన్న రేకులను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆనకట్ట వైపు భక్తులు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు పహారా కాస్తున్నారు.

## జాతికి గుర్తింపు మాతృభాషతోనే

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు

### వైభవంగా తెలుగుభాషా దినోత్సవం



గ్రంథావిష్కరణ చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, రమణాచారి, నిత్యానందరావు, వసుంధరారెడ్డి, సుధారాణి, రఘురామ్ తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 29, ప్రభాతవార్త :** ప్రపంచంలోనే ఏ జాతికైనా గుర్తింపు ఆ జాతి మాతృ భాషలోనే వస్తుందన్న, అందుకే మన భాషను కాపాడుకోవాల్సిన అవసర ముందని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు భారతదేశంలో ఎన్ని భాషలున్నా తెలుగుభాష లెస్సా అనేది శాశ్వతం తిరుగులేనిదని స్పష్టం చేశారు. ఇతర భాషలను కించపరచడం కాదుగానీ తెలుగుభాషలోని తియ్యదనం, సుమధుర్యాన్ని విశ్వవ్యాప్తంగా కొనియాడుతున్నారని గుర్తుచేశారు. తెలుగు ప్రాచీనతతోపాటు గ్రాంధిక, వాడుక భాషల్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, మాతృభాష సమితి సంయుక్త ఆధ్వర్యంలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవుపల్లి రామానుజరావు కళావేదికలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన తెలుగుభాషా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి తెలంగాణ రాష్ట్రాధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు విశిష్ట అతిథులు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఎం.నాగేశ్వరరావు, డా. శ్రీరంగాచార్య, డా. చింతపల్లి వసుంధరారెడ్డి, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం తదితరులతో కలిసి డా. సగిలి సుధారాణి సంపాదకత్వం వహించిన ప్రాచీన తెలుగు మార్గాన్వేషణ-పరిష్కరణ (శాసనాలు- నాణేలు- తాళపత్రాలు-లిపి) గ్రంథాన్ని ఆవిష్కరించి సుధారాణిని ఎంతగానో అభినందించి ప్రసంగించారు. ఈ గ్రంథంలో తెలుగుభాష ఎప్పుడు, ఎన్నేళ్లు, ఎక్కడ నుండి ప్రారంభమై వృద్ధిచెందిదన్న పరిశోధన, వచ్చిన శబ్ద పదాల మార్పులు అన్నీ పరిశోధనల్లో ఒక భాగమని చెబుతూ భాషలోనే పరిశోధనలు ఎక్కువగా ఉంటాయన్నారు. భాషలో మానవజాతి, నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు ముడిపడి ఉంటాయని, ఈ గ్రంథం తెలుగుభాష పరిశోధక విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. చివరిగా ప్రపంచంలో ఎక్కడా లేనట్లు ఇక్కడ ఎన్నో మతాలు, దేవుళ్లు, కులాలు, సంస్కృతి, సంప్రదాయాలు చరిత్రలున్నాయని ఎవరి మాతృభాషను వారు ప్రేమించడం, గౌరవించుకోవడం తప్పుకాదు గానీ ఇతర భాషలను అవమాన కించ పరచకూడదని హితవుపలికారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో నిజానికి నేటితరానికి శాసనాలు, తాళపత్రాలు, నాణేలు, లిపి తెలిసింది చాలా తక్కువని, నేటికీ వాటి విలువ, ప్రాముఖ్యత గురించి పట్టించుకుంటున్న దాఖలు మృగ్యమని వేదన చెందుతూ, వీటిద్వారా చరిత్రలో వచ్చిన స్థితిగతులు తెలుస్తాయని ప్రతీఒక్కరూ ఈ గ్రంథాన్ని తప్పక చదవాలని సూచించారు. మన భాష, సంస్కృతి, జాతి ఔనత్యం గురించి ఇప్పటికీ తెలుసుకోకపోతే రానున్నతరాలకు ఏమాత్రం అందదని బాధను వ్యక్తపరిచారు. చివరిగా రచయితను ఘనంగా సత్కరించారు.

## ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీఎకు 324 సీట్లు!

### మూడ్ ఆఫ్‌ది నేషన్ సర్వేలో అంచనాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** లోక్‌సభ 2024ఎన్నికల్లో సాధారణ మెజారిటీకి కొద్ది దూరంలో నిలిచి పోయిన ఎన్డీయే కూటమి మళ్లీ బలంగా పుంజుకున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగితే ఎన్డీయే కూటమి ఏకంగా 324 స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని ఇండియా టుడేసి ఓటర్ నిర్వహించిన మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే అంచనా వేసింది. ఇది 2024లో సాధించిన 293 సీట్ల కంటే బాగా ఎక్కువ కావడం గమనార్హం. ఇటీవల హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలు ఈ మార్పునకు కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సర్వే ప్రకారం కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బలం తగ్గముఖం పట్టనుంది. 2024లో 234 సీట్లు గెలుచుకుని ఎన్డీయేకు గట్టి పోటీ ఇచ్చిన ఈ కూటమి, ఇప్పుడు ఎన్నికలు జరిగితే 208 సీట్లకే పరిమితమవుతుందని సర్వే వెల్లడించింది. కూటమిగా ఎన్డీయే బలం పెరిగినప్పటికీ, సొంతంగా బీజేపీకి మాత్రం మెజారిటీ మార్కు (272) అందడం కష్టమేనని సర్వే పేర్కొంది. తాజా అంచనాల ప్రకారం బీజేపీ 260 స్థానాలు గెలుచుకుంటుందని, ఇది 2024లో గెలిచిన (240) సీట్ల కంటే ఎక్కువైనా, సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సరిపోదని స్పష్టమవుతోంది. ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికొస్తే 2024లో 99 స్థానాలు గెలుచుకోగా ఇప్పుడు 97 సీట్లు సాధిస్తుందని సర్వే అంచనా వేసింది. ఓట్ల శాతం పరంగా చూస్తే ఎన్డీయే కూటమికి ప్రజాదరణ పెరిగినట్టు తెలుస్తోంది. 2024లో 44 శాతం ఓట్లు సాధించిన ఈ కూటమికి ఇప్పుడు ఎన్నికలు జరిగితే 46.7 శాతం ఓట్లు వస్తాయని సర్వే తెలిపింది. మరోవైపు, ఇండియా కూటమి ఓట్ల శాతం 40.9 శాతంగా ఉండొచ్చని అంచనా. జులై 1 నుంచి ఆగస్టు 14, 2025 మధ్య దేశవ్యాప్తంగా మొత్తం 2,06,826 మంది అభిప్రాయాలను సేకరించి ఈ సర్వేను రూపొందించారు.

## లాస్‌ఏంజెల్స్‌లో ఘట్కాతో హల్‌చల్ చేసిన వ్యక్తి కాల్చివేత



**లాస్‌ఏంజెల్స్, ఆగస్టు 29:** సిక్కు సాంప్రదాయంలోని మార్షల్ ఆర్ట్ 'ఘట్కా'ను నడిరోడ్డుపై కత్తితో చేసిన 36 యేళ్ల సిక్కు యువకుడు గురుప్రీత్‌సింగ్‌ను స్థానిక పోలీసులు కాల్చి చంపారు. ఒక రోడ్డు మధ్యలోనే సిక్కు యువకుడు ఘట్కా ప్రదర్శిస్తూ హల్‌చల్ చేయడంతో అమెరికా పోలీసులు ఇదేదో విద్రోహ చర్య అనుకున్నారో ఏమోకాని అక్కడికక్కడే కాల్చి వేసారు. ఒక కత్తిని తీసుకుని లాస్‌ఏంజెల్స్‌లోని క్రిప్టో డాట్‌కామ్ ఏరినా వద్ద ఈ వ్యక్తి హల్‌చల్ చేసాడని పోలీసులు తెలిపారు. తాము ఎంతగా చెప్పినా వినిపించుకోలేదని, ఒకదశలో పోలీసులపైనే దాడికి యత్నించాడని అన్నారు. భారతీయ మార్షల్ ఆర్ట్స్‌లో వినియోగించే రెండువైపులా పదును ఉన్న కత్తి 'ఖండా' అని గుర్తించి స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. గత జులై 13వ తేదీ ఈ సంఘటన జరిగింది. లాస్ ఏంజెల్స్‌పోలీసులకు 911 నంబరుపై అనేక ఫిర్యాదులు అందాయి. ఫిగ్యూరో వీధిలో గురుప్రీత్ కత్తితో హల్‌చల్‌చేస్తూ ప్రజలను భయ భ్రాం తులకు గురి చేసాడ న్నారు. సింగ్ తన వాహ నాన్ని రోడ్డు మధ్యలోనే నిలిపి ఉంచాడని, ఒకదశలో తన నాలుక కోసుకోడానికి కూడా ప్రయత్నించాడన్నారు. మా అధికారులు అనేక సార్లు హెచ్చరికలు జారీ చేసారని, కత్తిని వెంటనే కింద పడేయాలని చెప్పామని అయినా వినిపించుకోలేదన్నారు. పోలీసులు ఆతని సమీపంలోకి వస్తుండగా ఒక సీసాను వారిపైకి విసిరి ఆ ప్రాంతంనుంచి పారిపోయే ప్రయత్నం చేసాడు. వెంబడించిన పోలీసులకు వాహనం ఆపి వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత మళ్లీ రోడ్డుపైకి రావడం, పోలీసులపైకి కత్తితో రావడంతో చివరకు కాల్పులుజరపాల్సి వచ్చిందని వెల్లడించారు.

## విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జ్ డిజిగా విక్రమ్‌సింగ్‌మాన్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇంచార్జ్ డీజీగా విక్రమ్ సింగ్‌మాన్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పదవి కాలం ఆగస్టు 31తో ముగియనుంది. 1998 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన విక్రమ్ సింగ్ మాన్ ప్రస్తుతం హైదరాబాద్ నగరం అదనపు సీపీ(శాంతి భద్రతలు)గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇంచార్జ్ డీజీగా విక్రమ్ సింగ్‌మాన్‌ను నియమిస్తూ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## కేంద్రమంత్రి అమిత్‌షా తలనరికి టేబుల్ మీద పెట్టాలి!

### టిఎంసి ఎంపి మహువా మొయిత్రా సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా, ఆగస్టు 29:** తన వ్యాఖ్యలతో తరచూ వివాదాస్పదమవుతున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా మరోసారి వివాదం రేపారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమిత్‌షా తల నరికి టేబుల్ మీద పెట్టాలి అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు తాజాగా రాజకీయ దుమారం రేపుతున్నాయి. పశ్చిమబెంగాల్‌లోకి బంగ్లా అక్రమ వలసదారుల ప్రవేశం గురించి మీడియా ప్రశ్నించినప్పుడు మహువా మెయిత్రా ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశ సరిహద్దులకు రక్షణ లేకపోతే వందలాది మంది చొరబాటుదారులు లోపలకు అడుగుపెట్టి మన మహిళలను అగౌరవపరుస్తూ మన భూములు లాక్కుంటుంటే మనం అమిత్‌షా తల నరికి టేబుల్‌పై పెట్టాలి. అది మన బాధ్యత అని మహువా మొయిత్రా అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చొరబాటుదారుల వల్ల జనాభాలో మార్పులు వస్తున్నాయని చెప్పారని, అప్పుడు ముందు వరుసలో ఉన్న హోం మంత్రి నవ్వుతూ, చప్పట్లు చరిచారని ఆమె అన్నారు. సరిహద్దుల వెంబడి బీఎస్ఎఫ్ ఉన్నప్పటికీ చొరబాట్లు ఎలా కొనసాగుతున్నాయని ఆమె ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో అక్రమ వలసలకు కేంద్ర నాయకత్వమే కారణమంటూ విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి అమిత్‌షాపై మహువా మొయిత్రా చేసిన వ్యాఖ్యలపై బీజేపీ భగ్గుమంది. విద్వేషంతో విషం చిమ్మేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని బీజేపీ నేత ప్రదీప్ భండారి మండి పడ్డారు. కాగా, మహువా మొయిత్రా వ్యాఖ్యలపై సందీప్ మజుందార్ అనే స్థానికుడు కృష్ణానగర్ కొత్వాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అంగన్‌వాడీల క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టండి: హైకోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** కాంట్రాక్ట్ పేరుతో అంగన్‌వాడీలను ఏండ్లపాటు సేవలు చేయించుకుని సర్వీస్ క్రమబద్ధీకరించకుండా, కొత్తగా చేపట్టే నియామకాల్లో పాల్గొనాలని చెప్పడం సరికాదని హైకోర్టు హైకోర్టు అభిప్రాయపడింది. కోర్టును ఆశ్రయించిన వారిని క్రమబద్ధీకరించాలని ఆదేశించింది. కొత్తగా నోటిఫికేషన్ జారీచేయడాన్ని సవాల్ చేస్తూ 2013లో దాదాపు 200 మంది అంగన్‌వాడీలు వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో అప్పట్లో నోటిఫికేషన్‌పై స్టే మంజూరుచేయగా వారు ఇప్పటికీ కాంట్రాక్ట్ పద్ధతిలోనే కొనసాగుతున్నారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన మీరాబాయ్ తదితరులు మరో మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక తాజాగా విచారణ చేపట్టి తీర్పును వెలువరించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సూపర్‌వైజర్ గ్రేడ్2 పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో అంగన్‌వాడీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు 15 శాతం వెయిటేజీ కేటాయించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. క్రమబద్ధీకరణ అనంతరం పదవీ విరమణానంతర ప్రయోజనాల కల్పనలో సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.

## నిమ్స్‌లో రోగుల వైద్య సేవలపై ఆరా

### మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నిమ్స్‌లో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో వైద్యాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజారావు డాక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్‌లో ఈ ఏడాది తొలి 7 నెల్లలో (జనవరి నుంచి జులై) 5 లక్షల 44 వేల మందికి వైద్య సేవలు అందించామని డాక్టర్ బీరప్ప తెలిపారు. అందులో సగానికిపైగా ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ వంటి ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందారని తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందుతుండడంతో, నిమ్స్‌కు వచ్చే పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రికి వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కూడా చేశామని వెల్లడించారు. సమీక్ష సందర్భంగా నిమ్స్ డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందిని మంత్రి అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో నిమ్స్‌కు వస్తున్న పేషెంట్ల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం నిమ్స్ ఎమర్జెన్సీకి రోజుకు 80 నుంచి వంద మంది పేషెంట్లు వస్తున్నారని డైరెక్టర్ బీరప్ప తెలిపారు.

## అభివృద్ధిని అడ్డుకోలేకపోయిన అమెరికా టారిఫ్‌లు!

### తొలి త్రైమాసికంలో భారత్ జిడిపి 7.8% వృద్ధి నమోదు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** భారత్ అమెరికా అధ్యక్షుడు విషం కక్కుతూ 50 శాతం సుంకాలు అమలుచేస్తున్నా అభివృద్ధిలో భారత్‌ను ఎంతమాత్రం అగ్రరాజ్యం అడ్డుకోలేకపోయింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో భారత్ ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని నమోదుచేయడమే ఇందుకు నిదర్శనం. కేంద్ర అర్థగణాంకశాఖ వెల్లడించిన వివరాలప్రకారం తొలిత్రైమాసికంలో వ్యవసాయ రంగం మెరుగ్గా రాణించడం జిడిపి వృద్ధికి దోహదంచేసింది. దీనితోపాటు వాణిజ్యం, ఆతిథ్యం, ఫైనాన్షియల్, రియల్‌ఎస్టేట్‌రంగాలు కూడా రాణించడం కలిసొచ్చింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 6.5శాతం చొప్పున నమోదయిన జిడిపి వృద్ధి ఈసారి ఏకంగా 7.8శాతానికి పెరిగింది. 2024 జనవరి మార్చి త్రైమాసికంలోకూడా 8.4శాతం వ1ద్ధి నమోదయింది. ఆ తర్వాత భారీ స్థాయిలో జిడిపి వృద్ధినమోదుకావడం ఇదే తొలిసారి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ముందువరుసలో ఉందనడానికి తాజా గణాంకాలే నిదర్శనమని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. ప్రస్తుత త్రైమాసికంలో పొరుగుననే ఉన్న చైనా 5.2శాతం వృద్ధిమాత్రమే నమోదుచేసింది. రష్యా చమురు కొనుగోళ్లపై రగిలిపోతున్న ట్రంప్ భారత్‌పై 25శాతం సుంకాలు వడ్డించారు.

## ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

**హైదరాబాద్ (హుడా కాంప్లెక్స్), ఆగస్టు 29, ప్రభాతవార్త:** ప్రియుడుతో కలిసి భార్య, భర్త ను హత్య చేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైది రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కోదండరాం నగర్ రోడ్ నెం. 7లో నివాసం ఉంటున్న జెల్లెల శేఖర్ (40), చిట్టి(33) వివాహం 16 సంవత్స రాల క్రితం జరిగింది. గత కొంత కాలంగా వారు కోదండరాం నగర్ లో నివాసం ఉంటున్నారు. వృత్తి రిత్యా డ్రైవర్ అయిన శేఖర్ బయట ప్రదేశాలకు వెళ్ళినప్పుడు చిట్టి హరీష్ అనే యువకుడితో అక్రమ సంబంధం పెట్టుకుంది. ఇట్టి విషయంలో శేఖర్, చిట్టినీ నిలదీశాడు. ప్రియునికి, చిట్టికి మధ్య భర్త అడ్డుగా వస్తున్నాడని భావించి ఈ నెల 28న (గురువారం) చిట్టి తన ప్రియుడు హరీశ్‌తో కలసి హత మార్చి, రాత్రి నిద్రలోనే భర్త శేఖర్ చనిపోయినట్లు మరుసటి రోజు 100కు ఫోన్ చేసింది. ఘటన స్థలానికి చేరుకున్న సరూర్‌నగర్ పోలీసులు భార్య చిట్టి పై అనుమానంతో తమదైన శైలిలో విచారించగా తన ప్రియుడుతో కలిసి భర్తను హత్య చేసినట్లు తెలపడంతో చిట్టిని అదుపులోకి తీసుకున్నారు. ప్రియుడు పరారీలో ఉన్నాడు. ఘటనపై సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదుచేసి శేఖర్ మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.



హతుడు శేఖర్ (ఫైల్)

# 'సుందరకాండ్ల కు అద్భుతమైన రెస్పాన్స్




సుందరకాండకు అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన ఆడియన్స్‌కు థాంక్ యూ. ఫ్యామిలీ, ఫ్రెండ్స్ తో కలసి థియేటర్స్ చూడండి. ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు: ప్రెస్ మీట్ లో హీరో నారా రోహిత్

హీరో నారా రోహిత్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ఖిసుందరకాండఖి. వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఖీశిశి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించారు. వృతి వాఘాని, శ్రీ దేవి విజయ్ కుమార్ హీరోయిన్స్ గా నటించారు. ఆగస్టు 27న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన విజయం సాధించి, సక్సెస్ ఫుల్ గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా మేకర్స్ థాంక్ యూ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో నారా రోహిత్ మాట్లాడుతూ..అందరికి నమస్కారం. ఖిసుందరకాండఖి కి వచ్చిన అద్భుతమైన రివ్యూలు చాలా ఆనందాన్నిచ్చాయి. థియేటర్స్ వచ్చి చాలా అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్న ఆడియన్స్ కి థాంక్యూ సో మచ్. సినిమాకి చాలా అద్భుతమైన పాజిటివ్ ఫీడ్ బ్యాక్ ఉంది. ఇంకా చూడని వాళ్ళు తప్పకుండా ఈ సినిమా చూడండి. టికెట్స్ అన్నీ కూడా చాలా రీజనబుల్ రేట్స్ లో ఉంచాము. ఫ్యామిలీతో ఈ వీకెండ్ వెళ్లి హ్యాపీగా చూడండి. ఫ్రెండ్స్ ఫ్యామిలీతో ఎంజాయ్ చేసే మంచి చిత్రం ఇది. మా టీమ్ అందరికీ పేరుపేరునా థాంక్యూ. వారి సపోర్టు చాలా ఇంపార్టెంట్. మా నిర్మాతలు చాలా అద్భుతమైన సహకారాన్ని అందించారు. సత్యకి నేను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను. తన క్యారెక్టర్ కి చాలా మంచి పేరు వచ్చింది. సత్య వల్ల థియేటర్స్ లో చాలా ఎంజాయ్ చేస్తున్నారు అని చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. వెంకీ రాసిన డైలాగ్ గురించి చాలామంది ప్రత్యేకంగా చెప్పారు. ఈ సినిమా విషయంలో మేమంతా చాలా హ్యాపీగా ఉన్నాం. ఇంకా చూడని వాళ్ళు కూడా ఈ వీకెండ్ చూసి మీ ఫీడ్ బ్యాక్ మాకు అందిస్తారని ఆశిస్తున్నాను. థాంక్యూ సో మచ్. డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సక్సెస్ లో భాగమైన మీ అందరికీ ధన్యవాదాలు. ఈ సినిమాని యాక్సెప్ట్ చేసిన ఆడియన్స్ కి థాంక్యూ. ఆడియన్స్ రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమా చూసి అందరూ నవ్వుకుంటున్నారని తెలిసి చాలా ఆనందంగా అనిపించింది. నవ్వించడం అంత ఈజీ కాదు. నా రైటింగ్ కి మంచి అప్రిసియేషన్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది. హీరో రోహిత్ అన్న, నిర్మాత సంతోష్ అన్న.. వాళ్ళిద్దరూ బిలీవ్ చేయకపోతే ఈ సినిమా మీ ముందు ఉండేది కాదు. ఎక్కడ రాజీ పడకుండా ఈ సినిమాని నిర్మించారు. చాలా క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చారు. ఇలాంటి నిర్మాతలు దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఇండస్ట్రీలో ప్రతి విషయం రోహిత్ గారి దగ్గర నేర్చుకున్నాను. సినిమా విషయంలో ఎంత నిజాయితీగా ఉండాలో నేర్పించారు. ఈరోజు నాకు వస్తున్న అభినందనలకు కారణం రోహిత్ అన్న గైడెన్స్. సత్య ఈ సినిమాకి చాలా హెల్ప్ అయ్యారు. ఆయన గురించి పాజిటివ్గా రాస్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా సినిమాని థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుతున్నాను.

హీరోయిన్ విర్తి వాఘాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాకి అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన ఆడియన్స్ అందరికీ ధన్యవాదాలు. సినిమాకి చాలా అద్భుతమైన రివ్యూస్ వస్తున్నాయి. ఐరా పాత్ర గురించి చాలా ప్రత్యేకంగా చెబుతున్నారు. వారి ప్రోత్సాహం నాకు ఎంతగానో ఉత్సాహాన్ని ఇస్తుంది. రోహిత్ గారితో కలిసి వర్క్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ ఇంత మంచి రెస్పాన్స్ ఇచ్చిన ఆడియన్స్ కి మరోసారి కృతజ్ఞతలు. నిర్మాత సంతోష్ మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. సినిమాకి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. రెస్పాన్స్ రోజు రోజుకి పెరుగుతుంది. యూఎస్ లో డే వన్ కంటే డే టు ఎక్కువ ఉంది. అది మాకు గొప్ప ఎనర్జీని ఇస్తుంది.

# 'జటాధర' ఫస్ట్‌లుక్



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా, జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా, ఎస్ కే గీ ఎంటర్టైన్మెంట్ జటాధర నుంచి శోభగా శిల్పా శిరోద్కర్ ఫస్ట్ లుక్ రిలీజ్ నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హై ఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్ గా వైరల్ అయ్యింది. మూవీ మేకర్స్ ఒక కీలకమైన కొత్త క్యారెక్టర్‌ని ఇంట్రడ్యూస్ చేశారు. శోభగా శిల్పా శిరోద్కర్ ని పరిచయం చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఆమె బ్లాక్ చీర కట్టుకుని, హోమగుండం ముందు కూర్చొని కనిపించారు. ఆ పోస్టర్ మొత్తం మిస్టికల్ ఎనర్జీతో తాంత్రిక శక్తులని సింబలైజ్ చేస్తోంది. శిరోద్కర్ ఇచ్చిన ఇంటెన్స్, సీరియస్ ప్రెజెన్స్ సినిమా సూపర్‌నాచురల్, స్పిరిచువల్ టోన్‌కి పర్ఫెక్ట్‌గా సూట్ అయింది. జీ స్టూడియోస్, ప్రెర్ణా అరోరా ప్రెజెంట్ చేస్తున్న ఈ సినిమాను ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రెర్ణా అరోరా ప్రొడ్యూస్ చేస్తున్నారు. మ్యూజిక్ జీ మ్యూజిక్ కో., క్రియేటివ్ డైరెక్షన్ దివ్య విజయ్. జీ స్టూడియోస్ స్ట్రాటజిక్ విజనరీ ఉమేష్ కుమార్ బన్సాల్ మద్దతుతో, ప్రొడ్యూసర్స్ శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్ప సింగాల్, కో ప్రొడ్యూసర్స్ అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుం అరోరా ఈ ప్రాజెక్ట్ కు మద్దత్తు ఇస్తున్నారు. టాయిలెట్: ఎక్ ప్రేమ్ కథ, ప్యాడ్‌మాన్, పరి వంటి హిట్స్ ఇచ్చిన ప్రెర్ణా అరోరా మళ్లీ హైకాన్సెప్ట్ సినిమాను రూపొందిస్తున్నారు. విజనరీ టీమ్, అద్భుతమైన కాన్సెప్ట్‌తో "జటాధర" ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ థియేట్రికల్ రిలీజ్‌లలో ఒకటిగా వస్తోంది. దేశవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న "జటాధర" ఇండియా సినిమాలో నెక్స్ట్ మైథాలజికల్ ఎపిక్ కాబోతుంది.

# మైథలాజికల్ థ్రిల్లర్ 'మయూఖం'

..పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన భారీ పాన్ ఇండియా మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ 100 ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ తో వస్తున్న తొలి ఇండియన్ సినిమా "మయూఖం"..

కుశలవ్, తన్మయి హీరో హీరోయిన్లుగా దర్శకుడు వెంకట్ బులెమోని రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ "మయూఖం".

'మయూఖం" చిత్రాన్ని సినెటేరియా మీడియా వర్క్స్ బ్యానర్ పై శ్రీమతి శ్రీలత వెంకట్ నిర్మిస్తున్నారు. వంద శాతం ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ తో వస్తున్న తొలి ఇండియన్ మూవీగా "మయూఖం" అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఈ రోజు పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి టీ సిరీస్ మ్యూజిక్ నుంచి ప్రియాంక మన్యాల్ క్లాప్ నివ్వగా, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుల సంఘం ప్రెసిడెంట్ వీర శంకర్ ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మూవీ టీమ్ కు బెస్ట్ విషెస్ అందించారు. ఈ కార్యక్రమంలో యాక్టర్ రాంకీ, బ్యాంకింగ్ కమిటీ చైర్మన్ హరి గోవింద్, రెడ్ ఎఫ్ఎం నుంచి మాజీ మార్కెటింగ్ మేనేజర్ బద్రినాథ్, ఫోర్స్ మోటార్స్ సంస్థ నుంచి శివకుమార్, మామ్ కంపెనీ సీఈవో రాహుల్, హీరో, నిర్మాత రాంకీ, తదితరులు పాల్గొన్నారు.






అనంతరం జరిగిన ప్రెస్ మీట్ లో

డైరెక్టర్ వెంకట్ బులెమోని మాట్లాడుతూ మా సినెటేరియా మీడియా వర్క్స్ సంస్థ ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ చేసింది. అందులో ప్రస్తుతం రాజా సాబ్ మూవీ ఉంది. మనమే, అహింస, ఆడవాళ్లు మీకు జోహార్లు..ఇలా దాదాపు 140 చిత్రాలకు మేము ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ చేశాం. ఇటీవలే డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి కూడా అడుగుపెట్టాం. మా సినెటేరియా మీడియా వర్క్స్ సంస్థ నుంచి "మయూఖం" అనే భారీ పాన్ ఇండియా మూవీని రూపొందిస్తున్నాం. ఈ రోజు ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ ఇది. ఆరేళ్లుగా కష్టపడి ఈ స్క్రిప్ట్ రెడీ చేశాను. దీన్నొక ఫ్రాంఛైజీలా, ఒక యూనివర్స్ లా క్రియేట్ చేయబోతున్నాం. వందశాతం ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ తో వస్తున్న తొలి ఇండియన్ మూవీ ఇదే. బాలీవుడ్ లో 60శాతం ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ తో గతంలో "తాల్" అనే మూవీ చేశారు. హాలీవుడ్ లో ఈ పద్ధతిలో మూవీస్ చేస్తుంటారు. మా సినిమాలో వందశాతం ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ చేసినా ఏ బ్రాండ్ కూడా మీకు ప్రోమోట్ చేసినట్లుగా కనిపించదు. హిస్టారికల్, మైథలాజికల్ అంశాలతో వాస్తవాల ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. అన్నారు.

డీవోపీ సిద్ధం మనోహర్ మాట్లాడుతూ వెంకట్ గారు నాకు చాలా కాలంగా పరిచయం. ఆయన ఒకరోజు పిలిచి జాతిరత్నాలు తర్వాత ఎందుకు ఎక్కువ సినిమాలు చేయలేకపోయావ్ అని అడిగారు. ఆ తర్వాత "మయూఖం" కథ వినిపించారు. కథ వినగానే సార్ మనం ఈ సినిమా చేస్తున్నాం. మిగతావి తర్వాత మాట్లాడుకుందాం అని చెప్పాను. ఆయన కథను చెప్పిన విధానం, చేసిన ప్రెజెంటేషన్ చూశాక ఇదొక గొప్ప సినిమా అవుతుందనే నమ్మకం ఏర్పడింది. సినిమా కోసం ప్యాషనేట్ గా కష్టపడే వెంకట్ గారికి ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇస్తుంది. ఈ సినిమాకు పనిచేయడం కోసం ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తున్నా అన్నారు. హీరో కుశ్ లవ్ మాట్లాడుతూ "మయూఖం" చిత్రంతో నా లైఫ్ లో మరో ఫేజ్ లోకి ఎంటర్ అవుతున్నా. డైరెక్టర్ వెంకట్ గారు ఎంత హార్డ్ వర్కర్ అనేది నాకు తెలుసు. ఈ చిత్రంలో బిజినెస్ పరంగానే కాదు టెక్నికల్ గా కూడా కొత్తగా ప్రయత్నిస్తున్నాం. మీ అందరికీ మా పర్ ఫార్మెన్స్ నచ్చుతుంది, మా సినిమాను మీరంతా ప్రేమిస్తారని నమ్ముతున్నాం. మా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ అన్నారు. హీరోయిన్ తన్మయి మాట్లాడుతూ "మయూఖం" సినిమాలో హీరోయిన్ గా నేను పర్ఫెక్ట్ గా సెట్ అవుతానని నమ్మి నాకు అవకాశం ఇచ్చిన డైరెక్టర్ వెంకట్ గారికి థ్యాంక్స్.

# విశాల్, సాయి ధన్సికల నిశ్చితార్థం

కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా విశాల్, సాయి ధన్సికల నిశ్చితార్థం.. విశాల్, సాయి ధన్సిక నిశ్చితార్థం ఆగస్ట్ 29న ఘనంగా జరిగింది. విశాల్, ధన్సిక ప్రేమ, పెళ్లి గురించి ఇప్పటికే అధికారిక ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. విశాల్, ధన్సిక ఇద్దరూ కూడా స్టేజ్ మీదే తమ ప్రేమ, పెళ్లికి సంబంధించిన విషయాల్ని ప్రకటించారు. ముందు చెప్పినట్టుగానే ఆగస్ట్ 29న ఈ ఇద్దరి పెళ్లికి అడుగులు పడ్డాయి.

కుటుంబ సభ్యుల సమక్షంలో విశాల్, సాయి ధన్సికల నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ మేరకు ఎంగేజ్మెంట్ ఫోటోల్ని విశాల్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో నేడు మా ఎంగేజ్మెంట్ ఘనంగా జరిగింది.. అందరి ఆశీర్వాదం మాకు కావాలి అంటూ సోషల్ మీడియాలో విశాల్ తాజాగా వేసిన ట్వీట్, షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.



విశాల్ ప్రస్తుతం "మకుటం" అనే మూవీ షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. విశాల్ కెరీర్‌లో 35వ చిత్రంగా రానున్న ఈ మూవీని సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద ఆర్ బి చౌదరి నిర్మిస్తున్నారు. "మకుటం" మూవీకి రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. సీ బ్యాక్ డ్రాప్, మాఫియా కథతో విశాల్ సరికొత్త యాక్షన్ ఎంటర్టైనర్‌గా మకుటం రూపొందుతోందని సమాచారం.

ఇక త్వరలోనే పెళ్లికి సంబంధించిన ఇతర వివరాల్ని విశాల్ ప్రకటించనున్నారు. ప్రస్తుతం విశాల్, ధన్సిక ఎంగేజ్మెంట్ సందర్భంగా కోలీవుడ్, టాలీవుడ్ ప్రముఖులు విషెస్ అందిస్తున్నారు.

# ధర్మవరం పోస్టర్ లాంచ్



వినాయక చవితి శుభపర్వదినం సందర్భంగా తెలుగు సినీ పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తున్న ధర్మవరం' సినిమా పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి గారు ఘనంగా ఆవిష్కరించారు.

ఈ చిత్రంలో రాజ్ వేంకటాచ్చ హీరోగా నటించడంతో పాటు కథ, చిత్రకథ, దర్శకత్వం వహించి, ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

కథానాయకుడిగా తన అద్భుతమైన నటనతో పాటు దర్శకుడిగా తన ప్రత్యేకమైన ముద్రను వేసేందుకు రాజ్ వేంకటాచ్చ ప్రయత్నిస్తున్నారు.

ప్రధాన పాత్రల్లో అజయ్, నవీన్ రెడ్డి, సంయోగీత, ఏశాన్ ఖాన్ కీలక పాత్రల్లో నటించారు. గ్రామీణ సాంప్రదాయాలు, సాంస్కృతిక విలువలు, కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసులను అలరించనుందనే నమ్మకాన్ని యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ వేంకటాచ్చ మాట్లాడుతూ –

"ధర్మవరం సినిమా నాకు ఎంతో ప్రాణమైన ప్రాజెక్ట్.

ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం మనసుకు హత్తుకునేలా ఉండేలా కష్టపడ్డాం. వినాయక చవితి పర్వదినం సందర్భంగా పోస్టర్ విడుదల కావడం మాకు ఒక శుభసూచకం. ప్రేక్షకుల ఆశీర్వాదాలు మాకుంటే ఈ సినిమా ఖచ్చితంగా విజయవంతం అవుతుంది" అని తెలిపారు.

అనిల్ రావిపూడి గారు మాట్లాడుతూ –

"ధర్మవరం పోస్టర్ చాలా బాగుంది. కొత్త ప్రయత్నం కనబడుతోంది. రాజ్ వేంకటాచ్చ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను" అన్నారు. ధర్మవరం" సినిమాను త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

# నాగచైతన్య ఎన్‌సి 24లో స్పర్శ్ శ్రీవాత్సవ

యువ సామ్రాట్ నాగ చైతన్య, కార్తీక్ దండు, ఎన్‌విసిసి, సుకుమార్ రైటింగ్స్ నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ ఎన్‌సి 24 కీలక పాత్రలో లాపతా లేడీస్ ఫేమ్ స్పర్ష్ శ్రీవాస్తవ

తండేల్ బ్లాక్ బస్టర్ సక్సెస్ తో అదరగొట్టిన యువ సామ్రాట్ నాగ చైతన్య, విరూపాక్ష దర్శకుడు కార్తీక్ దండుతో కలిసి నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ థ్రిల్లర్ విది24 చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి (ఎస్‌విసిసి), సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బివిఎస్‌ఎన్ ప్రసాద్, సుకుమార్ బి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. బాపినీడు సమర్పిస్తున్నారు.

లాపతా లేడీస్ ఫేమ్ స్పార్ష్ శ్రీవాస్తవను అఫీషియల్ గా ఈ చిత్రానికి స్వాగతించారు మేకర్స్. కిరణ్ రావు దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీవాస్తవ, ఇప్పుడు తొలిసారి తెలుగు సినిమాతో ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ పాత్ర ఆయన కెరీర్‌లో పాత్‌బ్రేకింగ్ అవుతుందని శ్రీవాస్తవకి టీమ్ బెస్ట్ విషెస్ తెలిపింది.

ఫస్ట్ గ్లింప్స్ విడుదలైన వెంటనే బిగ్ బజ్ క్రియేట్ చేసింది. సినిమా స్కేలు, ఇంటెన్స్ మూడ్‌ని ప్రజెంట్ ఫ్యాన్స్, సినిమా లవర్స్ అందరినీ ఆకట్టుకుంది.





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెద్ది కోసం మైసూర్‌లో జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో 1000+ మంది డ్యాన్సర్స్ తో సాంగ్ షూటింగ్

# గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ 'పెద్ది

ప్రారంభం. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పాన్ ఇండియా స్పెక్టకిల్ "పెద్ది", ఈ సినిమా కోసం స్టైలిష్ మేకోవర్స్, పవర్‌ఫుల్ ఫిజికల్ ట్రాన్స్‌ఫార్మేషన్, స్పెషల్ ట్రైనింగ్.. ఇలా అన్ని రకాలుగా క్యారెక్టర్‌కి పర్ఫెక్ట్‌గా సెట్ అవ్వడానికి తన బెస్ట్ ఇస్తున్నారు రామ్ చరణ్. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు భారీగా నిర్మిస్తున్న ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రెజెంట్ చేస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్, రామ్ చరణ్ మేకోవర్ ఫ్యాన్స్‌లో, సినిమా లవర్స్‌లో అంచనాలు పీక్స్‌కి తీసుకెళ్లాయి.

ఇప్పుడు మేకర్స్ మైసూర్‌లో రామ్ చరణ్ మీద ఒక గ్రాండ్ సాంగ్ షూట్ స్టార్ట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్న ఈ సాంగ్‌కి ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏఆర్ రహ్మాన్ మ్యాసీవ్ సాంగ్ ని అందించారు. వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో పిక్చరైజ్ అవుతున్న ఈ సాంగ్ కచ్చితంగా ఒక విజువల్ ఫీస్ట్ లా ఉంటుంది. రామ్ చరణ్ తన ట్రేడ్‌మార్క్ ఎనర్జీ, గ్రేస్‌తో చేసిన మాస్ స్టెప్స్ ఈ సాంగ్ ని హైలైట్‌గా నిలపడం ఖాయం. దేశం మొత్తం వినాయక చవితి పండుగ ఉత్సాహంలో వునప్పటికీ "పెద్ది" టీమ్ మాత్రం షూటింగ్‌లో బిజీగా ఉండి నిబద్ధతతో పనిచేస్తూనే ఉంది. ఈ డెడికేషన్ ని ఖచ్చితంగా అభినందించాలి.

ఈ చిత్రంలో జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. జగపతి బాబు, దివ్యేందు శర్మ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ రత్నవేలు, నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్. పెద్ది మార్చి 27, 2026న పాన్ ఇండియా గా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. నటీనటులు: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ.

సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన సమర్పకులు: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్. నిర్మాత: వృద్ధి సినిమాస్ నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఏఆర్ రెహమాన్, దీవోశి: ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై.ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్: ఫస్ట్ షో పిఆర్ఒ: వంశీశేఖర్.

# ఆనందంతో తినాలన్నదే మా లక్ష్యం



**పండుగలకో, వేడుకలకో... బంధువులూ, స్నేహితులూ అంతా ఒక చోట చేరటం, ఇష్టమైనవి వండుకుని తినటం, కబుర్లు చెప్పుకోవటం, నవ్వులు, ఆటపాటలు... ఆ మధుర జ్ఞాపకాలు తలచుకుంటేనే మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది కదా! మరి, ఆ ఫీల్ ఇప్పుడు ఉందా? అంటే... ఈ బిజీ జీవితాల్లో దానికి చోటెక్కడిది? అనేవారే ఎక్కువ. అందుకే, ఆ సంస్కృతిని తిరిగి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు సామాజిక కార్యకర్త. ఫిలాసఫిస్ట్ జోగు నిర్మల. 'కైండ్నెస్ కిచెన్' సరికొత్త జీవన విధానానికి శ్రీకారం చుట్టారీమె. ఆ విశేషాలు తెలుసుకుందాం..**

ఆన్‌లైన్ ఆర్డర్లు, యాప్ సినిమాలు... ఇప్పుడు ఇవే ట్రెండ్. ఇక స్నేహితులూ, బంధువులను కలవాలంటే, పెద్ద ప్రణాళికే వేయాలి. జీవితాల్లో సహజత్వం లేకుండా పోయింది. అందుకే, ఒకప్పటి ఆ సంస్కృతిని తిరిగి తీసుకురావడం నా ప్రయత్నం. అందులో భాగంగానే మావారు నరేష్‌తో కలిసి 'కైండ్ నెస్ కిచెన్' ప్రారంభించారు. ఆప్యాయత, ఆనందం, ప్రేమను ఇతరులకూ పంచాలి. అందుకు ఆహారం కంటే మంచి మాధ్యమం ఏముంటుంది? పైగా, మన భావోద్వేగాలూ వంటపై ప్రభావం చూపిస్తాయి. ఎలాంటి భావోద్వేగాలతో వండుతామో అవే ఆహారంలోకి వస్తాయి. కాబట్టి, మంచి ఫీలింగ్‌తో అందరూ కలిసి తినాలన్నదే మా లక్ష్యం.

**మట్టి ఇల్లు కట్టుకున్నాం..** మాది తెలంగాణలోని నిజామాబాద్. తాతయ్య ముంబయిలో స్థిరపడ్డారు. నేనూ అక్కడే పుట్టి పెరిగా. ఫిలాసఫీలో మాస్టర్స్ చేశా. 20ఏళ్లుగా అనేక సామాజిక సమస్యల పరిష్కారాల దిశగా పని చేస్తున్నాను. ఎన్జీవోలతో కలిసి సహజ ప్రసవం, తల్లిపాల దానం, మెన్స్ట్రువల్ హైజీన్, వాతావరణ మార్పులు, మానవ విలువలు... వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నా. నా భర్త నరేష్ కూడా తెలంగాణనే. అయితే, పాప పుట్టుక మా ఆలోచనల్ని మార్చేసింది. బిజీ జీవితాలు అర్థం లేదనిపించింది. రెండేళ్ల విరామం తీసుకుని వివిధ ప్రదేశాలకు వెళ్లాం. ముంబయి వదిలి, తమిళనాడులోని ఆరోవిల్లెలో ఓ మట్టి ఇల్లు నిర్మించుకుని ఉంటున్నాం. ఇది ఓ ఇంటర్నేషనల్ కమ్యూనిటీ. అక్కడికి వెళ్లాక జీవితాన్ని కొత్త కోణంలో చూడటం ప్రారంభించండి. ఒకప్పటి సామాజిక విధానాలను అలానే పాటించడం కాదు, అందులోని లోటుపాట్లు అర్థం చేసుకోని ముందుకెళ్లాలి అని గ్రహించాలి. అందుకే, మా పాప, బాబు ఇద్దరినీ ఇంట్లోనే(హోమ్ స్కూలింగ్) చదివిస్తున్నా. ఇదేకాదు... మొదట్లో మా కమ్యూనిటీలో వారానికో, రెండు వారాల కోసారో అందరం కలిసి వండుకుని తినేవాళ్లం. దీన్ని చూసి తెలిసిన వాళ్లూ ఇలాంటివి మా దగ్గర ఏర్పాటు చేయొచ్చు కదా... అని అడిగేవారు. అందుకు అంగీ కరించాం. క్రమంగా, మహిళా గ్రూపులూ, సొసైటీలూ ఆహ్వానించటం మొదలు పెట్టాయి. ప్రస్తుతం వరంగల్, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి... ఇలా అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాలు చేస్తున్నాం. కైండ్నెస్ కిచెన్ కార్యక్రమాలన్నీ జీరో వేస్ట్ కాన్సెప్ట్ చేసేవే ఒకరికొకరు సహకరించుకుంటూ వంట చేసుకోవ టం, అరటాకుల్లో వడ్డించుకుని కింద కూర్చోనే తినటం తప్పక పాటిస్తాం. ప్రోగ్రామ్‌లో పాల్గొనే సభ్యుల సంఖ్య 25-30 కంటే ఎక్కువ కాకుండా చూసుకుంటాం. అందులోనూ, వీగన్ ఆహారానికే మా ప్రాధాన్యత, పది హేను రోజులకోసారి ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఆటపాటలు, నైపుణ్యాలను పంచు కోవటం... వంటి అనేక యాక్టివిటీలూ జరుపు కుంటాం. ఈ పుడమి అందరిదీ. ఇక్కడున్న వనరులను తరవాతి తరాలకు అలానే అందించాల్సిన బాధ్యత మనదే అందుకు తగ్గ జీవనశైలిని ఎంచుకోవటం మన చేతిలోనే ఉంది. □



# ఆడబిడ్డలకు ఆ నలుగురు ఆదర్శం



**వనజాక్షి, వీణ, గౌరమ్మ, వాణి, శిరీష**

ఇంట్లో ఒకరిద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమే కష్టం. అలాంటిది ఒకే ఇంటి నుంచి నలుగురు అక్కాచెల్లెళ్లు ఉద్యోగాలు సాధించి ప్రత్యేకతను చాటుకున్నారు! సాధారణంగా ఆడపిల్లలు పుట్టగానే చదువుకంటే ముందుగా... పెళ్లికి ప్రణాళికలు వేసుకునే తల్లిదండ్రులు ఉన్నారు. కానీ చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం వేపమాకులపల్లెకు చెందిన సీతప్పగారి మునివెంకటప్ప, గౌరమ్మ అందుకు భిన్నం. వీళ్ల పిల్లల చదువుల గురించి ఆలోచించండి. వీరిది సాధారణ రైతు కుటుంబం. వీరికి నలుగురు కుమార్తెలు. వీణాకుమారి, వాణి, వనజాక్షి , శిరీష ఆరుగాలం కష్టపడినా... పెట్టుబడులైనా దక్కని వ్యవసాయం! అయినా రాజీ పడకుండా పిల్లల్ని ఉన్నతంగా తీర్చిదిద్దారా తల్లిదండ్రులు. 2007లో మునివెంకటప్ప అనారోగ్యంతో మృతిచెందారు. అప్పటికి పిల్లలు ఇంకా చిన్నవాళ్లే. చదువులూ పూర్తికాలేదు. ఆ తల్లిది దిక్కుతోచని పరిస్థితి. ఆ సమయంలో పిల్లలు తల్లి కష్టాన్ని గుర్తించి వీలు దొరికినప్పుడల్లా ఇంటి పని, వ్యవసాయంలో సాయం చేసేవారు. ఇలా నలుగురు కుమార్తెలూ డిగ్రీ పూర్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా నిరంతరం శ్రమించి పోటీలకు హాజరయ్యేవారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఇంటిల్లిపాది ఓర్చుకుని బ్యాంకు, పోలీస్, టీచరు... ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేవారు. వారి కష్టానికి ఫలితంగా పెద్ద కుమార్తె వీణాకుమారి 2014లో కానిస్టేబుల్‌గా, 2016 డీఎస్సీలో వాణి ఎస్టీగా ఉద్యోగాలు సాధించారు. రెండేళ్ల వ్యవధిలో ఇద్దరు కుమార్తెలకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో ఆ తల్లి మనసు కొంత కుదుటపడింది. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అమ్మాయిని కానిస్టేబుల్, టీచరుగా చేస్తున్న అమ్మాయిని టీచరే వివాహం చేసుకోవడం మరింత సంతోషాన్ని ఇచ్చింది. మిగిలిన ఇద్దరు అమ్మాయిలూ ఉద్యోగాలు సాధిస్తే బాగుంటుందని అల్లుళ్లూ ప్రోత్సహించారు. గత నెలలో విడుదలైన పోలీస్ ఉద్యోగాల ఫలితాల్లో వనజాక్షి కానిస్టేబుల్‌గా, తాజా డిఎస్సీ ఫలితాల్లో శిరీష సెకండరీ గ్రేడ్ టీచరుగా ఎంపికయ్యారు. తల్లి కష్టాన్నీ, నమ్మకాన్నీ వమ్ము చేయకుండా ఆశయాన్ని సాధించిన కుమార్తెలూ.. కూతుళ్లను ఉద్యోగులుగా చూడాలని పట్టుబట్టి చదివించిన తల్లీ.. వీరి కథ అందరికీ స్ఫూర్తిదాయకమే కదా! □

# పరికిణీకి పూలల ఓణీ..





అప్పుడే కాలేజీలో అడుగుపెట్టన అమ్మాయైనా.. ఇద్దరు పిల్లల తల్లయినా.. మనవళ్ల, మనవరాళ్లని చూసుకుని మురిసిపోయే బామ్మయినా.. మనసు పారేసుకునే దుస్తులేవంటే లంగాఓణీ పేరు చెప్పాల్సిందే! దాని అందమే వేరు. అందుకే తరాలెన్ని మారినా ఫ్యాషన్ ప్రపంచంలో రారాణిలా వెలుగుతోందీ వస్త్ర శ్రేణి. అమ్మాయిలే లక్ష్మీదేవిలా నట్టింట తిరిగితే చక్కని అనందం. చట్టుకున్న కట్టేసుకోవాలన్నా.. బుట్టబొమ్మలా కనిపించాలన్నా లంగాఓణీ కాకుండా మరొకటి ఉంటుందా? అలాగని ఎప్పుడూ పట్టేనా? మరీ మెడన్‌గా కనిపించినా బాగోదు. కాబట్టి, కొత్తగా కోరుకునేవారు మనసు పారేసుకుంటోందీ ఈ పూల ఓణీలపైనే! పరికిణీ పట్టుదైనా, కాటన్, రేయాన్, నెట్ వంటి ఆధునిక రకానిదైనా వీటిని జతచేసి మరిసిపోతున్నారు మెత్తని సిల్క్ ఓణీ.. దానిపై ఆకర్షించే కలంకారీ, పిచ్‌వాయీ, మధుబనీ.. వంటి ఏళ్లనాటి కళలతోపాటు మోడరన్ ఆర్ట్‌నీ అద్దుకున్న పూలు.. చూడచక్కగా లేవూ? పూల సుకుమారం ఉన్న అమ్మాయిలు వాటినే చుట్టుకుని మరింత మెరవడం ఖాయమనిపించట్లేదు? సందర్భమూదైనా చక్కగా ఇమిడిపోవాలి అనుకునే అమ్మాయిలకు ఈ మినిమల్ ఫ్యాషన్ మరింత నప్పడం ఖాయం. పైగా సందర్భాన్ని బట్టి.. దీన్నే లెహెంగా స్టైల్‌లోనూ వేసుకోవచ్చు. కాబట్టే.. ఈ తరహా లంగాఓణీలకే అమ్మాయిల ఓటిప్పుడు.

మీదీ ఈ తరహా ఆలోచనేనా? అయితే.. డిజైన్ చేయించుకోండి మరి.







# ముఖానికి మొక్కజొన్న



**ఈ కాలంలో దొరికే మొక్క జొన్నతో ఆరోగ్యమే కాదు.... అందాన్నీ సొంతం చేసుకోవచ్చు. అదెలాగంటారా?**

✦ నలుగు మృతకణాలు పేరుకుపోతే చర్మం మెరుపు తగ్గుతుంది. ఇలాంటప్పుడు కప్పు తాజా మొక్కజొన్న పిండిలో, చెంచా తేనె, అరచెక్క నిమ్మరసం కలిపి ఒంటికి రాయండి. కాసేపాగి నీళ్లతో తడిపి... నలుగులా రుద్దుకుంటే మురికి వదిలిపోతుంది. చర్మం నున్నగా మెరిసిపోతుంది.

✦ క్లెన్సింగ్ కప్పు పచ్చి మొక్కజొన్న గింజల్ని మెత్తగా రుబ్బుకోవాలి. దానికి కాస్త గులాబీ నీరు, చెంచా తేనె కలిపి ముఖానికి ప్యాక్ వేయండి. అరగంటయ్యాక శుభ్రం చేసుకుంటే చర్మం తాజాగా కనిపిస్తుంది..

✦ ఫేస్ ప్యాక్ తక్కువ సమయంలో ముఖం కాంతిమంతంగా మారాలంటే గుప్పెడు పచ్చి మొక్కజొన్న గింజల్ని మెత్తగా రుబ్బుకుని అందులో కాస్త పాలపొడి, చెంచా పంచదార కలపాలి. దీన్ని ముఖానికి రాసుకుని 20 నిమిషాలయ్యాక నీళ్ల చల్లి మృదువుగా రుద్దుతూ శుభ్రం చేసుకుంటే సరి. □

# కొత్తిమీర ప్రయోజనం

ఆరోగ్య భాగ్యం




**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

ఇది చిన్న మృధువైన తేలికైన హెర్బల్ మొక్క. ఈ ధనియాల మొక్కలో అపారమైన ఔషధ విలువలున్నాయి. దీన్ని కొరియాండమ్ సాటివమ్, ధాన్యకా, సిలాన్‌ట్రో, చైనీస్ ఫారల్స, ధనియా పత్తా అని అంటారు. ఇది మొదట ఇటలీలో పుట్టి ప్రపంచ మంతటా సాగులో ఉండే సూపర్ ఫుడ్ అని చెప్పవచ్చు. ఇది స్పానిష్ పదం నుండి వచ్చింది. దీని అర్థం మొక్కజొన్న లాంటిది అని ఇది మంచి సువాసన కల్గి ఆహారంలో ప్రత్యేకమైన రుచికి ఉపయోగపడే సుగంధ మూలిక అని చెప్పవచ్చు. అన్ని వంటకాల్లో విరివిగా అందరూ వాడదగ్గ మొక్క. ఇది వేడిని తగ్గించి చలువ చేస్తుంది. **పోషకాలు :** 100 గ్రాముల కొత్తిమీర ఆకులు, కాడల్లో ఉండే పోషకాలు: కార్బో హైడ్రేట్స్: 5 గ్రా, ప్రోటీన్స్-3 గ్రా. పీచు: 280 గ్రా, ఐరన్-8 మి.గ్రా, కాల్షియం: 140 మి.గ్రా, ఫాస్పరస్- 60 మి.గ్రా, సోడియం - 46 మి.గ్రా, పొటాషియం-52 1 మి.గ్రా, మిటమిన్ ఎ-67, 480 మి.గ్రా, విటమిన్ సి-27 మి.గ్రా, మినరల్స్-2.3 ల.గ్రా, మెగ్నీషియం - 26 మి.గ్రా, విటమిన్ ఇ-2.50 మి.గ్రా, నీరు : 86.3, కేలరీలు : 44 కేలరీలు.


**ప్రయోజనాలు :** కొత్తిమీరలో అధికంగా ఉండే మినరల్స్, విటమిన్స్ వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఇది కార్మినేటివ్‌గా గ్యాస్ ట్రబుల్, ఎసిడిటీ, అజీర్ణం, కడుపుబ్బరం, పైత్యం, త్రేన్పులు, వికారం, వాంతుల్ని, మెలలు, విరేచనాల్ని తగ్గించడంలో పనిచేస్తుంది. అధిక ఆకలిని తగ్గించి, అధిక ఆహారాన్ని తీసుకోనీయకుండా, జీర్ణక్రియ సక్రమంగా జరిగేలా చేస్తుంది. జీర్ణాశయాన్ని శక్తివంతం చేయటమే కాకుండా దాని పని తీరును మెరుగు పరుస్తుంది. పచ్చి ఆకుల్ని నమిలిన, కొత్తిమీర రసాన్ని పుక్కిలించిన నోటిపూత, నోటి, పెదవుల పగుళ్ళు, పుండ్లు, నోటి దుర్వాసన చిగుళ్ళ వాపు, చిగుళ్ళ నుంచి రక్తం కారడాన్ని తగ్గిస్తుంది. చిగుళ్ళు, దంతాల నొప్పులు తగ్గించి, చిగుళ్ల, దంతాలు దెబ్బతినకుండా వాటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇది రక్తంలోని గ్లూకోజ్ స్థాయిల్ని నియంత్రించే హైపోగ్లెసీమిన్‌గా పనిచేస్తుంది. ఇది బి.పి.ని తగ్గించి ఎల్‌డిఎల్ అనే చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి, అధిక బరువును తగ్గించి, ఎథిరోస్క్లరోసిస్ రాకుండా కాపాడుతుంది. శ్వాసని తాజాగా ఉంచుతుంది. క్షయ, ఉబ్బసం, ఎలర్జీల్ని, శ్వాసనాళికల్లో కఫాన్ని తగ్గిస్తుంది. ఇది గట్‌ఫ్లోరాలో మంచి బాక్టీరియా వృద్ధికి తోడ్పడి అల్సరేటివ్ కొరైటిస్, క్రాన్స్ డిసీజ్, ప్రేగుపూత, అమీంబియాసిస్, మలబద్ధకం వంటి వ్యాధుల్ని తగ్గించి మెటబాలిక్ ప్రక్రియకు తోడ్పడుతుంది. కొత్తిమీరలోని ఎసెన్షియల్ ఆయిల్స్ వల్ల శరీరంలో డిటాక్స్ డ్రింక్‌గా హైపర్ ప్రొటెక్టివ్‌గా లివర్‌ని రక్షిస్తుంది. లివర్ పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరంలో వాపుల్ని మంటల్ని తగ్గించి, మూత్రాన్ని జారీచేసి శరీరంలోని అదనపు సోడియం, ఇతర మలినాల్ని బైటికి పంపి రీసల్ హైపర్ టెన్షన్‌ని తగ్గించే డయాలిటిక్‌గా పనిచేస్తుంది కిడ్నీల్ని శుభ్రపరచి యూరిన్ ఇన్ఫెక్షన్, యూరిన్ బంధిపబడడం, కిడ్నీ స్టోన్స్ ని తగ్గించి మూత్ర విసర్జకంగా పనిచేస్తుంది. ఇది సౌందర్య పోషణలోను ఉపయోపగడుతుంది. ఇది జుట్టు మూలాల్ని బలపర్చడం,జుట్టు రాలిపోవడం, జుట్టు చిట్లిపోవడం, చుండ్రు వంటి సమస్యల్ని తగ్గించి కేశ సౌందర్యనికి ఉపయోగపడుతుంది. పెదవుల రంగు, మెరుపుకి మంచిది, పెదవుల వాపుని తగ్గిస్తుంది. చర్మంపై వచ్చే మొటిమలు, మంగు, నల్లమచ్చలు, బ్లాక్‌హెడ్స్ పొడి లేదా జిడ్డు చర్మనికి క్లెన్సర్‌గా పనిచేసి చర్మాన్ని ఆరోగ్యంగా వుంచుతుంది. అలాగే చర్మంపై ముడతలు పగుళ్ళు రాకుండా వృద్ధాప్య చిహ్నాల్ని తగ్గించి చర్మాన్ని కాంతి వంతంగా నునుపుగా ఉంచుతుంది. దద్దుర్లు, ఎలర్జీలు, మంటలు, వాపులు, కాలిన గాయాలు, దురదలు వంటి చర్మవ్యాధుల్ని విషపురుగులు కుట్టిన చోట కొత్తిమీర రసం పూసిన విషం తగ్గిస్తుంది. హరిస్తుంది. హెపటైటిస్, కామెర్లు వ్యాధికి, కాలేయ శుద్ధికి ఉపయోగపడుతుంది, కొత్తిమీరలోని ఐరన్‌వల్ల రక్తహీనత లేకుండా రక్తశుద్ధికి రక్తకణాల ఉత్పత్తికి, బ్లడ్ ప్యూరిఫైయర్‌గా, బ్లడ్ బిల్డర్‌గా పనిచేస్తుంది. కొత్తిమీరలోని డుడిసినాల్ సమ్మేళం వల్ల ఆహారాన్ని విషతుల్యం చేసే ఫుడ్ పాయిజనింగ్‌లో సాల్మోనెల్లా బాక్టీరియాని నిర్వీర్యపరుస్తుంది. ఇది అంతర్గత అవయవాల్లో నొప్పిని తగ్గించే ఆంటీస్పాస్ మొడిక్‌గా పనిచేస్తుంది. విటమిన్ 'ఎ' వల్ల కళ్ళ మంటలు, కళ్ళవాపులు, కండ్ల కలక, కనురెప్పలు మ్యూకస్‌తో అంటుకొనిపోవడం, కళ్ళ దురదలు, కంటి నరాలపై ఒత్తిడి తగ్గించి, కంటి బల హీనతను, రేచీకటిని తగ్గించి ఆరోగ్యకరమైన కంటి ఆరోగ్యాన్ని కల్గిస్తుంది. □

# టెక్ నెక్ బాధిస్తోంది ?



మెడ పట్టేసిందా... పక్కకి తిప్పలేకపోతున్నారా.. భుజాల్లోనూ వీపు పై భాగంలోనూ నొప్పిగా ఉందా? అయితే మీరు 'టెక్ నెక్' బారినపడ్డారన్నమాటే అదేపనిగా తల కిందకి వంచి ఫోన్‌లోకి చూడటం, టెక్స్ట్ చేయడం లేదా ల్యాప్టాప్‌లో పనిచేయడం వల్ల వస్తుందా? దీన్నే 'టెక్స్ట్ నెక్' అని అంటారు. ఆయా భాగాల్లోని కండరాలు సంకోచించడం, నరాలమీద పడే ఒత్తిడి వల్ల మెదడు ఎటూ కదపలేం సరికదా నొప్పి వస్తుంది దీర్ఘకాలం పాటు పట్టించుకోకుండా వదిలేస్తే తలని పక్కకి తిప్పలేక పోవడమే కాదు, వయసు పెరిగేకొద్దీ వెన్ను సమస్యలూ, చేతుల వరకూ తిమ్మిర్లూ వస్తాయి. ఆడామగాకీ ఇద్దరికీ ఈ సమస్య కనిపిస్తుంది ఆడవాళ్లలోనే ఇది ఎక్కువ. మగవాళ్లతో కనిపిస్తున్న ఆడవాళ్లలో మెడ కండరాలు చిన్నగా ఉండటంతోపాటు బెడ్ మీద కూర్చొని పనిచేయడం వల్ల ఇవి ఒత్తిడికి గురవు తున్నాయి. నెలసరి లేదా మెనోపాజ్‌లో హార్మోన్ల హెచ్చు తగ్గులూ ఈ సమస్యకు మరో కారణం. ఎలా తగ్గించుకోవాలి? తలలనుకీ పైకీ కాకుండా భుజాలకు అనుగుణంగా ఉంచి నిటారుగా కూర్చోవాలి. స్క్రీన్‌కి మీ కళ్లకే మధ్య 2030 మధ్య దూరం ఉండాలి. మధ్య మధ్యలో స్క్రీన్ నుంచి విరామం తీసుకుని మెడనీ భుజాలనీ కదిలించాలి. కంప్యూటర్ మానిటర్ లేదా ఫోన్ స్క్రీన్‌ని కంటికి ఎదురుగా ఉండేలా చూసుకోవాలి. సీటులో కూర్చున్నప్పుడు మోకాళ్లను తుంటికి సమాంతరంగా ఉంచి, పాదాలను నేలకు ఆనిం చాలి. మధ్యమధ్యలో లేచి మెడనీ, భుజాలనీ కదిలిస్తూ చిన్న చిన్న వ్యాయామాలు చేయడం ద్వారా కండరాలలో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అప్పటికీ తగ్గకపోతే వైద్యులను సంప్రదించాల్సిందే..□

# పూజలో పుస్తకాలు ఎందుకు?



**వినాయక** శబ్దంలోని 'వి' అనేది విశ్వం, విశిష్టత, విశాలతలకు ప్రతీక. వినాయకుడు నాయకులలో విశిష్టుడు, విశ్వ పూజనీయుడు, 'శుక్లాంబరధరం విష్ణుం' అంటూ గణేశుని విష్ణువుగా భావించి పూజిస్తాం. విష్ణుమూర్తి వలె గణేశుడు వ్యాపన శక్తి కలిగినవాడు. ప్రసన్నత ప్రతిఫలించే గజముఖుణ్ణి 'ప్రసన్న వదన ధ్యాయేత్' అంటూ అర్చిస్తాం. వ్యాసుడు మహాభారతాన్ని వినాయకుడి చేత రాయించదలచుకున్నాడు. అలా చెప్పినప్పుడు 'ఆపకుండా చెబితే రాస్తాను' అంటూ గణేశుడు షరతు పెట్టాడు. బదులుగా వ్యాసమహర్షి అర్థం చేసుకుని రాయాలింటూ ప్రతి షరతు విధించాడు. ఏదైనా వేగంగా సాగాలి అన్నది గణపతి సందేశం. ఏ విషయాన్నైనా అర్థం చేసుకున్న తర్వాతే లిఖించాలి అన్నది మహర్షి ప్రబోధ వినాయకుడు లిఖించిన భారతం పంచమ వేదమైంది. తొలి లేఖకుడైన గణపతి పూజలో పుస్తకాలు,కలము ఉంచడం సంప్రదాయమైంది. □



ఆధ్యాత్మికం

# సంతాన సమస్యలకు ధనురాసనం!



ధనురాసనం! హార్మోనుల్లో అసమతుల్యత, నెలసరి సమస్యలు.. అమ్మతనాన్ని అడ్డుకునే కారణాలెన్నో! ధనురాసనం ప్రయత్నించండి.. ఈ సమస్యలను దూరం చేస్తుంది. ధనుస్సు అంటే విల్లు.. ఈ ఆసనంలో శరీరం విల్లులా కనపిస్తుంది. కాబట్టే, ధనురాసనమని పేరు. దీన్ని వేయడానికి ముందు బోర్లా పడుకోవాలి. నెమనమదిగా మెకాళ్లను మడిచి, రెండు చేతులతో కాళ్ల చీలమండ లను పట్టుకోవాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ ఛాతీని నేల నుంచి పైకి లేపాలి. ఇదే క్రమంలో కాళ్లనూ తొడభాగం వరకు పైకి లేపాలి. శరీరం మొత్తం పొట్టపైనే ఆధారపడి ఉంటుంది. శరీరాన్ని బిగదీసినట్లుగా కాకుండా వీలైనంత ప్రశాంతంగా ఉంచాలి. దీర్ఘశ్వాస తీసుకుని వదులుతూ 15 సెకన్లపాటు ఉండి, నెమ్మదిగా ఛాతీనీ, కాళ్లను కిందకి దింపాలి. ఆపై శవాసనంలో విశ్రాంతి తీసుకోవాలి. ఈ ఆసనం వెన్నెముకను దృఢపరుస్తుంది. హార్మోన్ల అసమతుల్యతను తగ్గించి, నెలసరిని క్రమం చేస్తుంది. ప్రత్యుత్పత్తి అవయవాలు, మూత్రపిండాలకూ మేలు చేస్తుంది. దీంతోపాటు శరీరానికి తగినంతగా ప్రొటీన్, ఐరన్ అందేలా చేసుకోండి. జంక్‌ఫుడ్‌కి దూరంగా ఉంటూ బీట్‌రూట్, నట్స్, బెల్లం, అవిసెలు వంటివాటికి ప్రాధాన్యం ఇవ్వండి. □

# మాంచెస్టర్ ఒరిజినల్స్ అద్భుత విజయం



**న్యూఢిల్లీ:** ది హండ్రెడ్ మెన్స్ లీగ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ గ్రూప్‌కు చెందిన నార్తర్న్ సూపర్ చార్జర్స్‌కు షాక్ తగిలింది. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న ది హండ్రెడ్ లీగ్‌లో సూపర్ జెయింట్స్ గ్రూప్‌కు చెందిన మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టు అద్భుతమైన విజయం సాధించింది. ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టుకు ఇది మూడవ విజయం మాత్రమే. 30వ లీగ్ మ్యాచ్‌లో సూపర్ చార్జర్స్‌పై మాంచెస్టర్ 6 బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

## ది హండ్రెడ్ మెన్స్ లీగ్‌లో సూపర్‌చార్జర్స్ ఓటమి

దీనికి కారణం వికెట్ కీపర్‌బ్యాట్స్‌మెన్ జోస్ బట్లర్, న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ రచిన్ రవీంద్రల అద్భుతమైన పార్ట్‌నర్‌షిప్. వీరిద్దరూ కేవలం 48 బంతుల్లోనే మ్యాచ్‌ను తిప్పేశారు. 140 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన మాంచెస్టర్‌కు శుభారంభం దక్కలేదు. కేవలం 31 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో జోస్ బట్లర్, రచిన్‌రవీంద్రలుకలిసి మూడో వికెట్‌కు 48 బంతుల్లో 99 పరుగుల మెరుపు భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ మ్యాచ్‌లో బట్లర్ కేవలం 37 బంతుల్లో 5 సిక్సర్లు, 7 ఫోర్లతో 70 పరుగులు చేసి జట్టు విజయాన్ని సులభం చేశాడు. రచిన్ రవీంద్ర 23 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 47 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ ఫిల్ సాల్ట్ కేవలం 9 పరుగులు మాత్రమే చేయగలిగాడు. చివరికి మాంచెస్టర్ 16 బంతులు మిగిలి ఉండగానే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. సూపర్‌చార్జర్స్ బౌలర్లలో జాకబ్ డఫీ, రషీద్ ఖాన్, టామ్ లాడ్జ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక బ్యాటింగ్ చేసిన నార్తర్న్ సూపర్‌చార్జర్స్ కూడా ఆరంభంలో తడబడింది.

73 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో డేవిడ్ మిల్లర్ (30), సమిత్ పటేల్ (42) ఆరో వికెట్‌కు 27 బంతుల్లో 59పరుగులు జోడించి జట్టు స్కోరును గౌరవప్రదమైన స్థితికి చేర్చారు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ 20పరుగులు మాత్రమే చేయ గలిగాడు. చివరికి సూపర్‌చార్జర్స్ నిర్ణీత 100 బంతుల్లో 8 వికెట్లకు 139 పరుగులు చేసింది. మాంచెస్టర్ బౌలర్లలో టామ్ ఆస్పిన్‌వాల్ 3 వికెట్లు పడగొట్టగా, జేమ్స్ ఆండర్సన్, జోష్ టంగ్యూ చెరో 2 వికెట్లు తీసుకున్నారు. ఈమ్యాచ్‌లో ఓడిపోయి నప్పటికీ సూపర్‌చార్జర్స్ 8 మ్యాచ్‌లలో 5 గెలిచి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలోఉంది. మాంచెస్టర్ ఒరిజినల్స్ ఈ విజయంతో ఆరో స్థానానికి చేరుకుంది.



## ఆసియా కప్ హాకీలో.. భారత్ గెలుపు

### 4-3 తేడాతో చైనా ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ హాకీలో భారత్ చైనాపై 4-3 తేడాతో విజయం సాధించింది. మూడు పాయింట్లతో తమ ప్రచారాన్ని ప్రారంభించిన భారత పురుషుల హాకీ జట్టు శుక్రవారం చైనాపై హ్యాట్రిక్ సాధించింది. భారత జట్టు తరఫున కెప్టెన్ హార్మన్‌ప్రీత్ సింగ్ (20 నిముషం, 33 నిముషం, 47 నిముషం) అద్భుతమైన ప్రదర్శన చేసి హ్యాట్రిక్ సాధించాడు. జుగ్‌రాజ్ సింగ్ (18) స్కోరు షీట్‌లోకి ఎక్కిన మరో భారత ఆటగాడు కాగా, చైనా జట్టుకు షిహావో డు (12), బెన్‌హాయ్ చెన్ (35), మరియు జీషెంగ్ గావో (41) గోల్స్ చేశారు. చివరికి చైనా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకున్నారు. తరువాత షిహావో డు (12) ద్వారా గోల్‌ను గోల్‌గా మార్చడంతో గోల్ సాధించారు. భారత్ మొదటి క్వార్టర్‌ను ఆధిక్యంలో ముగించింది. అయితే, చైనా 1-0తో ఆధిక్యంలోఉంది. రెండవ క్వార్టర్‌ను భారత్ దూకుడుగా ప్రారంభించి చైనాపై ఒత్తిడి పెంచడంలో రాణించింది. మూడు 9నిమిషాల వ్యవధిలో, భారతదేశం పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. మరియు జుగ్‌రాజ్ సింగ్ (18) దానిని గోల్‌గా చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. కొద్దిసేపటికే, భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించింది, కెప్టెన్ హార్మన్‌ప్రీత్ సింగ్ (20) గోల్ చేసి స్కోరును 2-1తో సమం చేశాడు. హాఫ్ టైం బ్రేక్ తర్వాత కెప్టెన్ హార్మన్‌ప్రీత్ సింగ్ (33) క్వార్టర్‌లోని మొదటి పెనాల్టీ కార్నర్‌ద్వారా 3-1తో స్కోరును సాధించాడు. చైనా స్పందించింది మూడవ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. మరియు బెన్‌హై చెన్(35) గోల్‌గా మార్చుకుని 3-2తో స్కోరును సాధించింది. ఆట ముగియడానికి 20 నిమిషాలు మిగిలిఉండగా, చైనా రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. క్వార్టర్ ముగిసేసమయానికి, 2 జట్లు 3-3తో సమంగా ఉన్నాయి. అయితే హార్మన్‌ప్రీత్ సింగ్ (47) ధైర్యంగా తన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు, ఆతిథ్య జట్టుకు 4-3 ఆధిక్యాన్ని అందించాడు.

## ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో.. ముగిసిన ధ్రువ్-తనీషా ప్రచారం



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ధ్రువ్-తనీషా ప్రచారం క్వార్టర్ ఫైనల్స్‌లో ముగిసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో శుక్రవారం ఇక్కడ మలేషియా ద్వయం చెన్ టాంగ్ జీ-తో ఈ వీ చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపో యింది. ధ్రువ్-తనీషా మలేషి యన్లతో జరిగిన మ్యాచ్‌లో 15-21, 13-21 తేడాతో పరాజయం చెందారు. తొలి రౌండ్‌లో బై పొందిన 16వ సీడ్ భారత ద్వయం, ఐరిష్ ద్వయం జాషువా మాగీ- మోయా ర్యాన్‌పై విజయంతో తమ బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత వారు ఐదవ సీడ్ టాంగ్ చున్ మాన్ మరియు చైనాలోని హాంకాంగ్‌కు చెందిన త్సే యింగ్ సూట్‌పై ఓటమి పాలయ్యారు. ప్రారంభ గేమ్‌లో ఓడిపోయిన తర్వాత వెనుకబడిన భారత జోడీ 19-21, 21-12, 21-15 తేడాతో టైను ముగించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

కానీ మలేషియన్లను ఓడించిన తర్వాత చివరి 16 దశలో తమ ప్రచారం ముగించింది. మరోవైపు, పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌చిరాగ్ జంట మలేషియా రెండో సీడ్ ఆరోన్ చియా సోహ్ వూయియిక్‌తో తలపడనుంది. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జంట ఆరో సీడ్ వాంగ్ చాంగ్/లియాంగ్ వీ కెంగ్‌పై 19-21, 21-15, 21-17 తేడాతో విజయం సాధించి, చైనాతో వరుసగా నాలుగు పరాజయాలను ఎదుర్కొని క్వార్టర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్

# అంకుర్‌కు స్వర్ణం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ డబుల్ ట్రాప్‌లో కొత్త కాంటినెంటల్ రికార్డుతో అంకుర్ మిట్టల్ స్వర్ణం సాధించాడు. శుక్రవారం కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో మాజీ ప్రపంచ నంబర్ 1, 2018 చాంగ్‌వాన్ ప్రపంచ ఛాంపియన్ అంకుర్ మిట్టల్ కొత్త ఆసియా ఛాంపియన్‌షిప్ రికార్డును సృష్టించాడు. ఈ స్వర్ణంతో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో 52 స్వర్ణాలు, 26 రజతాలు, 25 కాంస్య పతకాలతో భారత్ మొత్తం 103కి చేరింది. డబుల్ ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో భాను ప్రతాప్ సింగ్ మరియు హర్షవర్ధన్ కవియాతో కలిసి అంకుర్ మిట్టల్ జట్టు కాంస్యం గెలుచుకున్నాడు. అంకుర్ 107 హిట్‌లతో నాలుగు రౌండ్లలో 30 చొప్పున ఆధిక్యంలో నిలిచి 26, 28, 26, మరియు 27 స్కోర్‌లతో బంగారు పతకాన్ని సాధించాడు. కజకిస్తాన్‌కు చెందిన స్థానిక షూటర్ ఆర్టియోమ్ చికులాయేవ్ 98 పాయింట్లతో రజతం గెలుచుకోగా, కువైట్‌కు చెందిన అహ్మద్ అలఫాసి షూట్ ఆఫ్‌లో 96 మరియు +2 పాయింట్లతో కాంస్యం సాధించాడు. డబుల్ ట్రాప్ జూనియర్ విభాగంలో, హాతీమ్ ఖాన్ మొహమ్మద్ 89 హిట్స్‌తో రజతం గెలుచుకోగా, మానవ్‌రాజ్‌సిన్హ్ చుడాసమా 87 హిట్స్‌తో కాంస్యం సాధించాడు. వారిద్దరూ వినయ్ ప్రతాప్ సింగ్ చంద్రవత్ (81)తో కలిసి ఈ ఈవెంట్‌లో టీమ్ స్వర్ణం గెలుచుకున్నారు. డబుల్ ట్రాప్ మహిళల విభాగంలో అనుష్క సింగ్ భాటి (93), రాజ్‌కువర్ ప్రణిల్ ఇంగ్లే (89), మరియు యేషాయ హాఫీజ్ కాంట్రాక్టర్ (87) వరుసగా స్వర్ణం, రజతం మరియు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఈ ఈవెంట్‌లో ఈ ముగ్గురూ టీమ్ స్వర్ణం కూడా గెలుచుకున్నారు.

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో

# సింధు పరాజయం



**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2025లో వార్దానీ చేతిలో పివి సింధు పరాజయం పాలైంది. దీంతో భారత పతక ఆశలు సాత్విక్‌చిరాగ్‌పై ఆధారపడి ఉన్నాయి. శుక్రవారం ఇండోనేషియా 9వ సీడ్ పుత్రి కుసుమ వార్దానీ చేతిలో క్వార్టర్ ఫైనల్ ఓటమితో చారిత్రాత్మక ఆరో బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాన్ని సాధించాలనే సింధు ఆశలు ముగిశాయి. రౌండ్ ఆఫ్ 16 పోరులో ప్రపంచ నంబర్ 2, చైనాకు చెందిన వాంగ్ ఝీ యినిపై ఆధిపత్యం సాధించిన సింధు ఒక గంటా నాలుగు నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో వర్దానీ చేతిలో 14-21, 21-13, 16-21 తేడాతో ఓడిపోయింది. ఆట మధ్యలో ఆట విరామ సమయానికి 117 ఆధిక్యంలోకి వెళ్లేందుకు స్కోరు 6-6తో సమమైన తర్వాత వార్దానీ విరమించుకోవడంతో సింధు ఆటను ప్రారంభించినా 21-14తో వెనుకబడింది. అయితే, రెండవ గేమ్‌లో 4-3తో ఆధిక్యంలో ఉన్న తర్వాత, సింధు వరుసగా ఆరు పాయింట్లు సాధించి నియంత్రణ సాధించింది. వార్దానీ మూడు పాయింట్లు వెనక్కి తీసుకోగలిగినా కానీ సింధు తన ఆధిపత్యాన్ని కొనసాగించి విరామంవరకు 11-6 ఆధిక్యంతో కొనసాగింది. నిర్ణయాత్మక గేమ్‌లో వార్దానీ ముందంజలో నిలిచినా 17-16 వద్ద, ఇండోనేషియా క్రీడాకారిణి నాలుగు వరుస పాయింట్లు సాధించి సెమీఫైనల్లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది.



# స్టాక్ సూచీలపై అమ్మకాల ఒత్తిడి

### నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,ఆగస్టు 29:** దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, ట్యారిఫ్ కలవరం సూచీల సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. శుక్రవారం ట్రేడింగ్‌లోకూడా మార్కెట్లు ఊగిసలాడుతూ చివరకు నష్టాలతోనే ముగిసాయి. సెన్సెక్స్ 80 వేల మార్కును నష్టపోయింది. నిఫ్టీ 24,500 దిగువకు పడిపోయింది. సెన్సెక్స్ 80,010 వద్ద లాభాలతో ప్రారంభం అయి ఒకదశలో 80,300కి కూడా వెళ్లింది. అయితే ఆజోరుకొనసాగలేదు.

దిగ్గజ రంగాల షేర్లలో అమ్మకాల సూచీలు ఒత్తిడిపెరిగింది. దీనితో 79,741.76 పాయింట్ల వద్ద సెన్సెక్స్ ట్రేడింగ్ నిలిపివేసింది. 270.92 పాయింట్లనష్టంతో 79,809.65 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 74.005 పాయింట్లు తగ్గి 24,426.85వద్ద స్థిరపడింది.నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఐటిసి, భెల్, ట్రెంట్ ఏసియన్ పెయింట్స్ షేర్లు రాణించాయి. మహీంద్ర అండ్ మహీంద్ర ఇన్ఫో సిస్, అపోలో హాస్పిటల్స్, ఆదాని ఎంటర్‌ప్రైజెస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఇక భారత్ రూపాయి సుంకాల భారంతో భారీగా పతనం అయింది. 88 మార్క్‌దాటి మరీక్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 61 పైసలు క్షీణించి 88.19 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ రూపాయి విలువలు 3శాతం పడిపోయాయి.

## ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్‌గా ఉర్జిత్‌పటేల్!



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ డాక్టర్ ఉర్జిత్ పటేల్ అంతర్జాతీయ స్థాయిలో మరో కీలక పదవికి నామినేట్ అయ్యారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆయన నియమితులయ్యారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల్లో భారత్ వాణిని మరింత బలంగా వినిపించేందుకు ఇది దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

ఈ నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఆమోదం తెలిపినట్లు సిబ్బంది, శిక్షణ విభాగం (డిఒపిటీ) అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉర్జిత్ పటేల్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఉర్జిత్ పటేల్‌కు ఐఎంఎఫ్‌తో పనిచేసిన అనుభవం ఉంది. 1992లో ఆయన న్యూఢిల్లీలో ఐఎంఎఫ్ డిప్యూటీ రెసిడెంట్ రిప్రజెంటేటివ్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆర్‌బీఐలో డిప్యూటీ గవర్నర్‌గా సేవలు అందించి, 2016లో 24వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో ద్రవ్య విధానం, ఆర్థిక పరిశోధన, గణాంకాలు, సమాచార నిర్వహణ వంటి కీలక విభాగాలను పర్యవేక్షించారు.

భారతదేశంలో ద్రవ్యోల్బణాన్ని లక్ష్యంగా చేసుకునే విధాన రూపకల్పనలో ఉర్జిత్ పటేల్ కీలక పాత్ర పోషించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు కన్సల్టెంట్‌గా కూడా పనిచేశారు. ప్రభుత్వ పదవులతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐడీఎఫ్‌సీ, ఎంసీఎక్స్ వంటి ప్రైవేట్ సంస్థల్లోనూ ఉన్నత హోదాల్లో పనిచేశారు. ప్రతిష్ఠాత్మక యేల్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పట్టా పొందారు.

## ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి!

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** భారతదేశ ఆర్థిక వృద్ధి, కార్పొరేట్ ఆదాయాలపై 50 శాతం అమెరికా సుంకాల ప్రభావంపై ఉద్రిక్తత మధ్య భారత రూపాయి యూఎస్ డాలర్‌తో పోలిస్తే 87.97కి పడిపోయింది. ఇది ఆల్‌టైమ్ కనిష్టం. ఈ వారం నుండి అమలు చేయనున్న కొత్త సుంకాల కారణంగా భారత కరెన్సీ ఒత్తిడిలో ఉంది. అయితే ఫిబ్రవరిలో గత స్థాయికంటేఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 87.9563 ను అధిగమించి, డాలర్‌తో పోలిస్తే కరెన్సీ 0.4 శాతం తగ్గి 87.9763 కు చేరుకుంది. ఈ సంవత్సరం స్థానిక ఈక్విటీల నుండి నిరంతరం విదేశీ ఉపసంహరణల కారణంగా రూపాయి ఆసియాలో అత్యంత చెత్త పనితీరు కనబరిచిన కరెన్సీగా నిలిచింది. వస్త్రాలు, పాదరక్షలు, ఆభరణాలు వంటి ఎగుమతి ఆధారిత పరిశ్రమలను లక్ష్యంగా చేసుకుని యూఎస్ సుంకాలను ప్రధానంగా పెంచారు. అయితే అమెరికా సుంకాలను తట్టుకొని నిలబడుతూ తమ రైతుల, వ్యాపారాలను రక్షించుకుంటామని ఇప్పటికే ప్రధాని మోడీ ప్రకటించారు. కాగా, రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తుండటంతోనే భారత్‌పై భారీ సుంకాలు విధించినట్లు అమెరికా చెబుతోంది. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేయడం ఆపితేనే సుంకాలు తొలగిస్తామని ఇప్పటికే ట్రంప్ భారత్‌ను హెచ్చరించారు. ట్రంప్ వార్నింగ్‌ను ఏ మాత్రం లెక్కచేయని ప్రధాని మోదీ, రష్యాతో వాణిజ్యం కొనసాగుతుందని ప్రకటించారు. మరి ఈ క్రమంలో రుపాయి విలువ రికార్డు స్థాయికి పడిపోయింది.

# సెప్టెంబరులో బ్యాంకు సెలవులు ఇవే!

**ముంబయి, ఆగస్టు 29:** బ్యాంకు పనుల కోసం తరచూ బ్రాంచీలకు వెళ్లేవారికి ఇది ముఖ్య గమనిక. సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా బ్యాంకులకు భారీగా సెలవులు రానున్నాయి. పండుగలు, వారాంతాలతో కలిపి మొత్తం 14 రోజుల పాటు వివిధ రాష్ట్రాల్లో బ్యాంకులు మూసి ఉండనున్నాయి. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన సెలవుల క్యాలెండర్‌లో వెల్లడించింది. అయితే, ఈ సెలవులన్నీ అన్ని రాష్ట్రాలకు వర్తించవు. సెప్టెంబర్ నెలలో పండుగలు, ఇతర ప్రత్యేక రోజుల కారణంగా మొత్తం 9 రోజులను ఆర్బీఐ సెలవులుగా ప్రకటించింది. వీటికి అదనంగా ఐదు వారాంతపు సెలవులు (ఆదివారాలు, రెండు, నాలుగో శనివారాలు) ఉన్నాయి. దీంతో మొత్తం సెలవుల సంఖ్య 14కు చేరింది. ఈ సెలవులు రాష్ట్రాలను బట్టి మారుతూ ఉంటాయి. కేరళలో ఓనం పండుగకు ఇచ్చే సెలవు ఇతర రాష్ట్రాల్లో ఉండదు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సెప్టెంబర్ 5న (శుక్రవారం) మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా బ్యాంకులకు సెలవు ప్రకటించారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కర్మ పూజ (జార్ఖండ్), ఇంద్రజాత్ర (సిక్కిం), నవరాత్రి స్థాపన (రాజస్థాన్), దుర్గా పూజ (బెంగాల్, అసోం, త్రిపుర) వంటి పండుగల సందర్భంగా బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. వారాంతపు సెలవులు ఇవే సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ఆదివారాలు. సెప్టెంబర్ 13 (రెండో శనివారం), సెప్టెంబర్ 27 (నాలుగో శనివారం). బ్యాంకు శాఖలు మూసి ఉన్నప్పటికీ ఆన్‌లైన్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం సేవలు యథావిధిగా 24 గంటలూ అందుబాటులో ఉంటాయి.

# వచ్చే యేడాదే జియో ఐపిఓ

వాణిజ్యం

## ఎజిఎంలో ముకేష్ అంబానీ వెల్లడి




**ముంబయి, ఆగస్టు 29:** జియో పబ్లిక్ ష్యూ 2026 తొలి అర్ధభాగంలో రానున్నట్లు ఆ కంపెనీ ఛైర్మన్ ముకేష్ అంబానీ వెల్లడించారు. ఈ మేరకు 48వ వార్షిక సాధారణ సమావేశం (ఎజిఎం)లో శుక్రవారం ప్రకటించారు. రిలయన్స్ జియో 500 మిలియన్ల వినియోగదారుల మైలురాయిని దాటిందని తెలిపారు. రిలయన్స్ గత 3 సంవత్సరాలలో రూ. 5.6 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టిందని చెప్పారు. వార్షిక ఆదాయంలో 125 బిలియన్లను దాటిన భారతదేశంలో మొట్టమొదటి సంస్థగా అవతరించిందని పేర్కొన్నారు. జియో ఐపిఒ దాఖలు చేయడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయ్. ఈ విషయాన్ని ప్రకటించడం నాకు గర్వకారణం. 2026 మొదటి ఆర్ధభాగం నాటికి జియోను స్టాక్‌మార్కెట్లో లిస్ట్ చేయాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. గ్లోబల్ కాంపిటీటర్స్‌కు మించిన విలువను మన జియో సృష్టించగలదని నేను మీకు హామీ ఇస్తున్నానని ముకేష్ అంబాని భరోసా ఇచ్చారు. ఎజిఎంలో ముకేష్ అంబానీ జియో భవిష్యత్ ప్రణాళికలను ప్రకటించారు. జియో భవిష్యత్ కోసం గొప్ప ఆశయాలతో కూడిన ప్రణాళికలు ఉన్నాయి. ఇవి ఐదు హామీలపై ఆధారపడి ఉన్నాయి. అవి ఏమిటంటే, 1. జియో ప్రతి భారతీయుడిని మొబైల్, హోమ్ బ్రాడ్‌బ్యాండ్‌తో కనెక్ట్ చేస్తుంది. జియో ప్రతి భారతీయ గృహాన్ని జియో స్మార్ట్ హోమ్, జియో టీవీ ప్లస్, జియో టీవీ ఓఎస్, సీమ్‌లెస్ ఆటోమేషన్ లాంటి డిజిటల్ సేవలతో శక్తిమంతం చేస్తుంది.

జియో ప్రతి భారతీయ వ్యాపారాన్ని డిజిటలైజ్ చేస్తుంది. సరళమైన, సురక్షితమైన, స్కేలబుల్ ప్లాట్ ఫామ్‌లతో ఇండియన్ బిజినెస్‌లను అనుసంధానం చేస్తుంది. జియో భారత్‌లో ఎఐ విప్లవాన్ని సృష్టిస్తుంది. మా నినాదం అందరికీ ప్రతిచోటా ఎఐ. జియో తన సొంత టెక్నాలజీతో భారత్ వెలుపల కూడా తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. అంటే ప్రపంచ వ్యాప్తంగా జియో సేవలను విస్తరిస్తుంది. జియో ఇప్పటి వరకు చేసిన ప్రయాణం కంటే, ఇక ముందు పయనించాల్సిన మార్గం మరింత ప్రకాశవంతంగా ఉంటుందని ముకేష్ అంబానీ అన్నారు. జియోకు 500 మిలియన్ల కస్టమర్లు రిలయన్స్ జియో మరో వారంలో 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతుంది.

ఈ సమయంలో జియో కుటుంబం 500 మిలియన్ కస్టవర్లను దాటిందని చెప్పడానికి నేను గర్వపడు తున్నట్లు ముకేష్ అంబానీ అన్నారు. అంతేకాదు భారత్‌లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఆధార్, జియో వంటి ఇనీషియేటివ్‌లతో జియో పునాది వేసిందని ముకేశ్ అంబానీ పేర్కొన్నారు భారత్‌లో ఎక్కడి నుంచైనా ఉచితంగా వాయిస్ కాల్స్ చేసేందుకు జియో వీలు కల్పించింది. కోట్లాది మంది భారతీయులకు మొబైల్ ఫోన్‌లో విడియోలను చూడడం అలవాటుగా మార్చింది. ఆధార్, యూపిఐ లాంటి వాటితో సహా భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు జియో పునాది వేసింది. భారత డిజిటల్ ఎకో సిస్టమ్‌ను సృష్టించడానికి జియో వీలుకల్పిస్తుంది. 100 కంటే ఎక్కు యూనికార్న్‌లకు మద్దతు ఇస్తూ భారత దేశంలో, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంలో జియో సహాయపడింని ముకేష్ అంబానీ పేర్కొన్నారు.

# రాష్ట్రాల రాబడికి జిఎస్టీ సవరణల గండి!

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** జిఎస్టీ మండలి ఈసారి నిర్వహించిఏ సమావేశం అత్యంత కీలకంగా మారనుంది. మంత్రుల బృందం అందించిన సర్వే నివేదికలు ఆమోదించడంతోపాటు రెండే రెండు శ్లాబులుగా నిర్ణయంచి ఆమోదించడం కూడా కీలకమే. అయితే ఈ శ్లాబులవల్ల రాష్ట్రాల ఆదాయాలకు గండిపడుతుందేమోనని కలవరం వ్యక్తం అవుతోంది. కేవలం రెండు శ్లాబులు మాత్రమే ఇకపై ఉంటాయని ప్రధాని మోడీ ఇప్పటికే ప్రకటించారు. దీనికి సంబంధించి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రతిపాదనను కౌన్సిల్‌కు పంపినట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానం వల్ల రాష్ట్రాలకు ఆదాయం తగ్గుతుందేమోనని కొన్ని రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒకవేళ ఆదాయం తగ్గితే, దాన్ని భర్తీ చేయడానికి ఒక మార్గం ఉండాలని రాష్ట్రాలు కోరుతున్నాయని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ చెప్పారు. 8నెలల తర్వాత జిఎస్టీ మండలి సమావేశాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం జిఎస్టీ కౌన్సిల్ కనీసం మూడు నెలలకు ఒకసారి సమావేశం కావాలి. కానీ డిసెంబర్ 2024లో జరిగిన చివరి సమావేశం తర్వాత, ఇప్పుడు సుమారు ఎనిమిది నెలల తర్వాత ఈ కొత్త సమావేశం జరుగుతోంది. ప్రస్తుతం రేట్లు సవరించడం వల్ల సిమెంట్‌పై ప్రస్తుతం ఉన్న 28శాతం జిఎస్టీ రేటును 18శాతానికి తగ్గించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఈ తగ్గింపు నిర్మాణ రంగానికి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఊతమిస్తుంది. వ్యక్తులు కొనుగోలు చేసే టర్మ్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా పాలసీలపై జిఎస్టీని పూర్తిగా రద్దుచేసే ప్రతిపాదన కూడా కౌన్సిల్ ా+ముందుకు రానుంది. సెలూన్‌లపై విధించే 18శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించవచ్చని అంచనా. ఆహార, వస్త్ర వస్తువులన్నింటినీ 5శాతం పన్ను శ్లాబ్‌లోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. ఇది ఆహార, వస్త్ర పరిశ్రమలలో వర్గీకరణ సమస్యలను తొలగించి, పన్ను విధానాన్ని మరింత సులభతరం చేస్తుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.